మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

సోమవారం MONDAY 22.12.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 197 ‖ వెల (Price) రూ.6.50

సోమవారం, సూర్యోదయం: 6-42, సూర్యాస్తమయం: 5-47. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం హేమంత రుతువు పుష్య మాసం శుక్ల పక్షం తిథి: విదియ ఉదయం 10-52 వరకు, తదుపరి తదియ. నక్షత్రం: ఉత్తరాషాఢ తెల్లవారుజామున 5-32 వరకు. వర్జ్యం: పగలు 12-13 నుంచి పగలు 1-57 వరకు. రాహుకాలం: ఉదయం 8-05 నుంచి ఉదయం 9-28 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-36 నుంచి పగలు 3-33 వరకు. అమృతకాలం: రాత్రి 10-37 నుంచి రాత్రి 12-20 వరకు.



• వి విల్ ఫైట్..!



తెలంగాణ జనం కసిగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది.

తెలంగాణ భవన్‌లో సింహం అడుగుపెట్టింది.

ఈ ప్రభుత్వం.. సర్వ భ్రష్టం!

కేసీఆర్ జల గర్జన

రేవంత్ సర్కారు మీద యుద్ధభేరి మోగించింది. కేసీఆర్ రెండేండ్ల వ్యూహాత్మక మౌనం ఆదివారంనాడు పెను విస్ఫోటమై.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగి పారేసింది. సర్కారు విధానాలతో రాష్ట్ర ప్రయోజనాలకు గండి పడుతున్న తీరును కేసీఆర్ వివరిస్తుంటే గంటన్నరపాటు లక్షలమంది టీవీలకు అతుక్కుపోయారు.

కేసీఆర్‌ను చూస్తే.. తెలంగాణకు ఓ గుండెధైర్యం!
ఆయన చిరునవ్వు.. సమస్త జనావళికి ఓ భరోసా!
ఆయన మాట్లాడితే.. వెయ్యేనుగుల ఘీంకారం!
ఆయన ప్రశ్నిస్తే.. అది దద్దరిల్లే ధిక్కారం!
కేసీఆర్ పిడికిలెత్తితే.. మరోపోరుకు కదనశంఖం!

సుదీర్ఘ విరామం తర్వాత కేసీఆర్ మీడియా సమావేశం.. అనేక సందేహాలను పటాపంచలు చేసింది. ఆయన ఆరోగ్యంపై అసందర్భ ప్రేలాపనలను తుత్తునియలు చేసింది. నైరాశ్యంలో నిండిన రైతాంగానికి ఒక నమ్మికను ఇచ్చింది. హామీల అర్రాసు పాటకు మోసపోయి, వంచనకు గురైన ప్రజానీకానికి ఓ ధైర్యాన్ని కలిగించింది. 'అడ్డెవరు? అడిగేవాళ్లెవరు?' అన్నట్టు విర్రవీగుతున్న కాంగ్రెస్ పాలకులకు.. గులాబీ అధినేత హెచ్చరిక గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నది.

ట్రిబ్యునల్ డిపెండబుల్ వాటర్ కేటాయింపుల లెక్కల నుంచి, ఫార్మాసిటీ జీరో లిక్విడ్ డిశ్చార్జి టెక్నాలజీ వరకు.. సమగ్ర విషయ పరిజ్ఞానంతో, సాధికారతతో వివరించి చెప్పగలిగిన మరో నాయకుడు ఉన్నాడా? కేసీఆర్ తప్ప! 'నల్లమల ఏ బేసిన్‌లో ఉన్నది' అని అధికారులను అడిగి తెలుసుకునే సబ్జెక్ట్ లేని ముఖ్యమంత్రులు ఉన్నచోట.. ట్రిబ్యునళ్ల చరిత్రను, ప్రాజెక్టుల పంపకాలను, నీటి లెక్కల్ని, రాష్ట్రాల వాటాల్ని కేసీఆర్ నీళ్లు తాగినట్టు గడగడా చెప్పిపారేశారు. అదీ ముఖ్యమంత్రి పదవినుంచి దిగిన రెండేండ్ల తర్వాత కాగితం చూడకుండా, ఎవ్వరి సాయం లేకుండా! ఇలాంటి నేత తెలంగాణలో ఇంకొకరున్నరా? కేసీఆర్ తప్ప! అందుకే, అధికారంలో ఎవరున్నా.. కేసీఆర్ వైపే చూసింది తెలంగాణ!

కుర్చీలో కాంగ్రెస్ కూర్చున్నా..
తెలంగాణకు దిక్సూచి కేసీఆరే!

ఫైళ్లు ప్రభుత్వం దగ్గరున్నా..
ఫైర్ ఉన్నది కేసీఆర్ వద్దే!

పాలమూరుపై ప్రశ్నించే హక్కు కేసీఆర్‌కుగాక, ఇంకెవరికున్నది? రాజోలిబండ నుంచి రాళ్లురప్పల తొవ్వల కాలినడకన నడిచిండు కేసీఆర్! గంజి కేంద్రాలకు అంగలార్చిన నేలన.. పుట్లకొద్దీ ధాన్యపు పుటలు లిఖించిండు కేసీఆర్! వలస బాటపట్టిన పల్లెలకు.. ఉన్న ఊర్లనే ఎవుసం పండుగజేసిండు కేసీఆర్! పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్‌లోకి తెచ్చి, కరువు నేలకు నీళ్లుతాపిండు కేసీఆర్! అదే పాలమూరునుంచి ప్రారంభించి, ప్రజాక్షేత్రంలో సర్కారు మీద ఉద్యమిస్తామని కేసీఆర్ చేసిన ప్రకటన తెలంగాణ నలుదిక్కులా ప్రతిధ్వనిస్తున్నది.

ఏ నీటికోసం ప్రజలు ఉద్యమించి తెలంగాణ తెచ్చుకున్నారో ఆ నీరే దారి మళ్లుతుంటే కేసీఆర్ చేతులు ముడుచుకొని కూర్చోడని ప్రజలకూ తెలుసు. మిన్నూ మన్నూ ఏకం చేసైనా తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది కేసీఆర్ మాత్రమేననీ వారికి తెలుసు.

ప్రాజెక్టు ఆగిపోతే రైతు అడుగుతడో లేదోగని, కేసీఆర్ అడుగుతడు. నీళ్లు రాకపోతే ఎండిన పొలం ప్రశ్నిస్తదో లేదోగని, కేసీఆర్ నిలదీస్తడు. అందుకే కేంద్రం-ఏపీ కలిసి ఆడుతున్న కపట నాటకంలో చేవలేక, చేతగాక నీళ్లునములుతున్న కాంగ్రెస్ పాలనలో.. కేసీఆర్ వచ్చిండు! ప్రశ్నించిండు! మళ్లీ ఉద్యమిస్తున్నడు! ఆయనే స్వయంగా చెప్పినట్టు..

ఇప్పటిదాక ఒక లెక్క. ఇక నుంచి ఒక లెక్క!

సర్వభ్రష్ట పాలనకు వచ్చే మూడేండ్లు.. ముచ్చెమటలే!

ఏకబిగిన నాలుగున్నర గంటలు

ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలోనూ, తర్వాత మీడియా భేటీలోనూ ఉల్లాసంగా నవ్వుతూ సహచరులను, సభికులను నవ్విస్తూ ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. సమావేశంలో ఆయన గంటన్నరసేపు నిలబడి నిరాఘాటంగా ప్రసంగించారు. మరో గంటన్నరసేపు సహచరులతో చర్చలు జరిపారు. మరో గంటన్నర సేపు విలేకరుల సమావేశం నిర్వహించారు.

పాలమూరు కోసం ప్రజా యుద్ధం

కేంద్రం-బాబుతో కాంగ్రెస్ సర్కారు కుమ్మక్కు

గోదావరిని చెరబడుతూ.. కృష్ణాలోనూ కుట్రలు!

కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి పంపితే సప్పుడులేదు

90 టీఎంసీలు హక్కుంటే.. 45 చాలు అంటరా?

నా తెలంగాణకు నష్టం జరిగితే ఊర్కుంటనా?

ఎవరితోనైనా కొట్లాడుతం.. తోలుతీస్తం: కేసీఆర్



రెండేండ్లలో కాంగ్రెస్ తట్టెడు మట్టి తియ్యలె!

పాలమూరుకు కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయాన్ని సవరించేందుకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 2015 జూన్ 11న శ్రీకారం చుట్టింది కేసీఆర్ ప్రభుత్వం. 2023 సెప్టెంబర్ 16న ఎత్తిపోతల స్టేజ్-1 ట్రయల్‌రన్‌ను ప్రారంభించింది. నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద బటన్ నొక్కగానే కండ్ల ముందు కృష్ణమ్మ ఉవ్వెత్తున ఎగిసిపడ్డ దృశ్యమిది. మరి, రెండేండ్లలో ఏమైంది? కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా తీయలేదు! గజం పని కూడా చేపట్టలేదు!

మా హయాంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసినం
170 టీఎంసీలు లక్ష్యంగా పాలమూరును చేపట్టినం
27 వేల ఎకరాలు సేకరించి.. 90% పూర్తిచేసినం
ఈ ప్రాజెక్టుకు సర్కారు రెండేండ్లలో పైసా ఇయ్యలేదు
ఎందుకు పక్కనబెట్టిండ్రు? ఇంత నిష్క్రియాపరత్వమా?

ఇదేం దద్దమ్మ ప్రభుత్వం? ఇంత చేతగానితనమా?
పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండల్లో సభలు పెడ్తం
నేనే రంగంలోకి దిగిన. బహిరంగ సభలకూ వస్తా
మన హక్కులకు అన్యాయంపై ఊరూరా డప్పు కొడ్తం
కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు ఏకంగావాలె

ఉమ్మడి మహబూబ్‌నగర్‌ను పచ్చగ చేయాల్నని ఎన్నో అవరోధాలు దాటుకొని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసినం. కాంగ్రెస్ వచ్చినంక తట్టెడు మట్టి తీయలేదు సరికదా.. కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి పంపితే కుయ్యిలేదు.. కుటుక్కులేదు. డీపీఆర్‌ను వెనక్కి పంపితే భూమి, ఆకాశాన్ని ఏకం చేసి లొల్లి చేయాల్సింది పోయి ప్రభుత్వం సప్పుడుజేస్తలేదు.

మాకు రెండు బాధ్యతలున్నయ్.. ఒకటి తెలంగాణ తెచ్చిన పార్టీగా.. ప్రధాన ప్రతిపక్షంగా రాష్ట్ర హక్కులు, నీళ్లు, ప్రయోజనాలను రక్షించుకోవాలె. ప్రజలను ఎన్ని రోజులు వంచిస్తరు? ప్రభుత్వాలను నిద్రపోనివ్వం. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం. జరిగే అన్యాయాన్ని, జల దోపిడీని ఎండగడుతం. తెలంగాణ కోసం ఎంతదాకైనా పోతం. నేనే రంగంలోకి దిగుతున్న. వి విల్ ఫైట్. -కేసీఆర్

ఒక్క దెబ్బకు ఉక్కిరి బిక్కిరి!

ఉలిక్కిపడ్డ ముఖ్యమంత్రి.. నీళ్లు నమిలిన ఉత్తమ్
ఒకరి తర్వాత ఒకరు సంజాయిషీలిచ్చిన వైనం
కేసీఆర్ ప్రశ్నలకు జవాబు చెప్పలేక తిట్ల దండకం
నేడు హుటాహుటిన మంత్రులతో భేటీకి నిర్ణయం



బహిరంగ సభల ప్రకటనలపై వెన్నులో వణుకు
సభలొద్దు.. అసెంబ్లీలో చర్చిద్దామని విన్నపాలు
రేవంత్ పేరే ఎత్తని కేసీఆర్



మీటింగ్ ఏదైనా నా సావు కోరుడేనా!

ఇది కరెక్టయితదా..?
గింత అక్కసు ఉంటదా మనుషులకు!
ప్రజలు అన్నీ చూస్తున్నరు: కేసీఆర్

ఇదో ప్రభుత్వమా? అసలు ప్రభుత్వం ఉన్నదా రాష్ట్రంల?

- అర్రాస్ లెక్క హామీలిచ్చి, ప్రజల్ని నిండాముంచుతరా?
- ముసలోళ్లకు రూ.4వేల పెన్షన్ ఏమైంది? ఎప్పుడిస్తరు?
- వంతారా ఎందుకు?.. జూపార్క్ భూములు అమ్ముకొనేతందుకా?
- గురుకుల పొల్లగాండ్లను సాదే తెలివిలేదుగని.. ఫ్యూచర్‌సిటీ కడుతవా?
- ఇస్తానన్న 2500కే దిక్కులేదు.. కోటిమందిని కోటీశ్వరుల్ని చేస్తవా?
- కల్యాణలక్ష్మికి తులం బంగారం కలిపి ఇస్తమన్నరు? ఏమైంది?
- బ్యాంకుకు పోయి లోన్లు తెచ్చుకోమంటివి? చేసినవా రుణమాఫీ?
- వంద రోజులల్ల ఇస్తామన్న 12 లక్షల దళితబంధు ఏమాయె?
- 500 బోనస్ అన్నరు. వడ్లు కొనడానికే చేతులొస్తలేవు ఎందుకు?
- షాప్‌లలో లేని యూరియా బస్తాలు.. యాప్‌లలో ఉంటయా?
- పెరిగిన భూముల ధరలు నేడు ఎందుకు కుప్పకూలిపోయినయ్?
- శాంతిభద్రతలేవి? నడిరోడ్లపైనే మర్డర్లు, మానభంగాలా?

ఎంతసేపూ రియల్ ఎస్టేట్ దందాలేనా?

ఫ్యూచర్ సిటీ కాదు.. రియల్ ఎస్టేట్ ముసుగులో లూటీ
హైదరాబాద్ ఉజ్వల భవిష్యత్తు కోసం ఫార్మాసిటీ తెచ్చినం
14వేల ఎకరాలు సేకరిస్తే, కాంగ్రెస్ అమ్ముకోజూస్తున్నది
ఎంవోయూలు, పెట్టుబడులు బోగస్.. ఎందుకీ వంచన?
నాడు బాబు చేసిన డ్రామాలే.. ఈ ప్రభుత్వం చేస్తున్నది
దిక్కుమాలిన పాలసీలతో ఏం చేస్తరు ఈ రాష్ట్రాన్ని?
రెండేండ్లు ఓపికబట్టినం.. ఇకనుంచి ఎక్కడికక్కడ నిలదీస్తం
సర్కారుపై నిప్పులు చెరిగిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

రైలు టికెట్ చార్జీల పెంపు

26 నుంచి అమల్లోకి... › 8

అమ్మకానికి ధూపదీపం!

దేవాలయాల ఎంపికలో మంత్రి పేషీ చేతివాటం
ముడుపులు చెల్లించిన వారికే జాబితాలో చోటు
మండిపడుతున్న దరఖాస్తుదారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): దేవాదాయ శాఖలో ఉన్నతాధికారులు అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారు. దేవుడికి మొక్కులు చెల్లించుకోకున్నా ఫర్వాలేదు కానీ తమకు ముడుపులు చెల్లించకుంటే ఏ పనీ కాదని తేల్చిచెప్తున్నారు. అలా ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు మొదలుకొని అర్చక ఉద్యోగులకు అమలుచేసే సంక్షేమ పథకాల వరకు అడుగడుగునా అందినకాడికి లంచాలు దండుకుంటున్నారు. తాజాగా ఫుల్ › 11వ పేజీలో

సర్కార్‌పై అర్చకుల **సమరభేరి**

డీడీఎన్‌ఎస్ చైతన్య యాత్ర నేటి నుంచి
జనవరి 7 వరకు రోజుకో జిల్లా యాత్ర
ధూప- దీపం కింద వేతనం 35 వేలకు పెంచాలని డిమాండ్ › 11

పంచాయతీ ఫలితాలపై సీఎం సీరియస్!

60 శాతం గ్రామాలను గెలిచామంటూ పైకి గొప్పలు
లోపల కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చిందులు
గ్రామాల్లో తిరగడానికి ఏం నొప్పి అంటూ ఆగ్రహం
అధికార పార్టీ ఎమ్మెల్యేలున్నచోట కూడా పంచాయతీ ఫలితాల్లో ఎందుకు వెనుకబడ్డామంటూ మండిపాటు › 10
ఇలాగైతే పరిషత్ ఎన్నికల్లో కష్టమంటూ ఆందోళన
ఫలితాలపై వరుస సమీక్షలు.. నేడు మంత్రులతో భేటీ

తోడేళ్ల తొండి జపం!

తొవ్వ పెట్టినోళ్లే తరలింపును ఆపుతరట
అక్రమ ఇసుకదందా చేస్తే చర్యలు తప్పవంటూ కాంగ్రెస్‌ముఠా ప్రకటనలు
హల్దీవాగులో కంటైనర్ల లెక్కలు వేస్తూ దొరికిన ముఠా నాయకుడి అనుచరుడు
45 రోజులుగా అక్రమ దందా చేస్తూ నమస్తే కథనంతో నీతుల వల్లింపు › 10





బీడబ్ల్యూఎఫ్ విజేత అన్ సె యంగ్

హంగ్జౌ(చైనా): ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో అన్ సె యంగ్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ అన్ సె యంగ్ 21-13, 18-21, 21-10తో వాంగ్ జీ యిపై అద్భుత విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన తుదిపోరులో అన్ సె యంగ్ తనదైన రీతిలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్‌ను 21-13తో కైవసం చేసుకున్న ఈ యువ షట్లర్‌కు రెండో గేమ్‌లో చుక్కెదురైంది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వని ఈ దక్షిణకొరియా షట్లర్ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది 11వ టైటిల్ దక్కించుకోవడం ద్వారా జపాన్ దిగ్గజ షట్లర్ కెంటో మెమోటో సరసన అన్ సె యంగ్ నిలిచింది. ఫైనల్‌కు చేరుకునే కనీసం ఒక్క గేమ్‌ను కోల్పోని అన్ సె యంగ్..జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచిని ఓడించడం విశేషం.

నేటి నుంచి తెలంగాణ టీ20 టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ టీ20 లీగ్‌కు సోమవారం తెరలేవనుంది. మహబూబ్‌నగర్ వేదికగా టీ20 టోర్నీ తొలి అంచె పోటీలు మొదలుకానున్నాయి. జిల్లా కేంద్రంలోని మైదానంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరుగనుంది. ఈనెల 27 వరకు జరిగే తొలి దశలో హైదరాబాద్, రంగారెడ్డి మినహా 29 జిల్లాల జట్లు పోటీపడుతున్నాయి. వీటి నుంచి ఎనిమిది ఉమ్మడి జిల్లాలకు తోడు హైదరాబాద్, రంగారెడ్డి జట్లతో రెండో అంచె పోటీలు ఈనెల 29 నుంచి జనవరి 17 వరకు 49 మ్యాచ్‌లు జరుగుతాయి.

జెమీమా జోరు

అజేయ అర్ధసెంచరీతో విజృంభణ • లంకపై భారత్ ఘన విజయం • టీ20 సిరీస్‌లో 1-0తో ముందంజ



విశాఖపట్నం: శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టీ20 పోరులో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడాతో లంకపై ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. స్వదేశం వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో టైటిల్ గెలిచిన తర్వాత తొలి సారి బరిలోకి దిగిన భారత్ సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన భారత్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. లంక నిర్దేశించిన 122 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 14.4 ఓవర్లలో 122/2 స్కోరు చేసింది. యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్(44 బంతుల్లో 69 నాటౌట్, 10ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కింది. రోడ్రిగ్స్‌కు తోడు ఓపెనర్ స్మృతి మంధన(25) ఆకట్టుకుంది. కావ్య కవింది(1/20), ఇనోక రణవీర(1/17) ఒక్కో వికెట్ తీశారు. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 121/6 స్కోరుకు పరిమితమైంది. ఓపెనర్ విశ్మి గుణరత్నె(39) ఆట్టుకోగా, మిగతావారు తేలిపోయారు. దీప్తిశర్మ(1/20), క్రాంతిగౌడ్(1/23), శ్రీచరణి(1/30) రాణించారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన జెమీమా రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 పోరు ఈనెల 23న ఇక్కడే జరుగనుంది.

ఆది నుంచే కట్టడి:

టాస్ గెలిచిన టీమ్‌ఇండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ మరో ఆలోచన లేకుండా లంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ భారత బౌలర్లు లంకను ఆదిలోనే దెబ్బతీశారు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో కెప్టెన్ చమరీ ఆటపట్టు(15)ను క్రాంతిగౌడ్ క్లీన్‌బౌల్డ్ చేయగా, లంక 18 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హాసిని పెరెరా (20).. విశ్మికి జత కలిసింది. ఈ ఇద్దరు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన దీప్తిశర్మ..హాసినిని ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 31 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. హర్షిత సమరవిక్రమ (21), హాసిని..భారత బౌలర్లను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ ఇద్దరు అడపాదడపా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. 16 పరుగుల తేడాతో వీరిద్దరు ఔట్ కావడంతో లంక కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. నీలాక్షిక సిల్వా(8), కవిశ్క దిల్హారి(6) రనౌట్లుగా వెనుదిరుగడంతో లంక స్వల్ప స్కోరుకు పరిమితమైంది.

జెమీమా దూకుడు:

లక్ష్యఛేదనలో భారత్‌కు మెరుగైన శుభారంభం దక్కలేదు. డాషింగ్ ఓపెనర్ షెఫాలీవర్మ(9) సింగిల్ డిజిట్‌కే వైదొలుగడంతో ఇన్నింగ్స్ బాధ్యతను మంధన, జెమీమా రోడ్రిగ్స్ భుజానెత్తుకున్నారు. వీరిద్దరు లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మెగాటోర్నీ ఫామ్‌ను కొనసాగిస్తూ జెమీమా లంక బౌలర్లపై విరుచుకుపడింది. పవర్‌ప్లేను అనుకూలంగా మలుచుకుంటూ బౌండరీలతో చెలరేగింది. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో రణవీర బౌలింగ్‌లో మంధన ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 54 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌నకు బ్రేక్ పడింది. మంధన ఔటైనా జెమీమా తన దూకుడు తగ్గించలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్(15 నాటౌట్)తో కలిసి జెమీమా..జట్టును లక్ష్యం వైపు సాఫీగా నడిపించింది. మంచు ప్రభావంతో లంక బౌలర్లు తేలిపోవడం భారత బ్యాటర్లకు సులువైంది.



జెమీమా (69*)

1 అంతర్జాతీయ టీ20ల్లో నాలుగు వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా మంధన నిలిచింది. ఓవరాల్‌గా సుజీ బేట్స్ (4716) టాప్‌లో ఉంది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 121/6(విశ్మి 39, హర్షిత 21, దీప్తిశర్మ 1/20, క్రాంతిగౌడ్ 1/23), **భారత్:** 14.4 ఓవర్లలో 122/2(జెమీమా 69 నాటౌట్, మంధన 25, రణవీర 1/17, కావ్య 1/20)

జాతీయ ఖోఖో పోటీలకు ఎస్టీ గురుకులం విద్యార్థి



కాటారం, డిసెంబర్ 21: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ(బాలుర) గురుకుల కళాశాల విద్యార్థి నిఖిల్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. సంగారెడ్డిలో ఇటీవల జరిగిన 44వ రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ అండర్-18 విభాగంలో పెద్దపల్లి జిల్లా తరఫున నిఖిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 30 నుంచి జనవరి 4 వరకు కర్ణాటకలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున నిఖిల్ పోటీపడుతాడని ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి కుమార్ పేర్కొన్నారు. జాతీయ టోర్నీకి ఎంపికైన నిఖిల్‌ను గురుకుల ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, బలరాం, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

విండీస్ లక్ష్యం 462, ప్రస్తుతం 43/0



లాథమ్ (101)



కాన్వే (100)

మౌంట్ మాంగనుయి(న్యూజిలాండ్): న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. పరుగుల వరద పారుతున్న పోరులో ఆధిక్యం చేతులు మారుతున్నది. కివీస్ నిర్దేశించిన 462 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన విండీస్ వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా ఓపెనర్లు బ్రాండన్‌కింగ్ (37), జాన్ క్యాంప్‌బెల్ (2) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 381/6 నాలుగో రోజు ఆదివారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన విండీస్ 420 పరుగులకు ఆలౌటైంది. కవెమ్ హాడ్జ్(123 నాటౌట్) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. జాకబ్ డఫీ(4/86), ఇజాజ్ పటేల్ (3/113) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కివీస్ 54 ఓవర్లలో 306/2 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓపెనర్లు టామ్ లాథమ్ (101), డెవాన్ కాన్వే (100) దూకుడైన బ్యాటింగ్‌తో సెంచరీలు సాధించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 192 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. కవెమ్ హాడ్జ్(2/80)కు రెండు వికెట్లు దక్కాయి.

ఆసీస్‌దే యాషెస్

ఇంగ్లండ్‌పై మూడో టెస్టులో ఘన విజయం

సిరీస్‌లో 3-0తో ముందంజ

అడిలైడ్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా తిరిగి దక్కించుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో ఆసీస్ 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో కైవసం చేసుకుంది. ఆసీస్ నిర్దేశించిన 435 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 207/6తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ 352 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జెమీ స్మిత్(60), విల్ జాక్స్(47) జట్టును గెలిపించే ప్రయత్నం చేశారు. అయితే సిరీస్‌లో సూపర్ ఫామ్‌మీదున్న మిచెల్ స్టార్క్(3/62) ఇంగ్లండ్‌ను దెబ్బతీయడంలో కీలకమయ్యాడు. ఆసీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలుస్తూ స్మిత్, జాక్స్



సాధికారిక ఇన్నింగ్స్ ఆడారు. ముఖ్యంగా వికెట్‌కీపర్, బ్యాటర్ స్మిత్ తన ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, రెండు భారీ సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశలో స్టార్క్ బౌలింగ్‌లో స్మిత్ ఔట్ కావడంతో ఏడో వికెట్‌కు 91 పరుగుల కీలక భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. బ్రాండన్ కార్స్(39 నాటౌట్)తో జత కలిసిన జాక్స్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు కంగారూ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. స్టార్క్ బౌలింగ్‌లో లబుషేన్ కండ్లు చెదిరే క్యాచ్‌తో జాక్స్ ఔట్ కావడంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. 15 పరుగుల తేడాతో ఆర్చర్(3), టంగ్(1) వెంటవెంటనే ఔట్ కావడంతో ఆసీస్ గెలుపు సంబురాల్లో మునిగి పోయింది. సెంచరీకి తోడు అర్ధసెంచరీ, ఆరు క్యాచ్‌లతో అలెక్స్ క్యారీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈనెల 26 నుంచి ఇరు జట్ల మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే టెస్టు మొదలుకానుంది.

ఆసియా చేజారె..

ఫైనల్లో పాక్ చేతిలో భారత్ ఓటమి • అండర్-19 ఆసియాకప్

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌లో యువ భారత్‌కు చుక్కెదురైంది. ఆదివారం జరిగిన టోర్నీ ఫైనల్లో టీమ్‌ఇండియా 191 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చేతిలో చిత్తుగా ఓడింది. రికార్డు స్థాయిలో తొమ్మిదో సారి టైటిల్‌ను ఒడిసిపట్టుకుందామనుకున్న యువ భారత్ ఆశలపై దాయాది పాక్ నీళ్లు గుమ్మరించింది. పాక్ నిర్దేశించిన 348 పరుగుల లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా 26.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. అలీ రెజా (4/42), హుజైఫా అఫ్సాన్ (2/12), అబ్దుల్ సుభాన్ (2/29) ధాటికి భారత యువ బ్యాటర్లు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. టోర్నీలో సూపర్‌ఫామ్ మీద ఉన్న వైభవ్ సూర్యవంశీ(26), ఆరోన్ జార్జ్(16), విహాన్ మల్హోత్ర(7), అభిజ్ఞాన్ కుందు(13) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ పాక్ బౌలర్లు చెలరేగడంతో మన బ్యాటర్లు చేష్టలుడిగిపోయారు. అంతకుముందు సమీర్ మిన్హాస్(113 బంతుల్లో 172, 17ఫోర్లు, 9 సిక్స్‌లు) భారీ సెంచరీతో పాక్ నిర్ణీత 50 ఓవర్లలో 347/8 స్కోరు చేసింది. పసలేని భారత బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ సమీర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో ఆసియాకప్‌లో పాక్ తరఫున అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. సమీర్‌కు తోడు అహ్మద్ హుస్సేన్ (56) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. దీపేశ్ దేవేంద్రన్ (3/83), కిలాన్ పటేల్ (2/44) ఫర్వాలేదనించారు. సమీర్ మిన్హాస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు సిరీస్ దక్కింది.



చిత్రం



చిరంజీవి ప్రస్తుతం 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రం పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత ఆయన బాబీ దర్శకత్వంలో సినిమా చేస్తారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో కూడా ఓ సినిమాను ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్.. ప్రారంభానికి ముందే సినిమాపై ఆసక్తిని పెంచేసింది. మెగా అభిమానులంతా ప్రస్తుతం ఆతృతగా

శ్రీకాంత్ ఓదెల సినిమా మొదలయ్యేది అప్పుడే?

ఎదురు చూస్తున్న సినిమా అంటే శ్రీకాంత్ ఓదెల సినిమానే. ఇప్పుడైతే 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు శ్రీకాంత్ ఓదెల. మరి మెగాస్టార్‌తో ఆయన సినిమా మొదలయ్యేది ఎప్పుడు? అని అంతా ఎదురుచూస్తున్న క్రమంలో సదరు చిత్ర నిర్మాత సుధాకర్ చెరుకూరి.. మెగాస్టార్, శ్రీకాంత్ ఓదెల సినిమాకు సంబంధించిన వార్తను మీడియాకు వెల్లడించారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మొదలుపెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. మెగా ఫ్యాన్స్‌కిది నిజంగా శుభవార్తే.



ఉత్కంఠ గొలిపే ఉల్కాపాతం

''శంబాల' ట్రైలర్ ఇప్పుడే చూశాను. అద్భుతంగా ఉంది. ఇలాంటి సినిమాలనే ఇప్పుడంతా ఇష్టపడుతున్నారు. ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. నేపథ్యంలో వచ్చే ఇంగ్లిష్ సాంగ్ అదిరిపోయింది. ఈ సినిమాతో ఆదికి మంచి విజయం దక్కాలి.' అని అగ్ర హీరో నాని అన్నారు. ఆది సాయికుమార్ హీరోగా రూపొందిన సైంటిఫిక్, మైథలాజికల్ థ్రిల్లర్ 'శంబాల'. యుగంధర్ ముని దర్శకుడు. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 25న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అగ్ర హీరో నాని ట్రైలర్‌ని ఆవిష్కరించి పై విధంగా స్పందించారు. ఇక ట్రైలర్ చూస్తే.. ఆకాశంలో ఉల్క పడటంతో ట్రైలర్ మొదలైంది. 'పంచభూతాల్ని శాసిస్తుందంటే ఇది సాధారణమైన శక్తికాదు' అనే డైలాగ్‌తో ఆ ఉల్క శక్తిని చూపించారు. ఊళ్లో అంతా వింతగా ప్రవర్తించడం, ఉల్కను కట్టడి చేసేందుకు పూజాలు చేయడం, ఈ మిస్టరీని ఛేదించేందుకు నాస్తికుడైన హీరో రంగంలోకి దిగడం.. 'కాశీ కాకమ్మ మజిలీకథలు ఊరి జనాలకు చెప్పండి.. నాక్కాదు' అని హీరో అనడం.. ఇలా ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ కె.బంగారి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, నిర్మాణం: షైనింగ్ పిక్చర్స్.



ఐ యామ్ ఏ చాంపియన్

రోషన్ హీరోగా రూపొందిన పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'చాంపియన్'. అనస్వర రాజన్ కథానాయిక. ప్రదీప్ అద్వైతం దర్శకుడు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలూ చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయని మేకర్స్ ఆనందం వెలిబుచ్చుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ సినిమా నుంచి మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. అగ్ర నటి సమంత ఈ పాటను విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ పాటలో రోషన్ డ్యాన్స్ అదరగొట్టాడనీ, ఫ్లోర్‌పై జాజ్ బీట్స్‌కు అనుగుణంగా అతని బాడీ లాంగ్వేజ్, అబ్బురపరిచే డ్యాన్స్ మూవ్‌మెంట్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. 'ఐ యామ్ ఏ చాంపియన్' అంటూ కేకే రాసిన ఈ పాటను మిక్కీ జె.మేయర్ స్వరపరచగా, పి.జయరామ్, రమ్య బెహరా ఆలపించారు.



కైట్ స్పోర్ట్స్ డ్రామాగా పతంగ్

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన స్పోర్ట్స్ డ్రామా 'పతంగ్'. గౌతమ్ వాసుదేవ మీనన్, ఎస్పీచరణ్ కీలక పాత్రధారులు.. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మాకా, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. అగ్ర నిర్మాత డి.సురేష్‌బాబు సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానున్నది. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ఆదివారం ట్రైలర్ సక్సెస్ సెలబ్రేషన్ నిర్వహించారు. ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచిందనీ, వరల్డ్ క్లాస్ లెవల్‌లో ఈ సినిమాలోని పతంగ్ పోటీల సీజీ ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాతో తామందరిదీ భావోద్వేగ ప్రయాణమని, కైట్ స్పోర్ట్స్ డ్రామా తీయడం తేలికైన విషయం కాదని, ప్రీతి పగడాల పేర్కొన్నారు. ఇంకా చిత్రబృందం కూడా మాట్లాడారు.

హంగామా వెనుక విషాదం?




'కేజీఎఫ్'ఫేం యష్ కథానాయకుడిగా రూపొందుతున్న హై ఓల్టేజ్ ఎమోషనల్ కమర్షియల్ థ్రిల్లర్ 'టాక్సిక్ : ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్'. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ పానిండియా చిత్రాన్ని వెంకట్ కె.నారాయణతో కలిసి యష్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న సినిమా విడుదల కానున్నది. బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె పాత్ర పేరు 'నాడియా'. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమాలోని ఆమె ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌ని గమనిస్తే.. ఇందులో కియారా హాలీవుడ్ హీరోయిన్ స్థాయిలో కనిపిస్తుంది. ఆమె నేపథ్యం కలర్‌ఫుల్‌గా ఉంది. ఈ హంగామా వెనుక ఏదో విషాదం దాగి ఉన్నట్టు అనిపిస్తున్నది. ఆమె కళ్లలో లోతైన భావోద్వేగాలు ఆవిష్కృతమవుతున్నాయి. నడియాగా ఇంతవరకూ చూడని కొత్త కియారాని ఈ సినిమాలో చూస్తారని, ఒక డైరెక్టర్‌గా ఆమె నటన చూసి గర్విస్తున్నానని గీతూ మోహన్‌దాస్ తెలిపారు. ఇంగ్లిష్, కన్నడ భాషల్లో ఒకేసారి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళంతో పాటు మరికొన్ని భాషల్లో డబ్ చేసి విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. అంతర్జాతీయ హంగులతో, అద్భుతమైన సాంకేతిక నిపుణులతో రూపొందుతున్న ఈ చిత్రానికి కెమెరా: రాజీవ్ రవి, సంగీతం: రవి బస్రూర్, నిర్మాణం: కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్.

వినోదంతో కూడిన సందేశం



అభినవ్ మణికంఠ హీరోగా రూపొందుతున్న చిత్రం 'బొమ్మ హిట్'. పూజా యడం కథానాయిక. రాజేష్ గడ్డం దర్శకత్వంలో గుర్రాల సంధ్యారాణి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. చక్కటి వినోదంతో సాగే ఈ కథలో ఎమోషన్స్ కూడా ఉంటాయని హీరో అభినవ్ మణికంఠ చెప్పారు. వినోదంతోపాటు చక్కని సందేశం కూడా ఈ సినిమాలో ఉంటుందని, వీలైనంత త్వరగా సినిమాను పూర్తి చేసి, వచ్చే వేసవిలో విడుదల చేస్తామని దర్శకుడు రాజేష్ గడ్డం తెలిపారు. కుటుంబ బంధాలతో కూడిన బలమైన కథ ఇదని, మా 'హిట్ బొమ్మ' హిట్ అవ్వడం పక్కా అనీ నిర్మాత గుర్రాల సంధ్యారాణి నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా కథానాయిక పూజా యడం, నటులు మురళీధర్‌గౌడ్, హైపర్ ఆది, అవినాష్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: మల్లికార్జున్ నారగాని, సంగీతం: వంశీకాంత్ రేఖన, నిర్మాణం: అంజనీపుత్ర ఫిల్మ్స్.

ఎవరీ విజయేంద్ర వృషభ?



కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ నటించిన ప్రతిష్ఠాత్మక పానిండియా చిత్రం 'వృషభ'. నందకిశోర్ దర్శకుడు. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె.పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్‌సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా నిర్మాతలు. ఈ నెల 25న గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం తెలుగులో గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. లెజెండరీ బిజినెస్ మ్యాన్ ఆదిదేవవర్మ(మోహన్‌లాల్)కు శత్రువులు ఎక్కువే. ఈ కారణంగా మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ క్రమంలో అతనికి గత జన్మ జ్ఞాపకాలు గుర్తొస్తుంటాయి. ఆ జ్ఞాపకాల్లో తన ప్రజల్ని కాపాడుకుంటున్న అసమాన యోధుడైన రాజా విజయేంద్ర వృషభగా కనిపిస్తుంటాడు. మరో వైపు బిజినెస్‌మ్యాన్ ఆదిదేవవర్మ కొడుకు సైకియాట్రిస్టులతో సంప్రదింపులు చేస్తూ, శత్రు దాడుల నుంచి తండ్రిని కాపాడుకుంటూ ఉంటాడు. అసలు ఆదిదేవవర్మ జ్ఞాపకాల్లో కనిపిస్తున్న విజయేంద్ర వృషభ ఎవరు? అతని గొప్పతనం ఏంటి? ఆ గతానికీ, ఈ వర్తమానానికీ లింకేంటి? అనే ఆసక్తిని ఈ ట్రైలర్ కలిగించింది. ఈ చిత్రానికి కెమెరా: ఆంటోనీ సామ్‌సన్, సంగీతం: సామ్ సీఎస్, అరియన్ మెహదీ.

ఆసక్తి.. భయం మేళవింపు ఈ సినిమా



' 'ఈషా' ఓ వండర్‌ఫుల్ మూవీ. తొలి పది నిమిషాల్లోనే ఈ సినిమాను మేం ఎందుకు విడుదల చేశామో మీకు అర్థమైపోతుంది. ఆసక్తి, భయం మేళవింపు ఈ సినిమా. ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసే హారర్ థ్రిల్లర్ ఇది. ముఖ్యంగా చివరి 15 నిమిషాలు సినిమా చాలా కొత్తగా ఉంటుంది. మా గత చిత్రాలకు పూర్తి భిన్నమైన సినిమా ఇది' అని నిర్మాత వంశీ నందిపాటి అన్నారు. బన్నీ వాస్‌తో కలిసి ఆయన విడుదల చేస్తున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. అఖిల్‌రాజ్, త్రిగుణ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రధారులు. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. హేమ వెంకటేశ్వరరావు నిర్మాత. ప్రముఖ నిర్మాత కె.ఎల్.దామోదరప్రసాద్ సమర్పిస్తున్న ఈ చిత్రం ఈ నెల 25న థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ఈచిత్రాన్ని విడుదల చేస్తున్న వంశీ నందిపాటి, బన్నీవాస్ ఆదివారం విలేకరులతో ముచ్చటించారు. 'కంటెంట్ నచ్చితేనే మేం విడుదల చేస్తాం. నచ్చకపోతే వెంటనే వాళ్లకు ప్రత్యామ్నాయ మార్గం చెబుతాం. కంటెంట్ మీద నమ్మకంతోనే మేమిద్దరం కలిశాం. నా సొంత సినిమాలు ఫెయిలైన దాఖలాలు ఉన్నాయి కానీ, నేను పంపిణీ చేసిన సినిమాలు ఇప్పటివరకూ ఫెయిల్ కాలేదు. ఈ సినిమా విషయంలోనూ ఫెయిల్ కాను అని నమ్మకంతో ఉన్నా. ఈ సినిమా ఫస్ట్‌కాపీ చూసి తీసుకున్నాం. ఆడియన్స్ అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుంది.' అని నిర్మాత బన్నీవాస్ అన్నారు. తాము రిలీజ్ చేసే సినిమాలపై ఎడిట్ రూమ్ నుంచే తమ ప్రమేయం ఉంటుందని, నేపథ్య సంగీతం, ఎడిటింగ్.. ఇలా ప్రతి విషయంలోనూ మార్పులు, చేర్పులు చేసి, నాన్ థియేట్రికల్ బిజినెస్‌ను కూడా క్లోజ్ చేసి ఓ ప్లాన్ ప్రకారం సినిమాను విడుదల చేస్తామని, ఇదో కొత్త ట్రెండ్ అని వంశీ నందిపాటి తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కాంగ్రెస్ సర్కార్‌పై అర్చకుల సమరభేరి

జనవరి 7 వరకు రోజుకో జిల్లాలో యాత్ర

నేటి నుంచి డీడీఎన్‌ఎస్ అర్చక చైతన్య యాత్ర

- ధూప, దీప, నైవేద్యం పథకం అర్చకులకు వేతనాన్ని 35 వేలకు పెంచాలని డిమాండ్
- ఉద్యోగ భద్రతే ప్రధాన ఎజెండా..
- డీడీఎన్‌ఎస్ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కార్‌పై ధూప, దీప, నైవేద్యం (డీడీఎన్) పథకం అర్చకులు సమరభేరి మోగించారు. సోమవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అర్చక చైతన్యయాత్ర నిర్వహిస్తామని డీడీఎన్‌ఎస్ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ తెలిపారు. ఈ నెల 22న నిజామాబాద్‌లో ప్రారంభమయ్యే యాత్ర 23న ఆదిలాబాద్, 24న వరంగల్, 26న కరీంనగర్, 27న మహబూబ్‌నగర్, 29న సంగారెడ్డి, జనవరి 2న నల్లగొండ, 5న రంగారెడ్డి, హైదరాబాద్, 6న ఖమ్మం వరకు సాగుతుందని వాసుదేవశర్మ వివరించారు. పది ఉమ్మడి జిల్లాల్లో డీడీఎన్ అర్చకులతో సమావేశం అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. డీడీఎన్ పథకం అర్చకులకు ప్రభుత్వం కేటాయిస్తున్న గౌరవ వేతనం సరిపోవడంలేదని, దీంతో అర్చకులు దుర్భర జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో అనేక దేవాలయాలను డీడీఎన్ పథకం కిందకు తీసుకొచ్చి దేవాలయాల పునరుజ్జీవనానికి కేసీఆర్ కృషిచేశారని, అయితే, రేవంత్ సర్కార్ మాత్రం ఉన్న వాటిని కొనసాగించడానికే చాలా ఇబ్బందులు పడుతున్నదని ధూప, దీప, నైవేద్యం అర్చకులు చెప్తున్నారు. డీడీఎన్ వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో చాలామంది గ్రామీణ ప్రాంత అర్చకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలపై పలుమార్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించినా పెద్దగా స్పందించలేదని, దీంతో సర్కార్‌పై అర్చక సమరభేరి మోగించాల్సి వస్తున్నదని డీడీఎన్ సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఉద్యోగ భద్రతే ప్రధానం

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2007లో ధూప, దీప, నైవేద్య పథకం ద్వారా రాష్ట్రంలోని పురాతన ఆలయాలకు పునరుజ్జీవం కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్.. ఈ పథకాన్ని మరింత విస్తృతపరిచి ఆలయాల్లో నిర్వహించే ధూప, దీప, నైవేద్యాలు కుంటుపడకుండా వారికి కావలసిన స్థాయిలో వేతనాలు అందించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 6,758 మంది అర్చకులు ఈ పథకం కింద విధులు నిర్వర్తిస్తున్నారు. డీడీఎన్ పథకం కింద ప్రతి ఆలయానికి రూ.10 వేల చొప్పున గౌరవవేతనం కింద ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో అనేక దేవాలయాల్లో అర్చకత్వాన్ని నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ తాము చేస్తున్న అర్చక వృత్తిపై భద్రత లేకపోవడంతో అర్చక కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో, ఎప్పుడు తమకు జీతాలు వస్తాయో తెలియక వారి జీవనం అగమ్యగోచరంగా మారింది. దేవునికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించే క్రమంలో వేతనాలు వచ్చినా రాకపోయినా తమ బాధ్యతగా సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. డీడీఎన్ అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారి జీవనం కోసం సరైన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని దౌలతాబాద్ వాసుదేవశర్మ డిమాండ్ చేశారు.

డీడీఎస్‌ఎస్ సంఘం డిమాండ్స్

- ధూప, దీప, నైవేద్య పథకం కింద ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.35 వేలకు పెంచి ప్రతి నెలా 5వ తేదీ లోపు చెల్లించాలి. డీడీఎన్ అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- హెల్త్‌కార్డులు, ఈహెచ్‌ఎస్, గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలను డీడీఎన్ అర్చకులకు వర్తింపజేయాలి.
- అర్చకులకు పునఃశ్చరణ తరగతులను నిర్వహించాలి. అర్చక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి.
- హైదరాబాద్ బర్కత్‌పురలో ఉన్న అర్చక భవన్‌కు మరమ్మత్తులు చేయించి డీడీఎన్ అర్చకులకు కేటాయించాలి. ప్రతి జిల్లాలో అర్చక భవన్ ఏర్పాటుచేయాలి.
- ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి అందులో ఇద్దరు డీడీఎన్ అర్చకులకు స్థానం కల్పించాలి.

• రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం'



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. – హైదరాబాద్

ధ్యానంతో అంతర్గత శాంతి

- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- కన్హాశాంతి వనంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం



ధ్యాన మందిరంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

షాద్‌నగర్, డిసెంబర్ 21 : ధ్యానంతో అంతర్గత శాంతి లభిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతి వనంలోని రామకృష్ణ మిషన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి రాధాకృష్ణ ధ్యానంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు.

దేశానికి మార్గదర్శకంగా 'సర్'

- బీహార్‌లో ఎలాంటి లోపాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేశాం
- బీఎల్‌వోలే వ్యవస్థకు వెన్నెముక
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్. చిత్రంలో తెలంగాణ రాష్ట్ర సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్‌ఐఆర్) దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల బీహార్‌లో విజయవంతంగా పూర్తయిన ఎస్‌ఐఆర్ ప్రక్రియను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో సీఈసీ మాట్లాడుతూ భారత ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌వోలే వెన్నెముక అని చెప్పారు. వారి నిబద్ధత, కృషిపైనే ఓటర్ల జాబితా సవరణ విజయం ఆధారపడి ఉంటుందని తెలిపారు. దేశంలో ఎన్నికల నిర్వహణను ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తున్నదని వ్యాఖ్యానించారు. బీహార్‌లో నిర్వహించిన ఎస్‌ఐఆర్ ఎలాంటి లోపాలు లేకుండా పూర్తయిందని, అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 7.5 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని, విజయానికి కారణమైన బీహార్ బీఎల్‌వోలను అభినందించారు.

పట్టణ ఓటర్లలో నిరాసక్తత

పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువ గా ఉండటానికి ఓటర్ల నిరాసక్తతే కారణమని సీఈసీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు ఉత్సాహంగా ఓటుహక్కు వినియోగించుకుంటూ దేశానికి దారిచూపుతున్నారని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నికల చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. 1995లో సభ్యదేశంగా చేరిన 'ఇంటర్నేషనల్ ఐడియా'కు దాదాపు మూడు దశాబ్దాల తర్వా త భారత్‌కు చైర్మన్ స్థానం లభించిందని తెలిపారు. ఇది భారత ఎన్నికల సంఘం ప్ర పంచంలోనే అత్యంత విశ్వసనీయమైన, వినూత్న ఎన్నికల నిర్వహణ సంస్థగా గుర్తింపు పొందినదనడానికి నిదర్శనమని చెప్పారు. భారత ప్రజాస్వామ్య విస్తృతిని ప్రస్తావిస్తూ దేశంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 90 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని వివరించారు. సమావేశానికి ముందు రాష్ట్ర ప్ర ధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు సంబంధించిన గణాంకాలను వివరించారు. సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికలఅధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్‌కుమార్ శర్మ, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అమ్మకానికి ధూపదీపం!

› మొదటిపేజీ తరువాయి...

డిమాండ్ ఉన్న ధూప, దీప, నైవేద్య (డీడీఎన్) పథకం రావడంతో ఇష్టారాజ్యంగా దోపిడీ ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలో ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోని ఆలయాల నిర్వహణ కోసం అక్కడి అర్చకుడికి ప్రతినెలా రూ.10 వేలు ఇస్తారు. ఈ పథకం అమలులో భాగంగా మంత్రులు చెప్పిన ఒకట్రెండు సిఫారసులకు అధికారులు ఓకే చెప్పి మిగతా పనులకు 'రేటు' నిర్ణయించారు. డీడీఎన్ జాబితాలో మీ పేరు ఉండాలంటే మంత్రి పేషీ అధికారిని కలవాలంటూ జిల్లా స్థాయిలో తమకు అనుకూలురైన కొందరు అధికారులతో దరఖాస్తుదారులకు చెప్పించారు. అనంతరం అక్కడికి వెళ్లిన ఓ నిరుపేద అర్చకుడు ఆ 'సార్' చెప్పిన రేటుకు అటోఇటో మాట్లాడుకుందామనుకున్నా 'రాజు'గారు ఒప్పుకోలేదు. దీంతో ఆ అభాగ్యుడు తన భార్య పుస్తెలు తాకట్టుపెట్టి ఆ 'సార్' చెప్పిన వ్యక్తికి లక్షల రూపాయల ముడుపు చెల్లించాడు. ఈ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. డీడీఎన్ పథకాన్ని ఆదాయవనరుగా మార్చుకుని మంత్రి పేషీ అధికారులు కోట్ల రూపాయలు దండుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని 5 వేలకుపైగా ఆలయాలకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రవేశపెట్టిన ధూప, దీప, నైవేద్య పథకం కింద గతంలో అర్చకులకు నెలవారీగా ఇస్తున్న రూ.6 వేలను కేసీఆర్ హయాంలో రూ.10 వేలకు పెంచారు. ఆ తర్వాత 2023లో మరో 250 ఆలయాలకు ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించినప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల ఆ ప్రక్రియ ఆగిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఆ 250 ఆలయాలకు డీడీఎన్ పథకాన్ని వర్తింపజేసేందుకు ఈ ఏడాది మే నెలలో నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో ఆ పథకానికి తమ ఆలయాలను ఎంపిక చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,600 మంది నిరుపేద అర్చకులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించేందుకు ప్రభుత్వం జిల్లాస్థాయిలో అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను నియమించింది. చివరికి ఆ కమిటీలు 1,326 దరఖాస్తులను ఎంపికచేసి, తుదిజాబితాను దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపాయి. అసలు కథ ఇక్కడే మొదలైంది.

మంత్రి పేషీ నుంచే ముడుపుల దందా

డీడీఎన్ పథకానికి కొత్తగా ఎంపిక చేయాలనుకున్న ఆలయాలపై జోరుగా పైరవీలు నడిచాయి. తాము అనుకున్న ఆలయాలను ఈ పథకానికి ఎంపిక చేయాలని దేవాదాయ శాఖ అధికారులపై పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొచ్చారు. వారి సిఫారసు లేఖలతో దరఖాస్తుదారులు దేవాదాయ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడ ఫలితం లేకపోడంతో కొందరు దరఖాస్తుదారులు నేరుగా మంత్రి పేషీ అధికారుల వద్దకే వెళ్లి ఒక్కో ఆలయానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ముడుపులు సమర్పించుకున్నట్టు తెలిసింది.

బిల్లులు ఇచ్చాకే పంచాయతీలు అప్పగిస్తం


మాజీ సర్పంచుల స్పష్టీకరణ



వరంగల్ జిల్లా పర్వతగిరిలో మీడియాతో తమ ఆవేదనను వెల్లడిస్తున్న మాజీ సర్పంచుల భర్తలు

పర్వతగిరి, డిసెంబర్ 21: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో గ్రామపంచాయతీ భవనాలు నిర్మించి, బిల్లులు రాక అప్పుల పాలయ్యామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. హట్యా తండాలో ఐటీడీఏ గ్రాంట్ నుంచి రూ. 20 లక్షల నిధులతో జీపీ భవనం నిర్మించినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదని మాజీ ఉపసర్పంచ్ భూక్యా తిరుపతి, మాజీ సర్పంచ్ భర్త వెంకట్రామ్ పేర్కొన్నారు. మల్యా తండాలో రూ. 38 లక్షలతో జీపీ బిల్డింగ్ కట్టి, బిల్లులు రాక నివాస గృహాలను తాకట్టు పెట్టి అప్పులు కడుతున్నామని మాజీ సర్పంచ్ భర్త ఈర్యానాయక్ ఆదివారం మీడియాతో పేర్కొన్నారు. కొత్త సర్పంచుల పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాళాలు వేస్తామని, బిల్లులు వచ్చే వరకు తీయమని స్పష్టం చేశారు. మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి తక్షణమే బిల్లులు చెల్లించాలని, లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు.


• మాట నిలబెట్టుకున్న సర్పంచ్



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచరామి సర్పంచ్ ఉప్పు లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయకముందే తన హామీని నిలబెట్టుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆదివారం మానేరువాగు నుంచి మంచరామి గ్రామం వరకు తన సొంత ఖర్చు దాదాపు రూ.40 వేలతో పైపులైన్లు వేసి తాగునీటి సరఫరా చేయించారు. – సుల్తానాబాద్‌రూరల్

ట్రూ అప్ భారం 1,607 కోట్లు

విద్యుత్తు వినియోగదారులకు కరెంటు షాక్! • ఈఆర్సీ అనుమతి కోరుతూ జెన్‌కో పిటిషన్ • 2026 జనవరి 22న ఈఆర్సీ బహిరంగ విచారణ



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల రూపంలో మరో భారం పడనున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,607 కోట్ల ట్రూ అప్ చార్జీలకు అనుమతించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి టీజీ జెన్‌కో పిటిషన్ సమర్పించింది. దీనిపై 2026 జనవరి 22న ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనున్నది. ఈ పిటిషన్‌పై వినియోగదారులు, విద్యుత్తు రంగ నిపుణులు తమ అభ్యంతరాలను 2026 జనవరి 10లోగా తెలియజేయవచ్చు. విద్యుత్తు కొనుగోలు అంచనాలు, వాస్తవిక కొనుగోలు వ్యయానికి మధ్య ఉన్న తేడానే ట్రూ అప్ చార్జీలు అంటారు. విద్యుత్తు సంస్థల ఖర్చును నియంత్రిస్తూ దేనికి ఎంత ఖర్చుపెట్టాలనే ఆదేశాలతో ఈఆర్సీ ఏటా టారిఫ్ ఆర్డర్ ఇస్తుంది. దీనికి లోబడే డిస్కంలు ఖర్చుచేయాలి. కానీ, విద్యుత్తు కొనుగోళ్లు, విద్యుత్తు ఉత్పత్తి ఖర్చులు, వడ్డీల విషయంలో టీజీ జెన్‌కో నియంత్రణ రేఖను దాటి.. అధికంగా ఖర్చుచేసింది. ప్రాథమిక అంచనాలకు మించిన వ్యయాన్ని సర్దుబాటు చేసుకోవడంలో భాగంగానే టీజీ జెన్‌కో ట్రూ అప్ చార్జీల వసూలుకు అనుమతి కోరింది.

ఖర్చు ఎందుకు పెరిగిందంటే..

2024-25 ఆర్థిక సంవత్సరంలో టీజీ జెన్‌కో రూ.6,712.60 కోట్ల వ్యయం చేసేందుకు ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. అయితే, ఈ ఏడాది కాలంలో టీజీ జెన్‌కో రూ. 8,319.73 కోట్లు ఖర్చుచేసింది. సర్దుబాటు కింద ట్రూ అప్‌లో భాగంగా రూ.1,607.13 కోట్లు టీజీ జెన్‌కో క్లెయిమ్ చేసింది. ఇదిలాఉండగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.8,784.06 కోట్లకు అంచనాలను సవరించింది. విద్యుత్తు ప్లాంట్ల ఆపరేషన్, నిర్వహణ ఖర్చులు రూ.831 కోట్లు పెరిగాయి. దీనితోపాటు వడ్డీలు రూ.87 కోట్లు, అదనపు పెన్షనల్ లయబిలిటీ రూ.301 కోట్లు పెరిగాయి. ఏడాదిలో మొత్తంగా వ్యయం రూ. 1, 607.13 కోట్లు పెరిగింది. ఈ ట్రూ అప్ చార్జీలకు ఈఆర్సీ అనుమతి ఇస్తే, టీజీ జెన్‌కోకు రాష్ట్రంలోని డిస్కంలు కట్టాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని డిస్కంలు విద్యుత్తు చార్జీల రూపంలో మళ్లీ వినియోగదారులపైనే భారం మోపుతాయి.

2024-25 ఆర్థిక సంవత్సరంలో టీజీ జెన్‌కో వ్యయం..(రూ.కోట్లలో..)

ఈఆర్సీ ఇచ్చిన అనుమతి	6,712.60
టీజీ జెన్‌కో పెట్టిన ఖర్చు	8,319.73
అదనపు వ్యయం	1,607.13

అశోక్ గజపతి రాజు ఆదర్శం : నారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): నేటి రాజకీయ నాయకులకు కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతి రాజు ఆదర్శమని సీపీఐ జాతీయ నేత కే నారాయణ పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆదాయాన్ని సమకూర్చుకోకుండా, తన రూ.1000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల్లో రూపాయి ఖర్చు చేసి.. 100 కోట్లు సంపాదించే ఈ రోజుల్లో 1000 కోట్ల విలువైన భూమిని ఏవియేషన్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వానికి అప్పజెప్పడం గొప్ప విషయమని తెలిపారు. నేటి రాజకీయ నాయకులు ఆయనను చూసి సిగ్గుతో తలదించుకోవాలని పేర్కొన్నారు. అలాగే, ఏపీలో మెడికల్ కాలేజీల పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతున్నదని ఆరోపించారు.

చిన్నారి వైద్యానికి అరవై వేల ఆర్థిక సహాయం

హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేయూత



చిన్నారికి ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : చిన్నారి వైద్యానికి అరవై వేల ఆర్థిక సహాయం అందించి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తండ్రి లేని నిరుపేద కుటుంబానికి బాసటగా నిలిచారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన దండుగూడెం ఆశ్రిత (13) ఇటీవల అనారోగ్యం బారినపడింది. ఇన్‌ఫెక్షన్ సోకడంతో బాలికను దవాఖానలో చేర్పించారు. తండ్రిని కోల్పోయిన కుటుంబం ఆశ్రిత వైద్యానికి, దవాఖాన బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడింది. విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ, తెలంగాణ విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాపకంటి అంజయ్య ఆదివారం హసన్‌పర్తి వెళ్లి ఆశ్రితను కలిసి రూ. 60వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాజర్‌షరీఫ్, పరమేశ్, సంతోష్‌కుమార్, బుచ్చిరెడ్డి, అనిల్, అనురాధ, తేజస్విని, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

గాదె ఇన్నయ్య అరెస్టు

జనగామ జిల్లా రేగడితండాలో అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ



గాదె ఇన్నయ్యను అరెస్టు చేస్తున్న ఎన్‌ఐఏ అధికారులు

జఫర్‌గఢ్, డిసెంబర్ 21 : మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్యను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇన్నయ్య జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో 'మా ఇల్లు ప్రజాదరణ' ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్‌ఐఏ అధికారులు ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆశ్రమానికి చేరుకుని మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు తరలించగా, కోర్టు ఇన్నయ్యకు 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఇన్నయ్య సతీమణి గాదె పుష్ప తెలిపారు. ఇటీవల మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అంత్యక్రియ సభలో పాల్గొని, నిషేధిత సీపీఐ (మావోయిస్టు)కు మద్దతుగా ప్రసంగించినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇన్నయ్యను అరెస్టు చేసినట్టు ఎన్‌ఐఏ అధికారులు పేర్కొన్నారు.

ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం: మాజీ ఎమ్మెల్యే క్రాంతి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను అరెస్టు చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఖండించారు. ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడుతున్న ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడారని ఎన్‌ఐఏ అధికారులు ఆయన్ను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగానికి లోబడి పనిచేస్తున్న ఇన్నయ్యను ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఇన్నయ్యను విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రోమ్ అటాక్.. ఘోస్ట్ పెయిరింగ్

వాట్సాప్‌లో కొత్త తరహా దాడులు • అప్రమత్తంగా ఉండాలని సీఎస్‌బీ హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ సామాజిక మాధ్యమం 'వాట్సాప్' వినియోగదారులపై కొత్త తరహా సైబర్ దాడులు జరుగుతున్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) ఆందోళన వ్యక్తం చేసింది. 'వాట్సాప్'లో వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

క్రోమ్ అటాక్

ఏవైనా హానికరమైన వెబ్‌సైట్లను సందర్శించినప్పుడు లేదా వాటిని గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో ఓపెన్ చేసినప్పుడు వాటిలోని లోపాలను ఉపయోగించుకుని వినియోగదారుల బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఇతర వ్యక్తిగత వివరాలను హ్యాకర్లు దొంగిలిస్తారు.

ఘోస్ట్ పెయిరింగ్

హ్యాకర్లు వాట్సాప్‌లో మోసపూరిత సందేశాలను పంపి, ఆ లింకుల ద్వారా వాట్సాప్ కోడ్‌ను పొందుతారు. దీని ద్వారా ఆ వాట్సాప్ ఖాతాను వారి పరికరానికి లింక్ చేసుకుని చాట్‌లను రహస్యంగా గమనిస్తుంటారు. ఈ ప్రక్రియలో వినియోగదారుని వాట్సాప్ ఖాతా మామూలుగానే పనిచేస్తుంది. కానీ, ఆ వినియోగాదారుని సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్తుంది.

సైబర్ దాడులను నిరోధించాలంటే..

- వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి Linked Devices ఆప్షన్‌ను పరిశీలించాలి. తెలియని లింక్‌లు ఏవైనా ఉంటే వాటిని వెంటనే తొలగించాలి లేదా లాగౌట్ అవ్వాలి.
- వాట్సాప్‌లో టూ-స్టెప్ వెరిఫికేషన్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.
- అనుమానాస్పదంగా ఉన్న యాప్స్ లేదా బ్రౌజర్ల వినియోగాన్ని వెంటనే ఆపేయాలి.
- మోసపూరిత మెసేజ్‌లు, పాప్-అప్‌ల స్క్రీన్ షాట్లతోపాటు ట్రాన్సాక్షన్ ఐడీలు, కాల్‌లాగ్‌లను భద్రపరుచుకోవాలి.
- గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌ను వెంటనే అప్‌డేట్ చేసుకోవడంతోపాటు ఈ-మెయిల్, బ్యాంకింగ్, సోషల్ మీడియా పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలి.
- బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పోతే వెంటనే సంబంధిత బ్యాంకు, పేమెంట్ యాప్ ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, పిన్, సీవీవీ, వాట్సాప్ కోడ్‌లను ఎవరితోనూ పంచుకోకూడదు.
- 'అర్జెంట్' అంటూ తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు.
- అపరిచిత వెబ్‌సైట్లలో లాగిన్ వివరాలను నమోదు చేయకూడదు.

పంచాయతీ ఫలితాలపై సీఎం సీరియస్!

60శాతం గెలిచామంటూ పైకి గొప్పలు.. లోపల ఎమ్మెల్యేల మీద చిందులు • కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న చోటా ఫలితాల్లో వెనుకబడ్డామని ఆందోళన

- ఇలాగైతే పరిషత్ ఎన్నికల్లో కష్టం
- గ్రామాల్లో తిరగటానికి ఎమ్మెల్యేలకు ఏం నొప్పి అంటూ తీవ్ర ఆగ్రహం
- పల్లె ఓటర్లను తిప్పకోవటంలో ఎమ్మెల్యేలు, డీసీసీలు విఫలం
- ఎన్నికల ఫలితాలపై వరుస విశ్లేషణలు
- నేడు మంత్రులతో పంచాయతీ ఫలితాలపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేదనే ఆందోళనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపట్టుకున్నారా? రాష్ట్రంలో 60శాతం గెలిచామనే ప్రకటనతో పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. లోలోపల మాత్రం దక్కాల్సిన సీట్లు రాలేదని ఆందోళనతో ఉన్నారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న 18చోట్ల బీఆర్‌ఎస్ స్పష్టమైన ఆధిక్యం సాధించిందని స్వయంగా ముఖ్యమంత్రే అంతర్గత సమావేశంలో అంగీకరించారా? పల్లె ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఎందుకు వెనుకబడ్డామని, పంచాయతీ ఫలితాల దెబ్బకు ప్రాదేశిక ఎన్నికలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారా?

అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. పల్లె పోరులో ఊహించని పరాభవం ఎదురవడంతో ఫలితాలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టం చేస్తున్నది. శుక్ర, శనివారాల్లో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు వరుసగా విశ్లేషణలు చేశారు. నియోజకవర్గాలవారీగా ఆ పార్టీ గెలిచిన పంచాయతీల వివరాలను తెప్పించుకొని విశ్లేషించినట్టు తెలిసింది. ఫలితాల సమీక్ష తర్వాత ఇటీవల సీఎం ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన వివరాలు శుద్ధ తప్పు అని తేలినట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ 50శాతం పంచాయతీలను కూడా గెలుచుకోలేదని అంచనాకు వచ్చినట్టు తెలిసింది.

సీఎం ప్రకటన మేకపోతు గాంభీర్యమే

కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో కూడా అనుకున్న స్థాయిలో గెలువలేకపోయామని, కొన్నిచోట్ల ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లోనూ ఓటమి పాలు కావడంపై సీఎం సీరియస్ అయినట్టు తెలిసింది. 22 నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాల వల్లే పార్టీకి నష్టం జరిగిందని తలంటినట్టు సమాచారం. మరో 15 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు స్థానికంగా లేకపోవడం వల్ల ఓడిపోయామని అంగీకరించినట్టు తెలిసింది. సొంత నియోజకవర్గాల్లో తిరగటానికి ఏం నొప్పి అంటూ ఎమ్మెల్యేలపై సీఎం ఫైర్ అయ్యారట. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను సమన్వయం చేయడంలో డీసీసీలు పూర్తి విఫలం అయ్యారని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్టు సమాచారం. 90శాతం ఫలితాలు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తాయని తాను అంచనా వేస్తే.. 50శాతం కూడా తీసుకురాలేకపోయారని సీరియస్ అయినట్టు తెలిసింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే 94 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే 87చోట్ల కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని సీఎం ప్రకటించటం ప్రజలను గందరగోళపర్చేందుకేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యేల అజాగ్రత్త వల్ల ప్రతిపక్షాలు లాభపడ్డాయని ఏఐసీసీ దూత మీనాక్షి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెబల్స్‌తో సమన్వయలోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం వల్ల గెలిచే స్థానాల్లోనూ ఓడామని వరంగల్, నల్గొండ, పాలమూరు నేతలకు ఆమె క్లాస్ తీసుకున్నారని సమాచారం.

పరిస్థితులు చక్కబడ్డ తర్వాతే పరిషత్ ఎన్నికలకు

గ్రామీణ ప్రాంతాల్లో ఊహకు కూడా అందనంతగా పార్టీ నష్టపోయిందని, ఈ పరిస్థితుల్లో ప్రాదేశిక ఎన్నికలకు వెళ్తే మరింత వ్యతిరేక ఫలితాలు రావచ్చొని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించినట్టు తెలిసింది. మంత్రుల సొంత నియోజకవర్గాలు చెన్నూరు, మక్తల్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుదారులు ఆధిపత్యం సాధించిన పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని, సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల ముహూర్తాలు పెట్టుకోవద్దని రేవంత్‌రెడ్డి సర్కారు ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. రేవంత్ సూచనతో ఏఐసీసీ దూత మీనాక్షి నటరాజన్ కూడా ఏకీభవించినట్టు తెలిసింది. ఈలోగా తక్కువ పంచాయతీలను గెలుచుకున్న నియోజకవర్గాల ఎమ్మెల్యేల వారి వివరాలు తెప్పించి, ఎందుకిలా జరిగిందో ఆరా తీయాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను ఆదేశించినట్టు తెలిసింది. పరిషత్ ఎన్నికల నాటికి గ్రూపుల సమస్య పరిష్కరించుకోవాలని, ఎక్కడా సమన్వయలోపం లేకుండా చూసుకోవాలని ఆయన్ను ఆదేశించినట్టు తెలిసింది.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

- మహిళా పథకంతో లాభాల్లోకి సంస్థ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటి వరకు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని చెప్పారు. పీఎం ఈ -డ్రైవ్ కింద నిజామాబాద్, వరంగల్ పట్టణాలకు 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ప్రకటించారు. కాగా, మార్చి వరకు 3,233 కండక్టర్ పోస్టుల అవసరం ఉందని, తాత్కాలికంగా నియామకాలతో పాటు 50 శాతం రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌కు అనుమతి ఇవ్వాలని మంత్రి పొన్నం ఈ సందర్భంగా డిప్యూటీసీఎంను కోరారు. సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, ఎంజేపీ కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ కార్పొరేషన్ వైపు మంత్రి అనుచరుడు కూల్చివేయించిన ప్రహరీ

మేడం ఆదేశిస్తే.. అనుమతులు నడిచొస్తాయి!

- పక్కదారి పట్టిన హౌసింగ్ బోర్డు రోడ్డు
- రాంకీ ఎన్‌క్లేవ్ ప్రహరీ కూల్చివేత
- సంపన్నుల కోసం మంత్రి అనుచరుడి ఆగడాలు
- బోర్డు సిబ్బందికి బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హౌసింగ్ బోర్డు ఈఈ

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 21: హౌసింగ్ బోర్డు ఫ్లాట్స్ రోడ్డు వ్యవహారం పక్కదారి పట్టింది. హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉన్న 102 ఫ్లాట్స్‌ను డ్రా పద్ధతిలో అమ్మకాలు జరపడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో విల్లావాసులు రోడ్డు మార్గం మార్చాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. 'మీకు కావాల్సిన రీతిన రోడ్డు మార్గంలో మార్పులు చేస్తాం' అని సంపన్నులకు వత్తాసు పలికిన మంత్రి.. వెంటనే తన అనుచరుడికి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే స్టేషన్‌కు అనుసంధానంగా ఉన్న ఆయిల్ కార్పొరేషన్ దారివైపు రాంకీ ఎన్‌క్లేవ్ ప్రహరీని కూల్చి.. రాంకీ విల్లాలకు హౌసింగ్ బోర్డు ఫ్లాట్ల మధ్య రోడ్డుకు అడ్డుగోడ నిర్మాణం చేపట్టడానికి మంత్రి అనుచరుడి ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సంబంధిత అధికారుల అనుమతులు, సంప్రదింపులు లేకుండానే భారీ యంత్రాలతో ప్రహరీని కూల్చివేశారు. అధికారుల అనుమతి లేనిదే కూల్చివేతలు చేపట్టవద్దని హౌసింగ్ బోర్డు తాత్కాలిక సిబ్బంది చెప్పినా వినకుండా.. 'మంత్రి సురేఖ మేడం ఆదేశించారు. అనుమతులు అవే నడుచుకుంటూ వస్తాయి. పక్కకి తప్పుకోవాలి' అంటూ మంత్రి అనుచరుడు శనివారం బెదిరింపులకు పాల్పడి మరీ దగ్గరుండి కూల్చివేతలు చేపట్టినట్టు సిబ్బంది తెలిపారు.

అయోమయంలో ఔత్సాహికులు

హౌసింగ్ బోర్డు తన ఆధీనంలో ఉన్న 102 ఫ్లాట్స్‌ను డ్రా పద్ధతిలో అమ్మకాలు జరపడానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిత్యం వందల సంఖ్యలో ఔత్సాహికులు ఫ్లాట్లను సందర్శించడానికి వస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన రోడ్డు మార్గంలో అడ్డంకులు కనిపిస్తుండటం, ప్రహరీని కూల్చి గేటు నిర్మాణానికి పనులు చేపట్టడంతో ఔత్సాహికులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆయిల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ రోడ్డు ద్వారా హౌసింగ్ బోర్డు ఫ్లాట్స్ వాసులు రాకపోకలు సాగించడానికి సంబంధిత సంస్థ అనుమతించని పక్షంలో కొనుగోలు అనంతరం ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పలువురు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. అనుమతులు లేకుండా ప్రహరీ కూల్చడంపై హౌసింగ్ బోర్డు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి ఆదేశాల మేరకు వరంగల్ డివిజన్ ఈఈ అంకమరావు ఆదివారం రాత్రి మంత్రి అనుచరుడితోపాటు రాంకీ విల్లాస్ అసోసియేషన్ ప్రతినిధులపై స్థానిక మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నడుమంత్రపోళ్లతో పార్టీకి నష్టం

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు

జగిత్యాల, డిసెంబర్ 21: నడుమంత్రపోళ్లతో కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతున్నదని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కొత్తగా గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జీవన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారితో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టు, స్పీకర్‌కు 'మేము పార్టీ ఫిరాయించలేదు' అని అఫిడవిట్ ఇచ్చారని ఎద్దేవాచేశారు. ఆఖరుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రెస్‌మీట్‌లో ఆ పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించలేదని, వారంతా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని మీడియాతో చెప్పారని గుర్తుచేశారు. ఆ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు చెందినవారేనని సీఎం చెప్పినా, సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులతో తిరగవట్టె.. ఇదెక్కడి న్యాయం..? అని ప్రశ్నించారు. వాళ్లది ఏ పార్టీయో వాళ్లకే తెలుస్తలేదు.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ నాయకులు పట్టుకెళితే.. కాంగ్రెస్ కార్యకర్తలు సుఖంగా నిద్రపోతారని చెప్పారు.



జగిత్యాలలో సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులతో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

- రెండేండ్లుగా కలిసిరాని సాగు
- మనస్తాపంతో బలవన్మరణం
- ఖమ్మం జిల్లాలో విషాదం

కారేపల్లి, డిసెంబర్ 21 : అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భల్లునగర్‌తండాకు చెందిన గుగులోతు నంద్యా (54) నిరుడు మిర్చి సాగుచేయగా తెగుళ్లసోకి దిగుబడి రాలేదు. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన నంద్యా శుక్రవారం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

కారు గుర్తుపై గెలిచా.. కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నా

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం
- కాంగ్రెస్ సర్పంచ్, ఉపసర్పంచ్‌ల సన్మాన సభలో శ్రీహరి ప్రకటన

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 21: తాను కారు గుర్తుతోనే గెలిచానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నట్టు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలుపొందిన కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఆదివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సన్మానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలిచానని, కానీ నియోజకవర్గ అభివృద్ధి కోసం రెండేండ్లుగా కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నట్టు వెల్లడించారు.



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మెదక్ జిల్లా పరిధిలోని హల్దీవాగు మధ్య నుంచి వేసిన మట్టి రోడ్డు

తోడేళ్ల తొండి జపం!

- తొవ్వ పెట్టినోళ్లే నీతుల వల్లింపు
- అక్రమ ఇసుకదందా చేస్తే చర్యలంటూ ప్రకటనలు
- హల్దీవాగులో కంటైనర్ల లెక్కలు వేస్తూ దొరికిన ముఠా
- 45 రోజులుగా అక్రమ దందా
- నమస్తే తెలంగాణ కథనం నేపథ్యంలో సుద్దులు

సిద్దిపేట, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హల్దీవాగులో తొవ్వ పెట్టిన తోడేళ్లే నీతులు వల్లిస్తున్నాయి. వాగు నీళ్లను మళ్లించి ఇసుక కొల్లగొట్టినట్టు ఆరోపణలు ఉన్న కాంగ్రెస్ ముఠానే మీడియా ముందు కొచ్చి అక్రమ వ్యాపారాన్ని సహించేది లేదంటూ పలుకుతున్నది. జిల్లాలో ఇక మీదట ఇసుక అక్రమదందా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలూ జారీ చేస్తున్నది. ఈమేరకు ఎస్పీ, డీఎస్పీ, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్టు మెదక్ జిల్లా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పోస్ట్ విస్మయం కలిగిస్తున్నది. 'నడివాగులో తోడేళ్ల తొవ్వ' అనే శీర్షికతో ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అయింది. మెదక్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. వాగుపై మూడుచోట్ల అక్రమ క్వారీలు ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా సుమారు 45 రోజులుగా మెదక్ నడిబొడ్డుగా లారీలు తిరుగుతున్నా ముఠానాయకులకు కనిపించలేదుగానీ, నమస్తేలో కథనం రాగానే హడావుడిగా ప్రకటన విడుదల చేయడంపై స్థానిక రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

దర్జాగా పర్సనల్ వాహనంలోనే

పొద్దంతా నాలుగు ప్రొక్లెయినర్లు వాగు మధ్యలో ఇసుక తోడి మేట వేస్తున్నాయి. రాత్రి 10 టైర్ల కంటైనర్లలో నింపి అటు కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు, ఇటు హైదరాబాద్ నగరానికి తరలిస్తుంటారు. స్థానికంగా ఒక్క లారీకి రూ 25 వేల చొప్పున లెక్కలు రాసుకునే వ్యక్తి స్వయానా కాంగ్రెస్ ముఠా నాయకుడి అనుచరుడే కావడం గమనార్హం. వాగు నుంచి జిల్లా సరిహద్దు వరకు ఆయనే బాధ్యుడు. ఇందుకోసం సదరు వ్యక్తి ప్రత్యేక ఇన్నోవా వాహనంలో తిరుగుతూ కనిపించారు. నమస్తే తెలంగాణ ప్రతినిధులు ఆ వాహనాన్ని హల్దీవాగు వద్దనే పసిగట్టి ఫొటోలూ తీసింది. ఆ వాహనం చూస్తే అందులో తిరిగే వ్యక్తి ఎవరో? ఎవరికి ప్రధాన అనుచరుడో.. మెదక్ పట్టణ ప్రజలెవరిని అడిగినా ఇట్టే చెబుతారు. రైతుల పొలాలను ఎండబెట్టి ఇంతకాలం అక్రమదందా చేసిన వ్యక్తులే, ఇప్పుడు బటయకు వచ్చి అలాంటివి చేయొద్దని ప్రకటనలు చేయడంపై పరిసర గ్రామాల రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దొంగలే దొంగా.. దొంగా.. అన్నట్టుగా వ్యవహరిస్తే తామెవరికి చెప్పుకోవాలని మక్తభూపతిపూర్, సంగాయగూడ రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



కాంగ్రెస్ నాయకుడి అనుచరుడి కారు

మార్కెట్ల బిల్లులు తడిసి మోపెడు!

ఆదాయం పెరిగినా.. భారీగా పేరుకుపోయిన వివిధ రకాల బిల్లులు

- స్వయంప్రతిపత్తి ఉన్నా ఫలితం సున్నా
- బిల్లుల మంజూరులో ఆర్థికశాఖ కొర్రీలు
- మంత్రి సొంత జిల్లాలోనే రెండేండ్లుగా సిబ్బందికి సక్రమంగా అందని వేతనాలు
- 4 నెలలుగా అవుట్‌సోర్సింగ్ జీతాలు బంద్
- బిల్లులు చెల్లించలేదని రాష్ట్రంలో 50 చోట్ల మార్కెట్లకు విద్యుత్తు సరఫరా తొలగింపు



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తేతెలంగాణ): నిత్యం రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న వ్యవసాయ మార్కెట్లకు పెండింగ్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. నెలలుగా అధికారులు, సిబ్బంది వేతనాలు, విద్యుత్తు, నీటి సరఫరా బిల్లులతోపాటు కనీస మౌలిక సదుపాయాల కల్పనా అవసరాల బిల్లులను కూడా చెల్లించలేని దుస్థితి మార్కెటింగ్ శాఖ ఎదుర్కొంటున్నది. రాష్ట్రంలోని 205 మార్కెట్లలో సుమారు 2,300 మంది వరకు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో కేవలం 500 మంది శాశ్వత ఉద్యోగులు ఉండగా, మిగతా 1,800 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. మార్కెట్ల విద్యుత్తు బిల్లులు దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పేరుకుపోయాయి. ఈ కారణంగా రాష్ట్రంలోని దాదాపు 50 మార్కెట్లలో విద్యుత్తు అధికారులు సరఫరాను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లా అయిన ఖమ్మంలోని మార్కెట్లకు కూడా విద్యుత్తు సరఫరాను తొలగించడం గమనార్హం. మార్కెట్లకు సరఫరా చేసిన వాటర్ బిల్లులు కూడా చెల్లించలేక పోవడంతో కాంట్రాక్టర్లు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో కొన్ని మార్కెట్లలో అధికారులు అప్పులు చేసి విద్యుత్తు, నీటి సరఫరా బిల్లులు చెల్లిస్తున్నారు. ట్రెజరీలలో వందలాది కోట్లు మూలుగుతున్నా నెలవారీగా బిల్లులను విడుదల చేయడంలో ఆర్థిక శాఖ కొర్రీలు పెడుతుండటంతో మార్కెటింగ్ శాఖ సెక్రటరీలు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలోని వివిధ మార్కెట్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రెండేండ్లుగా సక్రమంగా సమయానికి వేతనాలు అందడం లేదని వారే చెప్తున్నారు.

ఆర్థిక శాఖ పెత్తనం

మార్కెటింగ్ శాఖకు 1966 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. మార్కెట్లలో రోజువారీగా జరిగే క్రయ విక్రయాల ద్వారా వచ్చే నిధులను నిత్యం ట్రెజరీలలో జమ చేస్తారు. వాటి నుంచి తిరిగి నెలనెలా మార్కెట్ల వారీగా బిల్లులు పెట్టి సిబ్బంది వేతనాలతోపాటు కార్యాలయ అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేస్తారు. కానీ రెండేండ్ల నుంచి ఈ పరిస్థితుల్లో పూర్తిగా మార్పు వచ్చినట్టు అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు. ట్రెజరీల నుంచి బిల్లులు నెలల తరబడి మంజూరు కాకుండా ఆర్థిక శాఖ తన నియంత్రణతో అడ్డుకుంటున్నదని వాపోతున్నారు.

4 నెలలుగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల్లేవ్

రాష్ట్రవ్యాప్తంగా 205 మార్కెట్లు ఉండగా, దాదాపు 1800 మంది ఆవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. యార్డ్ క్లీనింగ్, అటెండర్లు, ఇతర ఉద్యోగులే అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వేతనంతో పనిచేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ ఆదాయం రూ.450 కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.800 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతున్నది. కానీ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు 4 నెలల నుంచి సిబ్బందికి వేతనాలను నిలిపివేశారు. దీంతో వేతనాలు అందకపోవడంతో పూట గడవని సిబ్బంది విధులను బహిష్కరించేందుకు సిద్ధమైనట్టు సమాచారం. అంతేగాకుండా రెండేండ్ల నుంచి గోదాముల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల్లో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్టు సమాచారం. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పెన్షన్ కూడా 3 నెలలుగా నిలిచిపోయింది.



కూల్చివేతలతో గోదావరిఖని చౌరస్తాలో పూర్తిగా నేలమట్టమైన భవనం

అర్ధరాత్రి కూల్చివేతలు!

- గోదావరిఖని చౌరస్తాలో భవనం నేలమట్టం
- రూ.35 లక్షల ఆస్తి నష్టం.. శిథిలాల వద్ద కుప్పకూలిన బాధిత కుటుంబం
- రామగుండం ఎమ్మెల్యే వైఖరిపై విరుచుకుపడిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

కోల్‌సిటీ, డిసెంబర్ 21: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గణేశ్‌చౌక్‌లో చేపట్టిన 'ఆపరేషన్ చౌరస్తా' బాధితుల రోదనలతో హోరెత్తింది. ఆదివారం రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కట్టడాలు కూల్చివేయగా, ఆ ప్రాంతం నిరసనలతో అట్టుడికింది. సిరిశెట్టి జయసుధ లలిత-మల్లేశంకు చెందిన భవనం అర్ధరాత్రి దాటాక నేలమట్టమైంది. శనివారం అధికారులు కూల్చివేస్తుండగా బాధిత కుటుంబం అనుమతి పత్రాలు చూపించగా.. ముందు, వెనుకభాగం కూల్చివేసి వెళ్లిపోయారు. జయసుధ సైతం తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకొని ఇంటికి వెళ్లిపోయింది. తెల్లవారి వచ్చిచూసేసరికి పూర్తిగా నేలమట్టమై ఉండటంతో ఆ కుటుంబం శిథిలాలపైనే కుప్పకూలింది. 'ఇది ఊరా..? వల్లకాడా..? మేము మనుషుల మధ్య లేమా..? 15 లక్షలు పెట్టి మొన్ననే షాపు కట్టుకున్న, అందులో 20 లక్షల సామగ్రి ఉంది. ఇప్పుడు మా గతేం కావాలి' అంటూ కన్నీరుపెట్టుకున్నది. బాధితులకు మద్దతుగా బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఆందోళనకు దిగగా.. న్యూ ఇండియా, జనసేనపార్టీల నాయకులు, సామాన్యులు, కూల్చివేతల బాధితులు కదిలివచ్చారు. మాజీ కార్పొరేటర్లు కౌశిక లత, లావణ్య బాధిత మహిళను ఓదార్చి ధైర్యం చెప్పారు. చౌరస్తాలో సత్యాగ్రహ దీక్ష చేపట్టి రామగుండం ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టారు. బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి మాట్లాడుతూ బాధితులకు ఎమ్మెల్యే వచ్చి నష్ట పరిహారం చెల్లించి ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యమని మాజీ కార్పొరేటర్ కౌశిక లత ప్రశ్నించారు. బీజేపీ నాయకులు రోజంతా సత్యాగ్రహ దీక్ష కొనసాగించారు. బాధిత మహిళకు షాపు నిర్మించేవరకు దీక్షను విరమించేది లేదని కొండపర్తి సంజీవ్ స్పష్టం చేశారు.

దళిత యువతి హత్యాచారంపై సిట్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్
- దళిత సంఘాల ఆధ్వర్యంలో నాలుగో రోజు నిజనిర్ధారణ

మహబూబ్‌నగర్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):/ మూసాపేట : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత యువతిపై లైంగికదాడి, ఆపై హత్య కేసును పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని దీనిపై సిట్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కేసును రాజకీయ కోణంలో చూడొద్దని సాక్షాత్తు ఎస్పీ పేర్కొనడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మందకృష్ణతోపాటు వివిధ ప్రజా సం ఘాలు, దళిత సంఘాల నాయకులు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామానికి వెళ్లి నిజనిర్ధారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడితోపాటు అతని స్నేహితుల పాత్ర కూడా ఉన్నదని ఊరు మొత్తం కోడై కూస్తున్నా పోలీసులు దర్యాప్తు చేపట్టడం లేదని ఆరోపించారు. 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. కలెక్టర్ విజయేంద్రబోయి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధికార పార్టీపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బందోబస్తు నడుమ బాధితులను పరామర్శించారు.



మహబూబ్‌నగర్ జిల్లా వేముల గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

మేడారం మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ



మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వాల్‌పోస్టర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. వచ్చే జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించే మహాజాతర పోస్టర్లను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి సీఎం విడుదల చేశారు. ఈ మేరకు మంత్రి సీతక్క సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. – ములుగు

ఎముకలు కొరికే చలి

- 14 జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా కోహీర్‌లో 5
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకూ పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో దట్టమైన పొగ మంచు కమ్ముకోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు 14 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. పలు జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల నుంచి 12 డిగ్రీల మధ్య నమోదయ్యాయని పేర్కొన్నది. దీంతో 14 జిల్లాలకు ఆరెంజ్, 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు వెల్లడించింది. రాబోయే రెండు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 తక్కువగా నమోదయ్యే అవకాశమున్నదని పేర్కొన్నది. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలో విపరీతమైన చలిగాలుల వీస్తున్నాయని తెలిపింది. అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 6.9 డిగ్రీల నమోదైనట్టు వెల్లడించింది. మరో వారంపాటు ఇవే వాతావరణ పరిస్థితులు ఇలానే కొనసాగుతాయని వివరించింది.

నిరుద్యోగుల నోట్లో మట్టి

- దక్షిణ డిస్కంలో అక్రమ ప్రమోషన్లు
- సంస్థలో 70 మంది సబ్ ఇంజినీర్లకు అసిస్టెంట్ ఇంజినీర్లుగా ప్రమోషన్లు
- ఇవన్నీ డైరెక్ట్ నియామక పోస్టులే
- ఇక కొత్తగా నియామకాలు లేనట్టే?

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా చోద్యంచూస్తున్న కాంగ్రెస్ సర్కారు.. న్యాయంగా నిరుద్యోగులకు దక్కాల్సిన పోస్టులనూ వారికి అందకుండా చేస్తున్నది. ఇందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్‌లో) కట్టబెట్టిన అక్రమ ప్రమోషన్లే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సంస్థ పరిధిలోని 70 వరకు సబ్ ఇంజినీర్లకు అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈ)లుగా పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతుల్లో డిస్కం హెచ్‌ఆర్ విభాగం నిబంధనలు తుంగలో తొక్కినట్టు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. తమకు దక్కాల్సిన ఏఈ పోస్టులను కింది స్థాయి ఉద్యోగులకు అక్రమంగా కట్టబెట్టి నిరుద్యోగులు నోట్లో మట్టిగొట్టారని మండిపడుతున్నారు. ఈ ప్రమోషన్లపై విద్యుత్తు ఇంజినీర్ల సంఘాలు సైతం అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ప్రమోషన్ల ఫలితంగా నిరుద్యోగులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

నిబంధనలు ఇవీ

విద్యుత్తు సంస్థల్లో ఏఈ పోస్టులే అత్యంత కీలకం. నిబంధనలకు అనుగుణంగా 90 శాతం ఖాళీలను డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ (డీఆర్) కోటాలో భర్తీ చేయాలి. కేవలం 10 శాతం ఖాళీలను సబ్ ఇంజినీర్లకు పదోన్నతులతో భర్తీచేయాలి. ఈ లెక్కన 100 పోస్టులు ఖాళీగా ఉంటే 90 పోస్టులను డీఆర్ కోటాలో, 10 పోస్టులను సబ్ ఇంజినీర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. కానీ కొత్త రిక్రూట్‌మెంట్ లేకుండా.. నోటిఫికేషన్‌ను విడుదల చేయకుండా డిస్కం హెచ్‌ఆర్ విభాగం అధికారులు 70 మంది వరకు ప్రమోషన్లు ఇచ్చారు. వాస్తవానికి 700 మందిని కొత్తగా నియమిస్తే 70 మందికి ఉద్యోగోన్నతి కల్పించాలి. కానీ కొత్తగా ఎవరినీ రిక్రూట్‌మెంట్ చేపట్టకుండానే 70 మందికి ప్రమోషన్లు కల్పించారు. అంటే కొత్తగా భర్తీ చేయాల్సిన పోస్టులు తగ్గిపోతున్నాయి. ఇక కొత్త రిక్రూట్‌మెంట్‌కు అవకాశమే ఉండదు. ఉద్యోగ నియామకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు నిరాశే మిగులుతుందని ఆందోళన వ్యక్తమవుతున్నది.

డిస్కం అధికారుల వింత సమాధానాలు

అక్రమ ప్రమోషన్లపై డిస్కం అధికారులు వింత సమాధానాలు ఇస్తున్నారు. ఇవన్నీ తాత్కాలిక ఉద్యోగోన్నతులేనని పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం నీళ్లు నములుతున్నారు. ఈ అక్రమ ప్రమోషన్లపై కొందరు ఇంజినీర్ల సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అయినా డిస్కం అధికారులు ఖాతరు చేయడమే లేదు. ఈ అక్రమ వ్యవహారంపై డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ సెక్రటరీలను కలిసి ఫిర్యాదు చేసేందుకు ఇంజినీర్ల సంఘాలు సిద్ధమవుతున్నాయి.

చేతులు మారిన ముడుపులు?

దక్షిణ డిస్కం అధికారులు చేపట్టిన ప్రమోషన్లపై ఇంజినీర్ల సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మునుపెన్నడూ ట్రాన్స్‌కో, ఉత్తర డిస్కంలో జరగనేలేదని తేల్చి చెప్తున్నారు. ఒకేసారి 70 మంది సబ్ ఇంజినీర్లకు ఏఈలుగా ప్రమోషన్లు కల్పించిన వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్టు మింట్ కంపౌండ్‌లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంతటితో ఆగకుండా మరో 70 పోస్టులను ఇదే రీతిన అక్రమంగా ప్రమోషన్లు కట్టబెట్టాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఇదే జరిగితే రాబోయే నాలుగైదేండ్ల వరకు కొత్తగా ఏఈ నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశమే కనిపించడం లేదు. పైగా అనుభవం లేని వారితో పనిచేయిస్తే భవిష్యత్తులో తీవ్ర నష్టం జరగనున్నదన్న వాదనలు ఉన్నాయి.





కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

- రేపటి నుంచి జనవరి 19 వరకు ఆందోళనలు
- సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 23 నుంచి జనవరి 19వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చాయి. ఆదివారం హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ మాట్లాడుతూ 23న విద్యుత్తు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా, 26న నల్ల జెండాలు, బ్యాడ్జీలతో జిల్లాకేంద్రాల్లో నిరసనలు, జనవరి 1 నుంచి 19వరకు కళాజాతలు నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 11ఏండ్లుగా అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను అమలుచేసి కార్మికుల హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. పార్లమెంట్ ఆమోదించిన 'వికసిత్ భారత్-జీ రామ్ జీ', విద్యుత్తు సవరణ చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ నాగయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆర్ వెంకట్రాములు, ఎస్ వీరయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, జే వెంకటేశ్, ఎస్ రమ పాల్గొన్నారు.

ఏపీపీ రాత పరీక్ష ప్రాథమిక 'కీ' విడుదల

అభ్యంతరాలకు 24 వరకు అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : తెలంగాణ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పరీక్ష పేపర్-1 ప్రాథమిక 'కీ' విడుదల చేసినట్టు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 21న సాయంత్రం 5గంటల నుంచి బోర్డు వెబ్‌సైట్ www.tgprb.inలో ఉంచామని పేర్కొన్నారు. ప్రాథమిక 'కీ'పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి అభ్యంతరానికి అభ్యర్థులు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. అభ్యంతరం సరైనదిగా తేలితే, ఆ మొత్తాన్ని తిరిగి రీఫండ్ చేస్తామని చెప్పారు. ప్రతి ప్రశ్నకు విడివిడిగా, నిర్ణీత వెబ్ టెంప్లేట్ ద్వారా మాత్రమే అభ్యంతరాలు సమర్పించాలని, సంబంధిత ఆధార పత్రాలు జత చేయడం తప్పనిసరని పేర్కొన్నారు. మ్యాన్యువల్‌గా పంపే దరఖాస్తులను బోర్డు పరిగణనలోకి తీసుకోదని, ఏదైనా ప్రశ్నను తొలగిస్తే, ఆ మార్కులను అభ్యర్థులందరికీ దామాషా పద్ధతిలో కేటాయిస్తామని స్పష్టంచేశారు.

ఓయూ 'లా' మార్కుల విధానంలో మార్పులు

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : మూడేండ్లు, ఐదేండ్ల లా కోర్సుల మార్కుల విధానంలో ఉస్మానియా యూనివర్సిటీ మార్పులు చేసింది. ఇంటర్నల్, సెమిస్టర్ పరీక్షల విధానంలో మార్పులు చేసింది. ఇంటర్నల్ మార్కులు పెంచి, సెమిస్టర్ మార్కులు తగ్గించింది. ఇప్పటివరకు ఇంటర్నల్స్‌కు 20, సెమిస్టర్ పరీక్షలకు 80 మార్కులు ఉన్నాయి. దీని స్థానంలో ఇంటర్నల్స్‌కు 30, సెమిస్టర్ పరీక్షలకు 70 మార్కులకు పరిమితం చేశారు. ఈ విద్యాసంవత్సరం పాత మార్కుల విధానమే కొనసాగనున్నది. కొత్త మార్కుల విధానం(2026-27) విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందని ఓయూ వర్గాలు తెలిపాయి.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి: టీఆర్‌టీఎఫ్

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని, 52% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్‌లోని డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరింది. టీఆర్‌టీఎఫ్ 80 వసంతరాల అభ్యుదయోత్సవం - విద్యాసదస్సును రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 2003 డీఎస్సీ టీచర్లకు పాత పింఛన్ అమలుచేయాలని, హైస్కూళ్లకు హెచ్‌ఎం, పీఈటీ పోస్టులు మంజూరుచేయాలని, జీపీఎఫ్ వడ్డీరేట్లు ప్రకటించాలని, ప్రతి సంవత్సరం పదోన్నతులు, బదిలీల క్యాలెండర్ అమలు చేయాలని, ప్రైమరీ స్కూళ్లకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరుచేయాలని కోరుతూ సదస్సులో తీర్మానాలను ఆమోదించారు. మంత్రులు టీఆర్‌టీఎఫ్ డైరీ, వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

పీఆర్టీయూ తెలంగాణ కార్యవర్గం ఎన్నిక


హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : పీఆర్టీయూ తెలంగాణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా పులి దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పున్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రావులకార్ వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతామని అబ్దుల్లా, పులి దేవేందర్ ప్రకటించారు.


జనవరి 20 నుంచి 'ఎఫ్ఎస్ఎల్' వెరిఫికేషన్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఫోరెన్సిక్ సైన్సెస్ ల్యాబొరేటరీ విభాగంలో పలు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జనవరి 20 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 పోస్టుల కోసం 4,665 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2,500 మంది పురుషులు, 2,165 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సైబరాబాద్ పోలీసు కమిషరేట్‌లో హాజరుకావాలని కోరారు. ఫిబ్రవరి 3వ లేదా 4వ వారంలో అర్హత సాధించిన వారికి రాతపరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.









ఫుడ్ డెలివరీతో రూ.1.42 కోట్ల సేవింగ్స్

- యువతకు ఆదర్శంగా నిలిచిన చైనా యువకుడు జాంగ్
- రోజుకు 13 గంటలు పని చేసి ఐదేండ్లలో సంపాదన



బీజింగ్: చైనాకు చెందిన జాంగ్ జుక్వి యాంగ్(25) అనే కుర్రాడు యువతకు ఆదర్శంగా నిలిచాడు. చేసేది ఫుడ్ డెలివరీ బాయ్ ఉద్యోగమైనా రోజుకు 13 గంటల పాటు పని చేస్తూ 5 ఏండ్ల కాలంలో రూ.1.42 కోట్లు కూడబెట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. షాంఘై లాంటి నగరంలో సాధారణ జీవితం జీవిస్తూ అనుకున్నది సాధించాడు. అయితే అతడి ప్రస్థానం నల్లేరు మీద బండి నడకలాగా సాగలేదు. 2020లో తన సొంతూరిలో అతడు ఒక బ్రేక్‌ఫాస్ట్ సెంటర్ ప్రారంభించి సుమారు రూ.6 లక్షలు అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చి తన కాళ్ల మీద తాను నిలబడాలనే పట్టుదలతో షాంఘైకి వలస వచ్చి ఫుడ్ డెలివరీ ఏజెంట్ గా చేరాడు. అప్పులు తీర్చడమే కాకుండా కనీసం కోటి రూపాయలు పొదుపు చేయాలన్నది అతడి లక్ష్యం.

ఆర్డర్ కింగ్‌గా గుర్తింపు

జాంగ్ ప్రతిరోజూ 13-14 గంటల పాటు పని చేస్తాడు. ఉదయం 10.40 నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు ఆర్డర్లు డెలివరీ చేస్తాడు. సెలవులు తీసుకోకుండా పని చేస్తాడు. డెలివరీ సమయంలో ఎప్పుడూ పరిగెడుతూనే ఉంటాడు. దీంతో తోటి రైడర్లు అతడిని గౌరవంగా ఆర్డర్ కింగ్ అని పిలుస్తారు. డబ్బు పొదుపులో భాగంగా జాంగ్ వ్యసనాలకు, లగ్జరీ ఖర్చులకు దూరంగా ఉన్నాడు. డబ్బు ఆదా కోసం విద్యుత్తు బైక్ వాడాడు. అయిదేండ్లలో సుమారు 3.24 లక్షల కిలోమీటర్లు ప్రయాణించాడు. ప్రస్తుతం తన దగ్గర ఉన్న సేవింగ్స్‌తో షాంఘైలో రెండు రెస్టారెంట్లు ప్రారంభించాలనేది అతడి ప్రణాళిక.

'ఈసీ సహకారంతో మహాయుతి విజయం'

- *ధనబలం, ఈవీఎంల తారుమారే కారణం: విపక్షాలు*
- *మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు విడుదల*



ముంబయి: మహారాష్ట్రలో 288 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 'మహా వికాస్ అఘాడీ' కూటమి ఘోర పరాభావాన్ని మూట గట్టుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సహకారం, ధన బలం, ఈవీఎంలు తారుమారు చేయటం.. తమ ఓటమికి దారి తీశాయని విపక్ష కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్) ఆరోపించాయి. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 207 స్థానాల్లో అధికార 'మహాయుతి కూటమి' విజయం సాధించింది. విపక్ష కూటమి 44 స్థానాల్లో గెలిచింది. ఈ తరుణంలో తమ ఓటమికి కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేశారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం సహకారంతో మహాయుతి కూటమి విజయం సాధించిందని ఆరోపించారు. అందుకు ఈసీని అభినందిస్తున్నట్టు వ్యంగ్యంగా విమర్శించారు. మహాయుతి కూటమి పెద్ద మొత్తంలో డబ్బులను కుమ్మరించిందని, ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వాడిన ఈవీఎంలనే స్థానిక ఎన్నికల్లో వాడారని ఆయన అన్నారు. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన(షిండే), ఎన్‌సీపీ(అజిత్‌వర్గం) పార్టీలు సాధించిన ఫలితాలే..మళ్లీ వచ్చాయని ఆయన ఉదహరించారు. గతంలో లేనివిధంగా ఈసారి అధికార పార్టీ నాయకులు హెలికాప్టర్లు, చార్టెడ్ ఫ్లైట్స్‌లో ప్రయాణిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారని సంజయ్ రౌత్ అన్నారు. స్థానికంగా బీజేపీ బలం, ప్రభుత్వ అభివృద్ధి ఎజెండాతో ఈ ఎన్నికల్లో విజయం సాధించినట్టు సీఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు.

సత్సంబంధాలతోనే సిసలైన సంతోషం!

- *అలాంటి వారికే దీర్ఘాయువు*
- *సంపద, కీర్తి, ప్రతిష్ఠల్లో ఆనందం లేదు*
- *హార్వర్డ్ అధ్యయనంలో వెల్లడి*



న్యూఢిల్లీ: ఇతరులతో మెరుగైన పరస్పర సంబంధాలు కొనసాగించేవారి జీవితం సంతోషకరంగా సాగుతుందని హార్వర్డ్ స్టడీ ఆఫ్ అడల్ట్ డెవలప్‌మెంట్ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. జీవితాన్ని ఆనందంగా ఉంచేవి డబ్బు, విజయాలు, కీర్తి, ప్రతిష్ఠలు కాదని 85 ఏండ్ల సుదీర్ఘ కాలం పాటు జరిగిన ఈ అధ్యయనం తెలిపింది. ''మిమ్మల్ని సంతోషంగా ఉంచేవి ఏమిటి?'' అని అడిగినపుడు మొదట ఈ సర్వేలో పాల్గొన్నవారిలో చాలా మంది బదులిస్తూ... డబ్బు, కీర్తి, ప్రతిష్ఠలు అని చెప్పారు. కానీ సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ, పరిశోధన జరుగుతున్న క్రమంలో అసలు వాస్తవం బయటపడింది. అత్యంత సంతోషంగా, ఆరోగ్యంగా, ఎక్కువ కాలం జీవించినవారు సంపన్నులు కాదని, గొప్ప పేరు, ప్రతిష్ఠలు గలవారు కాదని ఈ పరిశోధనలో తెలిసింది. ఇతరులతో మెరుగైన పరస్పర సంబంధాలు కలవారు చాలా సంతోషంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ హార్వర్డ్ అధ్యయనం 1938లో ప్రారంభమైంది. గ్రేట్ డిప్రెషన్ సమయంలో హార్వర్డ్‌లో సెకండియర్ అండర్ గ్రాడ్యుయేట్లు 268 మంది దీనిలో పాల్గొన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత బోస్టన్ ఇన్నర్ సిటీ నైబర్‌హుడ్ నుంచి 456 మంది పురుషులను దీనిలో చేర్చారు. వీరంతా వేర్వేరు సాంఘిక, ఆర్థిక నేపథ్యాలు కలవారు. నిజమైన సంతోషానికి కారణం, రహస్యం ఏమిటో తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పరిశోధన జరిగింది. దశాబ్దాలు గడుస్తుండగా, వీరికి వివాహాలు జరిగాయి, వైఫల్యాలు ఎదురయ్యాయి, వ్యాధులు వచ్చాయి, ఉద్యోగాలు, మాతృత్వం, పితృత్వం, పిల్లల పెంపకం, వృద్ధాప్యం వంటి దశలు వచ్చాయి. వీరిని క్షుణ్ణంగా పరిశీలించినపుడు నిలకడగా వెల్లడైన అంశం ఒకటే... పరస్పర సంబంధాలే మన జీవితాలను మిగిలినవాటి కన్నా ఎక్కువగా తీర్చిదిద్దుతాయనేది. ఈ సర్వేలో మొదట్లో పాల్గొన్న వారి వారసులు 1,300 మంది ప్రస్తుతం ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ప్రేమ, ఒత్తిడి, అనుబంధాలు తరతర అంశాలు ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో ఈ అధ్యయనం వెల్లడించింది.

డబ్బు, పేరు ప్రతిష్ఠలు సంతోషాన్ని ఇస్తాయని చాలా మంది భావిస్తారు కానీ, జీవిత భాగస్వాములు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంతో బలమైన, సహకారాత్మక సంబంధాలు కలవారి జీవితం సంతోషంగా ఉంటుందని ఈ అధ్యయనం తేల్చింది. దీర్ఘకాలిక సంతోషం, ఆరోగ్యానికి ఏకైక అత్యధిక శక్తిమంతమైన సూచిక మన సంబంధాలేనని పేర్కొంది. జీవితం ఒడిదొడుకుల్లో ఉన్నపుడు ఇటువంటి సంబంధాలు ఓదార్పును, అర్థవంతమైన పరిస్థితులను కల్పిస్తాయి. శారీరక, మానసిక కుంగుబాటు సమయాల్లో భరోసాను ఇస్తాయి.

రైలు టికెట్ చార్జీల పెంపు

- జనరల్ క్లాస్‌కు 215 కి.మీ తర్వాత కి.మీకు 1 పైసా పెంపు
- ఏసీ క్లాస్‌కు 500 కి.మీ.కు పది రూపాయలు పెంపు
- సబర్బన్ రైళ్ల టిక్కెట్ చార్జీల్లో మార్పు లేదన్న రైల్వే శాఖ



న్యూఢిల్లీ: ఆరు నెలల వ్యవధిలో రైల్వే శాఖ మరోసారి ప్రయాణికుల చార్జీలు పెంచింది. పెరిగిన చార్జీలు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. సబర్బన్ రైలు ప్రయాణ చార్జీలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఆ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.... 215 కిలోమీటర్ల ప్రయాణం వరకు జనరల్ క్లాస్ టికెట్ ధరల్లో మార్పు ఉండదు. అంత కన్నా ఎక్కువ దూరం ప్రయాణిస్తే, ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున చార్జీ పెరుగుతుంది. మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ క్లాస్ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరుగుతాయి. ఏసీ క్లాస్ ప్రయాణానికి కూడా ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున టికెట్ చార్జీ పెరుగుతుంది. ఈ కొత్త చార్జీలు అమల్లోకి వస్తే, నాన్ ఏసీ క్లాస్‌లో 500 కి.మీ ప్రయాణానికి టికెట్ ధర రూ.10 పెరుగుతుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ ప్రయాణ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున పెరిగింది, ఏసీ క్లాస్‌లో ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరిగింది. ఈ పెంపు వల్ల సంవత్సరానికి రూ.600 కోట్ల ఆదాయం రైల్వేలకు సమకూరుతుంది. గడచిన దశాబ్దంలో నెట్‌వర్క్, కార్యకలాపాలను గణనీయంగా విస్తరించినట్లు రైల్వేలు ప్రకటించింది. ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచినట్లు తెలిపింది. ఉద్యోగుల కోసం ఖర్చులు రూ.1,15,000 కోట్లకు పెరిగినట్లు, పింఛను వ్యయం రూ.60 వేల కోట్లకు పెరిగినట్లు వివరించింది. ఈ ఖర్చులను భరించడం కోసం కార్గో లోడింగ్, ప్రయాణికుల టిక్కెట్ చార్జీల పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొంది.

రైల్వేల్లో సిబ్బంది కొరతను పరిష్కరించాలి

పూర్తి స్థాయిలో విద్యుదీకరణ చేసిన డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్స్ ఆచరణలో ఎదురు దెబ్బలు తగిలే అవకాశం ఉందని పార్లమెంటరీ స్థాయీ సంఘం హెచ్చరించింది. ప్రత్యేక అత్యధిక సామర్థ్యంగల ట్రాక్‌లతో ఈ కారిడార్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచిస్తున్నారని, అయితే, సిబ్బంది అందుబాటులో ఉండటం వంటి నిర్వహణ పరమైన అడ్డంకులను సక్రమంగా పరిష్కరించకపోతే, ఈ స్వప్నం సాకారమయ్యే అవకాశం ఉండదని తెలిపింది. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీఎఫ్‌సీసీఐఎల్) రైళ్లను నడపడంలో ఎదుర్కొనే అతి పెద్ద సవాల్ సిబ్బంది లభ్యత అని రైల్వే శాఖ అంగీకరించింది. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ హెచ్చరిక చేసింది. 2025 జూన్ 1 నాటికి రైల్వేలలో రైళ్ల నిర్వహణలో ఉన్న వివిధ కేటగిరీలలో పనిచేసే ఉద్యోగుల సంఖ్యను ఈ కమిటీకి రైల్వే శాఖ తెలిపింది. లోకో పైలట్ ఉద్యోగాలు 1,42,814 కాగా, పని చేస్తున్నవారు 1,07,928 మంది అని పేర్కొంది. 22,082 గూడ్స్ రైలు మేనేజర్స్ (గార్డులు) ఉద్యోగాలు 22,082 కాగా, పని చేస్తున్నవారు 12,345 మంది అని తెలిపింది. స్టేషన్ మాస్టర్లు, స్టేషన్ సూపరింటెండెంట్లు సహ అన్ని కేటగిరీల్లోనూ 2,06,495 ఉద్యోగాలు ఉండగా, 1,59,219 ఉద్యోగాలు భర్తీ అయినట్లు పేర్కొంది. సరుకు రవాణాలో ఆలస్యాన్ని, కనిష్ట స్థాయికి తగ్గించడానికి, డీఎఫ్‌సీ నెట్‌వర్క్‌లో అంతరాయాలు లేకుండా సరుకు రవాణా జరగడానికి వీలుగా సిబ్బంది కొరత సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పష్టం చేసింది. డీఎఫ్‌సీ నెట్‌వర్క్‌లో సజావుగా రైళ్ల కార్యకలాపాలు జరగాలంటే తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఫ్రైట్ ద్వారా వచ్చే ఆదాయం కారణంగానే రైల్వేలు సాధారణ ప్రజానీకానికి టిక్కెట్ ధరలను అందుబాటులో ఉంచగలుగుతున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. రైలు బోగీలు, వ్యాగన్లపై వాణిజ్య ప్రకటనలు ఆచరణ సాధ్యమైన ఆదాయ మార్గమని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొంది.

న్యాయవ్యవస్థలో జిల్లా జడ్జిలది కీలక పాత్ర

- నాణ్యమైన తీర్పులు ప్రాథమిక బాధ్యత
- జిల్లా జడ్జిలకు జస్టిస్ ప్రశాంత్ కుమార్ సూచన

గుంటూరు: జిల్లా న్యాయ వ్యవస్థ న్యాయ వ్యవస్థలో కీలకమని, ఈ నేపథ్యంలో జిల్లా జడ్జీలు సంక్లిష్ట సమయాల్లోనూ ప్రశాంతంగా ఉండాలని సుప్రీంకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 'రాజ్యాంగ దార్శనికతను నిలబెట్టడంలో జిల్లా న్యాయ స్థానాల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో కీలక ఉపన్యాసం చేశారు. న్యాయ వ్యవస్థలోని ప్రతి అంశం రాజ్యాంగంలో పేర్కొన్న ఆదర్శాల ప్రకారం పని చేయాలని తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశ న్యాయ వ్యవస్థ విశాలమైనదన్నారు. నాణ్యమైన తీర్పులు ఇవ్వడం న్యాయ వ్యవస్థ ప్రాథమిక బాధ్యత అని చెప్పారు. కోర్ట్ ప్రొసీడింగ్‌లు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉండాలన్నారు. దీని వల్ల ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు. చట్టాలకు, న్యాయానికి న్యాయ వ్యవస్థ వారధిలాగా పని చేయాలన్నారు. కోర్టు తీర్పులు సామాన్యులకు చాలా సందర్భాల్లో ఊరట కలిగిస్తాయని చెప్పారు.

'ఏఐ, చాట్‌జీపీటీ టెక్నాలజీ వాడొద్దు'

- వాటి ద్వారా దేశ రహస్యాలు లీక్ అవ్వొచ్చు
- ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: మనదేశంలో ఏఐ, చాట్ జీపీటీ టెక్నాలజీ వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. అయితే ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వాడటం అత్యంత ప్రమాదకరమని కేంద్రం తాజాగా పేర్కొన్నది. దేశానికి సంబంధించిన రహస్య సమాచారమంతా బయటకు వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి చెందిన సమాచారాన్ని మరింత ఎక్కువగా, చక్కగా తీర్చిదిద్దేందుకు కొందరు అధికారులు ఏఐ, చాట్ జీపీటీల ద్వారా షేర్ చేస్తున్నట్టు కేంద్రం తెలిపింది. దీనివల్ల మనదేశంలో ఏం జరుగుతున్నది? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న పనులు, ఇతర కీలక సమాచారం అంతా ఏఐ, చాట్‌జీపీటీ ద్వారా పక్క దేశాలకు చేరుతున్నట్టు కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. వీటిని అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సభకు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ ఈ రెండు వేదికల్లో (ఏఐ, చాట్ జీపీటీ) ప్రభుత్వ సమాచారాన్ని షేర్ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి తెలిపారు.

నాటి యుద్ధ బెటాలియన్ త్రిపురలో మోహరింపు

అగర్తల: భారత్-పాకిస్థాన్ మధ్య 1971లో జరిగిన యుద్ధంలో పోరాడిన ఆర్మీ బెటాలియన్‌ను త్రిపురలో మోహరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా ఆదివారం తెలిపారు. బంగ్లాదేశ్‌లో అశాంతి పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. బీజేపీ లీగల్ సెల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో క్షేత్ర స్థాయి పరిణామాలు, వాటి ప్రభావం గురించి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు చెప్పారు. ముక్తి బహినికి శిక్షణనిచ్చిన, 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న బెటాలియన్ ఇప్పుడు త్రిపురలో ఉందన్నారు. అంతర్జాతీయ సరిహద్దులో సైన్యం లేదని కొందరు ఆరోపిస్తున్నారని చెప్పారు. ఈ రోజుల్లో యుద్ధం చేయడానికి సైనికులు భౌతికంగా హాజరు కావాల్సిన అవసరం లేదని, శత్రువులను నాశనం చేయడానికి ఒక క్లిక్ చాలునని వివరించారు.



కశ్మీర్‌లో భారీ హిమపాతం, వర్షాలు

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్, లడఖ్, ఈశాన్య హిమాచల్ ప్రదేశ్‌లలో ఆదివారం భారీగా మంచు కురిసింది. ఇక్కడ ఎత్తయిన ప్రాంతాల్లో సోమవారం వరకు భారీ హిమపాతం, వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ మంచు తుఫానులు కూడా వస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేశ రాజధాని నగరం ఢిల్లీలో చలి ఎక్కువైంది. అక్కడ ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రత 9.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లో సగటు ఉష్ణోగ్రత కన్నా 1.3 డిగ్రీలు ఎక్కువ. గరిష్ఠ ఉష్ణోగ్రత 18.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఢిల్లీలో సోమవారం ఓ మోస్తరు పొగ మంచు ఉంటుందని, కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీల సెల్సియస్, గరిష్ఠ ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండవచ్చునని సూచించింది.



వీబీ-జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఉపాధి హామీ చట్టానికి (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) సమూల మార్పులు చేస్తూ దాని స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'వీబీ-జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఆమోద ముద్ర వేశారు. దీంతో 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు-2025' మరికొద్ది రోజుల్లో చట్టంగా అమల్లోకి రాబోతున్నది. దీనికి సంక్షిప్త రూపమే 'వీ బీ-జీ రామ్ జీ'. గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో సమూల మార్పుల్ని ప్రతిపాదిస్తూ కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరు తొలగిస్తూ, రాష్ట్రాలపై నిధుల భారాన్ని మరింత పెంచటాన్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి. పని కోరే హక్కును కొత్త బిల్లు కాలరాసిందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా పాత చట్టాన్ని మార్చుతూ, కొత్త దాన్ని తీసుకొచ్చామని కేంద్రం తెలిపింది.

అణుశక్తి ప్రమాదాలపై బాధ్యత వహించాలి

- అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా భారత్ నడవాలి
- ఇండియాతో చర్చల కోసం చట్టం చేసిన ట్రంప్ సర్కార్



వాషింగ్టన్, న్యూఢిల్లీ: భారత దేశంలోని దేశీయ పరమాణు సంబంధిత సంఘటనలపై బాధ్యతలకు సంబంధించిన నిబంధనలు అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అమెరికా చెప్పింది. ఇటీవల భారత పార్లమెంట్ శాంతి బిల్లును ఆమోదించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 19న నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డీఏఏ)పై సంతకం చేశారు. ఈ చట్టంలో పేర్కొన్న దాని ప్రకారం అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ భారత ప్రభుత్వంతో ఉమ్మడి సంప్రదింపుల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. 2008నాటి ఇండో-యూఎస్ అణు శక్తి ఒప్పందం అమలును మదింపు చేయాలి. యూఎస్-ఇండియా వ్యూహాత్మక భద్రత చర్చల పరిధిలో ఈ సంబంధాలను నెలకొల్పుకోవాలి. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా భారత దేశ దేశీయ అణు శక్తి, అణు విద్యుత్తు ఉత్పత్తి, నష్ట పరిహార నిబంధనలు ఉండేలా చూడాలి. శాంతి బిల్లు ప్రకారం ఈ బాధ్యతను రూ.3,000 కోట్లకు పరిమితం చేశారు. అణు ప్రమాదం జరిగినపుడు సివిల్ బాధ్యతపై వియెన్నా ఒప్పందానికి దాదాపు అనుగుణంగా శాంతి బిల్లు ఉంది. అదే విధంగా అణు ప్రమాదం జరిగినపుడు అనుబంధ నష్టపరిహారంపై ఒప్పందానికి కూడా అనుగుణంగా ఉంది.

ట్రంప్‌తో సయోధ్య కోసమే శాంతి బిల్లు: కాంగ్రెస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సయోధ్య కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ శనివారం ఎక్స్‌లో దీనిపై పోస్ట్ చేశారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఆయన విరుచుకుపడ్డారు. 'ఒకప్పటి మంచి మిత్రుడి'తో శాంతిని పునరుద్ధరించుకోవడానికి, అమెరికా ప్రయోజనాలను కాపాడటం కోసం శాంతి బిల్లును పార్లమెంటులో బుల్డోజ్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ పోస్ట్‌లో ఆయన నేరుగా ట్రంప్ పేరును ప్రస్తావించలేదు. ట్రంప్ ఈ నెల 19న ఎన్‌డీఏఏపై సంతకం చేసిన నేపథ్యంలో జైరామ్ రమేశ్ ఈ ఆరోపణలు చేశారు. అణు ప్రమాద పరిహార నిబంధనలపై భారత్, అమెరికా మధ్య ఉమ్మడి మదింపు జరగాలని ఎన్‌డీఏఏలో ప్రత్యేకంగా పేర్కొన్నవిషయాన్ని ఆయన ప్రస్తావించారు. శాంతి బిల్లును పార్లమెంటులో బుల్డోజ్ చేయడం వెనుకగల అసలు కారణం బయటపడిందన్నారు. సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్, 2010 నిబంధనలను తొలగించడంతోపాటు ఇతర అంశాలను పక్కనబెట్టి ఈ బిల్లును పాస్ చేశారని దుయ్యబట్టారు.

యూరప్‌లో ఖాళీగా చర్చీలు!

- మూర్ఖపు విశ్వాసాలను యువత తిరస్కరిస్తున్నారు
- ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: క్రిస్మస్ సమీపిస్తున్న వేళ రాజ్యసభ మాజీ సభ్యుడు, ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్‌లో చర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయని, యువత తర్కం లేని, ఆధారాల్లేని మూర్ఖపు విశ్వాసాలను తిరస్కరిస్తున్నారని అన్నారు. మారుతున్న కాలానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా హేతుబద్ధంగా ఆలోచించే యువత సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. ది లల్లన్‌టాప్ డిబేట్‌లో దేవుడు ఉన్నాడా ? అనే అంశంపై మాట్లాడిన జావేద్ అక్తర్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థీకృతమైన మత విశ్వాసాలను విమర్శనాత్మకమైన ఆలోచన విధానం, విద్యతో యువత తిరస్కరిస్తున్నారని తెలిపారు. 'నమ్మకం అనే దానికి ఆధారం, సాక్ష్యం, హేతుబద్ధత, తర్కం ఉండదు. తర్కం, ఆధారం లేని విషయాన్ని మూర్ఖత్వం అంటారు. ప్రశ్నించడం ద్వారానే మానవ సమాజం ఎప్పుడూ పురోగతి సాధిస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీ ఎమ్మెల్యే దంపతుల ఖాతాలో ఉపాధి నిధులు

ఉత్తరాఖండ్‌లో రాజకీయ దుమారం.. విచారణకు ఆదేశం



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ బీజేపీ ఎమ్మెల్యే దుర్గేశ్వర్ లాల్, ఆయన భార్య నిషా బ్యాంకు ఖాతాల్లోకి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు జమయ్యాయి. ఈ విషయం రాజకీయ దుమారానికి దారి తీసింది. అయితే గతంలో ఎమ్మెల్యే దంపతులకు జాబ్ కార్డులు ఉండటం వల్లే ఆ నిధులు జమ అయ్యాయని బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు తెలిపారు. తనను అప్రతిష్ఠపాలు చేయడానికే ఈ కుట్ర జరిగిందని దుర్వేశ్వర్ లాల్ తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి శశి భూషణ్ ఎమ్మెల్యే దంపతుల ఖాతాల్లో జమ అయిన ఉపాధి హామీ నిధులను రికవరీ చేస్తామని తెలిపారు. దుర్గేశ్‌లాల్ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఉపాధి హామీ పనుల ద్వారా రూ.5,214 పొందారు. 2021-25 మధ్య కాలంలో ఎమ్మెల్యే దంపతులిద్దరూ కలిసి ఈ పథకం ద్వారా రూ.22,962 వేతనంగా పొందినట్లు తేలింది. అయితే ఇందుకు సంబంధించిన మస్టర్ రోల్స్‌పై తాను సంతకాలు చేయలేదని సంబంధిత అసిస్టెంట్ ఉద్యోగి యశ్వంత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైళ్లు అందుబాటులో లేవన్నారు.

'ఆరావళి'పై అసత్య ప్రచారం ఆపండి

- కేవలం 0.19%శాతం పరిధిలోనే తవ్వకాలు
- కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర



న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఆరావళి పర్వతాల మైనింగ్‌పై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. అక్కడ కేవలం 0.19% శాతం పరిధిలోనే తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. ఆరావళి పర్వతాలు ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల పరిధిలో 1,47,000 చదరపు కిలోమీటర్లమేర విస్తరించి ఉన్నాయి. ఆరావళి పర్వతాల పరిధిని నిర్దేశించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ వ్యవహారం 1985 నుంచి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఆరావళి పరిధి నాలుగు రాష్ట్రాల్లో ఒకే నిర్వచనం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. పర్వతాల కింది నుంచి పైభాగం వరకు 100 మీటర్ల వరకు విస్తరించి ఉంటాయని, రెండు పర్వతాల మధ్య ప్రదేశాన్ని కూడా ఆరావళిగానే పరిగణించాల్సి ఉంటుందని వివరించారు.

జెనీవాలో భారత అధికారి అవినీతి

- రూ.2 కోట్ల నిధుల స్వాహా
- సీబీఐ విచారణ షురూ

న్యూఢిల్లీ: జెనీవాలో భారత శాశ్వత కమిషన్‌లోని ఓ మాజీ అకౌంటెంట్ దాదాపు రూ.2 కోట్ల నిధులను సొంత ఖాతాలోకి మళ్లించి అవినీతికి పాల్పడినట్టు సీబీఐ గుర్తించింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. నిందితుడు మోహిత్ నిరుడు డిసెంబర్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా చేరాడు. భారత కార్యాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌లో ఖాతాలున్నాయి. వాటి నిర్వహణను అతడికి అప్పగించారు. చెల్లింపుల కోసం కొన్ని క్యూఆర్ కోడ్‌లను ఉపయోగిస్తుండగా.. మోహిత్ నకిలీ కోడ్‌లను సృష్టించి ఏడాది కాలంలో రూ.2 కోట్లను తన ఖాతాలోకి మళ్లించినట్టు అధికారులు గుర్తించారు.

చిగుళ్ల సమస్యలు.. గుండె జబ్బుకు సంకేతాలు!

- *అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనంలో వెల్లడి*
- *నోటి శుభ్రతతో అనారోగ్యాన్ని నివారించొచ్చని సూచన*



అమెరికా, డిసెంబర్ 21: నోటి శుభ్రత, చిగుళ్ల ఆరోగ్యంతో ఇతర వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చని గతంలో వివిధ పరిశోధనలలో తెలిపిన శాస్త్రవేత్తలు... తాజాగా మరో కీలక విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు అమెరికన్ హార్ట్ అసోసియేషన్, కార్డియో వ్యాస్కులర్ డిసీజ్ ప్రివెన్షన్ కమిటీ శాస్త్రవేత్తలు పరిశోధన పత్రాన్ని విడుదల చేశారు. జన్యు శాస్త్ర పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్, ల్యాబ్ పరీక్షల ఫలితాలు, దశాబ్దాల కాలం నాటి పరిశోధక ప్రచురణలను పరిశీలించి ఈ అధ్యయనం నిర్వహించారు. చిగుళ్ల వ్యాధులు అథెరోస్క్లెరోటిక్ కార్డియో వాస్క్యులర్ డిసీజ్ (ధమనులు మూసుకుపోవడం) వల్ల కలిగే గుండె సమస్యలు పీరియాంటల్ వ్యాధితో దగ్గర సంబంధం కలిగి ఉన్నాయని తాజా పరిశోధన నివేదికలో స్పష్టం చేశారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించారు. దెబ్బ తిన్న చిగుళ్ల ద్వారా శరీరంలోకి బ్యాక్టీరియా ప్రవేశిస్తుందని గుర్తించారు. చిగుళ్లు, నోటి ఆరోగ్యం దెబ్బ తింటే ప్రమాదకరమైన రక్తనాళాల వాపు సమస్య వస్తుందని పేర్కొన్నారు. పొగ తాగడం, వృద్ధాప్యం, ఊబకాయం కారణంగా చిగుళ్ల వ్యాధులు, ధమనులు మూసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు.




శ్రద్ధగా వినేటపుడు కళ్లు ఆర్పరు!

కెనడా శాస్త్రవేత్తల అధ్యయనం

న్యూఢిల్లీ: ఇతరులు మాట్లాడేటపుడు వినే వారి కనురెప్పలు కొట్టుకోవడం తగ్గుతుందని తాజా అధ్యయనంలో తేలింది. ఇతర శబ్దాలు వినిపిస్తున్నపుడు కనురెప్పల కదలికలు తగ్గుతాయి. కెనడాలోని మాంట్రియేల్‌లో ఉన్న కొంకార్డియా విశ్వవిద్యాలయం సైకాలజీ రీసెర్చర్ పెనెలోప్ కౌపాల్ మాట్లాడుతూ, ఈ అధ్యయనంలో 49 మంది పాల్గొన్నారు. వీరు కొన్ని వాక్యాలను వింటూ ఉండగా, వీరి కనురెప్పలు కొట్టుకునే సంఖ్యను నమోదు చేశారు. ఈ ప్రయోగాల్లో వెలుగు పరిస్థితిని, నేపథ్యం నుంచి వినపడే శబ్దాలను మార్చుతూ, అధ్యయనం చేశారు.

జ్ఞాపకశక్తిపై కాలుష్యం పిడుగు

పిల్లల మెదడుపై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ: బాలల అభివృద్ధి చెందుతున్న మెదడుపై గాలి కాలుష్యం ప్రభావం తీవ్రంగా ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. దీనివల్ల భాష అభివృద్ధి, జ్ఞాపకశక్తి, మనఃస్థితి నియంత్రణలకు నష్టం జరుగుతుంది. గాలి కాలుష్యం వల్ల పర్టిక్యులేట్ మ్యాటర్, నైట్రోజన్ డయాక్సైడ్, ఓజోన్ వంటి హానికర పదార్థాలు పర్యావరణంలో వ్యాపిస్తాయి. అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీకి చెందిన ఫిజిషియన్-సైంటిస్ట్‌ల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. గాలి కాలుష్యానికి గురైతే, కౌమార దశలోని వ్యక్తి మెదడులో మౌలిక శారీరక మార్పులు జరుగుతాయి. మెదడులో కార్యకలాపాల నిర్వహణ, భాష, మనఃస్థితి నియంత్రణ, సామాజిక - భావోద్వేగ సమాచారాన్ని గ్రహించి, అర్థం చేసుకుని, స్పందించే ప్రక్రియ జరిగే ప్రాంతాలపై ప్రభావం పడుతుంది. బాలల ఆరోగ్యం, సంక్షేమం, జీవన గమనంపై ఈ మార్పుల ప్రభావం పడుతుందని పరిశోధకులు హెచ్చరించారు. ఈ అధ్యయన నివేదిక ప్రధాన రచయిత కెల్విన్ జారా మాట్లాడుతూ... మెదడుపై నెమ్మదిగా, సూక్ష్మంగా పడుతున్న ప్రభావాన్ని తాము గుర్తించామని చెప్పారు. వీటి లక్షణాలు తక్షణమే కనిపించకపోవచ్చునన్నారు. కానీ వీటి ఫలితంగా శారీరక, మానసిక, జ్ఞాన సంబంధమైన అభివృద్ధి ప్రక్రియలో కాలం గడిచే కొద్దీ మార్పులు వస్తాయని చెప్పారు. ఈ అధ్యయనంలో సుమారు 11,000 మంది బాలల సమాచారాన్ని విశ్లేషించారు. 'ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది.

రోదసిలో కూలిన మస్క్ శాటిలైట్

కాలిఫోర్నియా: ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్స్‌లో ఒకటి ఇటీవల అంతరిక్షం నుంచి అదుపుతప్పి కుప్పకూలింది. ఈ శాటిలైట్‌లోని కొన్ని భాగాలు భూమి వైపునకు దూసుకొస్తున్నాయి. ఈనెల 17వ తేదీన శాటిలైట్ '35956' భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. అది హఠాత్తుగా అక్కడి నుంచి కూలిపోవటం మొదలైంది. స్పేస్ ఎక్స్ దీనిపై వివరణ ఇస్తూ, 'ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ బయటకు వెలువడింది. దీంతో అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలు విడిపోయి మెల్లగా కదలడం మొదలుపెట్టాయి. వారం రోజుల్లో అవి భూమి వాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చు' అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది.



నాడు.. నేడు జల కెరటం పాలమూరే!

అప్పుడు గురువు.. ఇప్పుడు శిష్యుడి తీరుతో దగాపడ్డ మహబూబ్‌నగర్ రైతాంగం

- మరోసారి పోరుగర్జనకు సిద్ధమైన కేసీఆర్
- ప్రజల బతుకులు మళ్లీ ఆగమాగం చేస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ
- నెల రోజుల ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం

వరంగల్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి పాలకుల జలదోపిడీపై ఉద్యమ నాయకుడిగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. నాడు ఎక్కడైతే సమరశంఖాన్ని పూరించారో.. ఇప్పుడూ అక్కడి నుంచే యుద్ధభేరి మోగించనున్నారు. నాడు జోగులాంబకు ప్రణమిల్లి పాలమూరు వలస బతుకులకు చెరమగీతం పాడుతానని ప్రతినబూనారు. అన్నట్టుగానే రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైన తరువాత అహోరాత్రులు కష్టపడి అదే పాలమూరులో రివర్స్ వలసలను ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు దత్తపుత్రుడినని ఊదరగొట్టిన చంద్రబాబుకు ఏ రీతిలో ఉద్యమ రుచి చూపించారో, ఇప్పుడు నల్లమల పులిబిడ్డనని చెప్పుకుంటున్న ఆ గురువుకు శిష్యుడు పాలమూరు తలరాతను శాశ్వతంగా చీకటి చేయాలని చూస్తుంటే రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగారు. నాడు గురువు.. నేడు శిష్యుడు.. పాలమూరు బతుకును బుగ్గిపాలు చేస్తే ఊరుకోబోమని, ఎక్కడ ఆగిందో అక్కడినుంచే పోరాటం మొదలవుతుందని ఆదివారం తెలంగాణభవన్ సాక్షిగా అల్టిమేటమ్ జారీచేశారు.

నాడు జోగులాంబకు ప్రణమిల్లి..

తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన తొలినాళ్లలో 2003 మే 20వ తేదీన ఆలంపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించిన కేసీఆర్.. మే 25న గద్వాలకు చేరారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఆ పాదయాత్ర సంచలనమైంది. శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారు ఉద్యమ నాయకుడిని దీవించింది. సుదీర్ఘకాల పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైంది. రాష్ట్రం సాకారమైన తరువాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్.. ఉమ్మడి పాలమూరు రూపురేఖలను మార్చేశారు. పడావు పడ్డ భూముల్లో పసిడి సిరులు కురిపించారు. పాలమూరు నేలతల్లికి పట్టుపీతాంబరం కట్టారు. ఉమ్మడి పాలకుల కుట్రలకు పెండింగ్ ప్రాజెక్టుల జాబితాలో జమైన బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, జూరాల ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేశారు. ఫలితంగా ఒక్క పాలమూరులోనే 6.5 లక్షల ఎకరాలకు నీళ్లు అందించారు. కృష్ణా నదిలో న్యాయంగా పాలమూరుకు రావాల్సిన వాటాను ఒడిసిపట్టుకునేందుకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును దాదాపు 90% పూర్తిచేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత ముఖ్యమైన పర్యావరణ అనుమతులు తీసుకొచ్చారు. వడ్డించిన విస్తరిలా పాలమూరును సిద్ధం చేస్తే, రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ విస్తరిని నేలపాలు చేసేందుకు సిద్ధమవుతున్న పరిస్థితిపై కేసీఆర్ సమర శంఖం పూరించారు. ఉద్యమకాలంలో నాడు ఎక్కడినుంచి పాదయాత్ర మొదలు పెట్టారో ఇప్పుడూ అదే పాలమూరు నుంచి పోరుపతాకను ఎగురవేస్తుండటం విశేషం.

పాలమూరుపై మళ్లీ ఉద్యమ పొద్దు

పాలమూరుపై మళ్లీ ఉద్యమ పొద్దు పొడవబోతున్నది. రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణ ప్రయోజనాలను శాశ్వతంగా ఫణంగా పెట్టే నిర్ణయాలు తీసుకోవడం, తెలంగాణ హక్కులను శాశ్వతంగా కృష్ణాలో కలిపేసే ప్రయత్నాలు జరుగుతుండటంతో ఇలాగే ఉపేక్షిస్తే, అసలుకే మోసం వస్తుందని గ్రహించిన కేసీఆర్ ప్రజాచైతన్య కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

దాదాపు నెలరోజులపాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో నాటి జలసాధన ఉద్యమాన్ని తలపించేవిధంగా జలపోరాట కార్యాచరణను ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశంలో సిద్ధం చేసినట్టు స్పష్టమవుతున్నది. ఊరూర ఉద్యమ దండోరా మోగించడం, బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన కార్యక్రమాలు, తద్వారా కృష్ణాబేసిన్ ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించడం, రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణ ప్రయోజనాలను ఎలా తాకట్టుపెడుతున్నదో, తెలంగాణ శాశ్వత హక్కులను ఎలా గంగపాలు చేస్తున్నదో ప్రజలకు అర్థమయ్యేలా ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కేసీఆర్ మాటలతో స్పష్టమైంది. మొత్తానికి అప్పుడూ, ఇప్పుడూ అదే పాలమూరు నేలతల్లికి జలాభిషేకం చేసేందుకు కేసీఆర్ రంగంలోకి దిగుతుండటం విశేషం.

కాంగ్రెస్‌కు ఇక నిద్ర కరువే?

- కేసీఆర్ ఆరోగ్యంపై అబద్ధాల ప్రచారం పటాపంచలు
- ఒక్కసమావేశంతో మారిన సీన్
- గులబీ శ్రేణుల్లో నయా జోష్

వరంగల్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కేసీఆర్ పనైపోయింది... ఇక ఆయన ఫాంహౌజ్‌కే పరిమితం... క్రియాశీల రాజకీయాల నుంచి శాశ్వతంగా దూరం.. వయసు రీత్యా, ఆరోగ్య సమస్యల రీత్యా ఆయన ఇక ప్రజాక్షేత్రంలోకి రారు..' అని రెండేండ్లుగా అధికార పక్షం ఉద్దేశపూర్వకంగా కొనసాగించిన అబద్ధాల ప్రచారాన్ని ఒకేఒక్క సమావేశంతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పటాపంచలు చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశం ఇన్నాళ్లు చెలరేగిపోయిన గొంతులను చీల్చిచెండాడింది. సమావేశం ప్రారంభం నుంచి కేసీఆర్ గంటన్నరపాటు నిలబడి ప్రసంగించారు. తరువాత కూర్చొని మరో గంటన్నరపాటు ఏకధాటిగా కాగితం ముక్కలేకుండా ధారపాతమై ప్రవహించారు. ఆ తరువాత మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. అదో గంటంబావు. మొత్తంగా నాలుగు గంటలకుపైగా కేసీఆర్ పార్టీ శ్రేణులతో ముచ్చటించారు. తెలంగాణ భవన్ కేంద్రంగా చోటుచేసుకున్న ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్ర ఉక్కపోతకు గురిచేసింది. ఆయన మంత్రివర్గాన్ని ఖిన్నులను చేసింది. మొత్తంగా అధికార పక్షానికి నిద్రపట్టని వాతావరణాన్ని కేసీఆర్ సృష్టించారు. మరోవైపు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు ఆ సమావేశం వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. బీఆర్‌ఎస్‌ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్, పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్

తేదీ ఖరారైనప్పటి నుంచి రాజకీయాలు తీవ్రమైన ఉత్కంఠ రేపాయి. 'చాలా రోజుల తరువాత కేసీఆర్ బయటికి (తెలంగాణభవన్‌కు) వస్తున్నారు. ఆయన ఏం మాట్లాడతారు? వివిధ పరిణామాలపై ఎలా స్పందిస్తారు? పార్టీ భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి? పార్టీ శ్రేణులకు ఎలాంటి దిశానిర్దేశం చేస్తారు?' తదితర అనేక ప్రశ్నలకు కేసీఆర్ ఒకే ఒక సమావేశంతో జవాబు ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయన టీం ఇంతకాలం చేసిన క్షుద్ర ప్రచారాన్ని తునాతునకలు చేశారు. నోరు జారితే ఇకనుంచి 'తోలు తీస్తా' అని హెచ్చరించారు.

గులాబీ శ్రేణుల్లో నయా జోష్

సుదీర్ఘ విరామం తరువాత గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం తొణికిసలాడింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీకి నైతికబలాన్ని అందిస్తే, పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై కేసీఆర్ తనదైన శైలిలో నిప్పులు చెరిగారు. ఎర్రవెల్లి నివాసం నుంచి శనివారం కేసీఆర్ నందినగర్ చేరుకోవడం, అక్కడి నుంచి ఆదివారం తెలంగాణ భవన్‌లో నాలుగు గంటలపాటు గులాబీ శ్రేణులకు రోడ్‌మ్యాప్ ఇవ్వడమే కాకుండా, తెలంగాణ ప్రజల్లో గూడుకట్టుకున్న అనుమానపు ముసుర్లను కేసీఆర్ దూరం చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నటికైనా తెలంగాణకు తామే అసలు సిసలు భూమిపుత్రులమని బీఆర్‌ఎస్ శ్రేణులు సగర్వంగా సమరనినాదం చేసేలా కేసీఆర్ కర్తవ్యబోధ చేశారని బీఆర్‌ఎస్ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. మరో ఉద్యమానికి తాము వారధులం అవుతున్నామని గులాబీ శ్రేణులు సమరోత్సాహం ప్రదర్శిస్తున్నాయి. కేసీఆర్ కనబడితే కదనభేరి, మాట్లాడితే మరఫిరంగి అన్నట్టుగా తయారైన స్థితికి తెలంగాణభవన్‌కు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలే నిదర్శనం. ప్రజాక్షేత్రంలో బరిగీసి నిలబడతామని కేసీఆర్ అల్టిమేటమ్ ఇవ్వడంతో కాంగ్రెస్ సర్కార్‌కు 'ఇక ముందున్నది ముసళ్ల పండుగే'నని భావిస్తున్నారు. ఉద్యమ కాలంలోనే కాదు ఇప్పుడు కూడా కేసీఆర్ మాట్లాడితే సంచలనమని మరోసారి నిరూపితమైంది. 'కేసీఆర్‌లో వేడి తగ్గలేదు. మాటల వాడి తగ్గలేదు' అని బీఆర్‌ఎస్ శ్రేణులు ఉప్పొంగిపోతున్నాయి. ఇక ఉద్యమ పిడికిళ్లై లేస్తామని గులాబీ శ్రేణులు చెప్తున్నాయి. 'ఐయామ్ ఇన్ ది ఫీల్డ్' అని ప్రకటించిన కేసీఆర్ పోరాట పటిమకు తెలంగాణ పబ్బతి పడుతున్నది.

జగన్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు



నిండు నూరేండ్లు ప్రజాసేవలో కొనసాగాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రారంభానికి ముందు కేసీఆర్ జగన్‌కు ఫోన్ చేశారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కాగా, జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన కేసీఆర్‌కు జగన్ కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం ఆయనకు ప్రత్యేకంగా ఫోన్ చేసి సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేండ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో కొనసాగుతూ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని అభిలషించారు.

420 హామీలు మూసీలో కలిపేశారా?

సోనియాగాంధీకి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయం లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త నాటకాలు వేస్తున్నదని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీకి బహిరంగలేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? .. లేక గాంధీభవన్‌లో పాతరేశారో ప్రజలకు తెలియజేయాలని ప్రశ్నించారు. అధికారం చేపట్టి రెండేండ్లు అవుతున్నా ఎన్నికల హామీల అమలులో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో గురించి ఏనాడైనా తెలుసుకోవడానికి ప్రయత్నించారా అని నిలదీశారు. రెండేండ్ల పాలనపై సీఎం రేవంత్‌రెడ్డిని మీరు ఎందుకు అభినందించారు..? హామీలు ఎగ్గొట్టినందు కా.? ప్రజలను మోసం చేసినందుకా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చిత్తశుద్ధిని చాటుకొని 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గౌరీజీ యువ పురస్కార్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : జనమంచి గౌరీశంకర్(గౌరీజీ) యువపురస్కార్‌కు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవాకార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలు, ఇతర రంగాల్లో విశేష కృషిచేసిన 40 ఏండ్లలోపు యువత ఈ నెల 25లోపు అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవార్డు కింద ఎంపికైన వారికి జనవరి 3,4,5 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే 44వ రాష్ట్ర మహాసభల్లో రూ. 50వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తామని తెలిపారు. ఆశావాహులు soabvptg@ gmail.comకు తమ బయోడేటాను పంపించాలని కోరారు. వివరాల కోసం 94409 81137, 96661 49044 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు @600 కోట్లు

ప్రభుత్వ దవాఖానలకు బాకీ పడిన ప్రభుత్వం

- ప్రైవేటు దవాఖానలకు విడుదల కాని 100 కోట్లు
- చెల్లింపులో కాంగ్రెస్ సర్కారు జాప్యం
- ఆరోగ్య పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర!



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): వైఎస్‌ఆర్ హయాంలోని కాంగ్రెస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు నీరుగారుస్తున్నదా? ఇందులో భాగంగానే 'ఆరోగ్యశ్రీ' పథకానికి బకాయిలు పెండింగ్ పెడుతున్నదా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తున్నది. ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశలోనే అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలోని పెద్ద దవాఖానలైన సికింద్రాబాద్‌లోని గాంధీ, ఎంఎన్‌జే, టీచింగ్ హాస్పిటల్స్, వైద్యవిధాన పరిషత్‌కు చెందిన వాటితోపాటు జిల్లా కేంద్రాల్లోని దవాఖానలకు రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.600 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నిధుల కొరత కారణంగా సర్కారు దవాఖానలకు ఖరీదైన మందులు, సర్జికల్ ఇంప్లాంట్లు (స్టంట్లు, ప్లేట్లు), ఇతర అత్యవసర సేవలకు సంబంధించిన పరికరాలను సరఫరా చేసిన ఏజెన్సీలకు బిల్లు చెల్లింపులు నిలిచిపోయాయి. దవాఖానల్లో శస్త్రచికిత్సలు, వైద్యం అందించే వైద్యులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతున్నది.

దవాఖానల నిర్వహణ భారంగా

రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్సకు పేరు గాంచిన

• దవాఖానా • బకాయిలు

ఎంఎన్‌జే క్యాన్సర్	₹100 కోట్లు
గాంధీ	50 కోట్లు
నిజామాబాద్ జీజీహెచ్	9 కోట్లు

ప్రభుత్వ ఎంఎన్‌జే దవాఖానకు రూ.100 కోట్లు, గాంధీ దవాఖానకు రూ.50 కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నట్టు తెలిసింది. నిజామాబాద్ జిల్లా దవాఖానకు రూ.9 కోట్లు, ఇంకా వరంగల్ ఎంజీఎం సహా రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన దవాఖానలకు పెద్ద ఎత్తున బకాయిలు చెల్లించకపోవడంతో వాటి నిర్వహణ భారంగా మారింది. మరోవైపు రూ.1400 కోట్ల బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ప్రైవేటు నెట్‌వర్క్ దవాఖానలు ఇటీవల రాష్ట్రంలో 'ఆరోగ్యశ్రీ' సేవలు నిలిపివేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్రభుత్వం వారిని చర్చలకు పిలిచి ప్రతి నెలా తప్పనిసరిగా రూ.100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఆచరణలో మాట తప్పింది. గత రెండు నెలలుగా 'ఆరోగ్యశ్రీ' పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ దవాఖానలు అల్లాడుతున్నాయి. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు నెట్‌వర్క్ దవాఖానలకు 'ఆరోగ్యశ్రీ' చెల్లింపుల్లో జాప్యం కారణంగా పథకం అమలుపై నీలినీడలు అలుముకున్నాయి.

జీతాలు వస్తున్నాయనే సాకుతో

ప్రభుత్వ దవాఖానల్లో ఆయా సర్జరీలు, చికిత్సలకు సంబంధించి వైద్యులకు ఆరోగ్యశ్రీ కింద ఇన్సెంటివ్ ఇవ్వాలి. కానీ వారికి జీతాలు ఇస్తున్నాం అన్న నెపంతో ఇన్సెంటివ్‌ల చెల్లింపులో ప్రభుత్వం ఆలసత్వం వహిస్తున్నది. ఇంప్లాంట్స్ సప్లై చేసే వారికి కూడా చెల్లింపులు జరపాలి.ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై దృష్టి సారించి వెంటనే 'ఆరోగ్యశ్రీ'కి నిధులు విడుదల చేయాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.



హైదరాబాద్-శ్రీశైలం కారిడార్‌కు మోక్షమెప్పుడో?

- వచ్చే ఏడాది ప్రణాళికలో చేర్చే యోచనలో కేంద్రం
- సగం ఖర్చు భరించలేక రాష్ట్ర ప్రభుత్వం తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్-శ్రీశైలం కారిడార్ పనులు ఇప్పట్లో మొదలయ్యే అవకాశాలు కనిపించడంలేదు. ఈ ప్రాజెక్టు ఖర్చులో సగభాగాన్ని భరించేందుకు ఒప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆ నిధులను ఎలా సమకూర్చుకోవాలో తెలియక తర్జన భర్జన పడుతున్నది. దీంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ప్రాజెక్టుల జాబితాలో దీన్ని చేర్చాలని యోచిస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఉండటం వల్ల ప్రస్తుతం రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) వద్ద రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు 4 లేన్లతో దాదాపు 147 కి.మీ. పొడవైన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆ ప్రాజెక్టుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో 54 కి.మీ మేర 4 లేన్ల స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. వన్యప్రాణులకు హాని లేకుండా 32 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించేందుకు రూ.7,700 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అందులో సగం ఖర్చు భరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి హామీ ఇచ్చింది. బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి మొదలయ్యే ఈ కారిడార్ కృష్ణానది మీదుగా శ్రీశైలం డ్యామ్ సమీపంలోని ఈగలపెంట వరకు సాగుతుంది. అక్కడి నుంచి జాతీయ రహదారి 765లో విలీనమవుతుంది. రిజర్వు ఫారెస్ట్ ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం రోజూ రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ఇరువైపులా ట్రాఫిక్‌ను నిలిపివేస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. ముఖ్యంగా వారాంతాల్లో వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్‌ను ఆపాల్సిన అవసరం ఉండదు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపినప్పటికీ ఇంకా ఎన్‌హెచ్‌ఏఐ పనుల ప్రణాళికలో స్థానం లభించలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ప్రాజెక్టుల్లో దీనికి చోటు కల్పించనున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. దీంతో హైదరాబాద్-శ్రీశైలం కారిడార్ ఎప్పటికి పూర్తవుతుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఎనిమిదేండ్ల క్రితమే మంజూరైన ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టుకే ఇంకా దిక్కులేదు. ట్రిపుల్‌ఆర్‌కు టెండర్లు పిలిచి, పనులు చేపడతామని కేంద్రం చెప్తున్నప్పటికీ అందుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పూర్తిచేయలేదు. హైదరాబాద్-శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం సిద్ధమైనప్పటికీ సగం ఖర్చును భరించగలిగే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా నిర్వహించలేక హైబ్రిడ్ యాన్యుటీ మాడల్ (హ్యామ్) ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. కానీ, ఈ ప్రాజెక్టుకు రుణ సహాయం అందించేందుకు బ్యాంకులు ముందుకు రావడంలేదు. కాంగ్రెస్ సర్కారుపై నమ్మకం లేక కాంట్రాక్టర్లు సైతం పనులు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ ప్రతినిధులు బాలరాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

రిజర్వేషన్లపై మోదీని ప్రశ్నించరెందుకు?

- రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 9ని ఎందుకు సమర్థించిన్రు
- ఎంపీ ఆర్ కృష్ణయ్యను ప్రశ్నించిన బీసీ పొలిటికల్ ఫ్రంట్

ఖైరతాబాద్, డిసెంబర్ 21 : బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి ఎందుకు తీసుకెళ్లరు? రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-9ని ఎందుకు సమర్థించిన్రు? అని ఎంపీ ఆర్ కృష్ణయ్యను బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ ప్రశ్నించారు. ఆర్ కృష్ణయ్య బీజేపీ ఎంపీ హోదాలో ప్రధానమంత్రి పక్కనే కూర్చుంటారని, కానీ, 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించాలని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు అయిలి వెంకన్నగౌడ్, అం బాల నారాయణగౌడ్‌లతో కలిసి బాలరాజుగౌడ్ మాట్లాడుతూ.. జీవో-9 తీసుకురాగానే బీసీ సంఘాల ప్రతినిధులుగా చెప్పుకునే కొందరు సీఎం రేవంత్‌రెడ్డికి వంతపాడారని, ఆయన ఇంటిచూట్టూ ప్రదక్షిణలు చేశారని ఎద్దేవా చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17శాతం మాత్రమే ఇచ్చి బీసీలకు తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. అయినా, జనరల్ స్థానాలను కూడా వదలకుండా 51శాతం మంది బీసీలు సర్పంచ్‌లుగా గెలిచి రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పినట్టు పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలున్నా, బీసీల రిజర్వేషన్లపై వారికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలే బీసీల రాజ్యాధికారానికి తొలిమెట్టని, అదే స్ఫూర్తితో రాను న్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశం లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు ఎలికట్టె విజయ్‌కుమార్, బైరు శేఖర్‌గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ధోబీ బాధ్యతెప్పుడో?

- అటకెక్కిన కేసీఆర్ సర్కార్ జీవో 102
- ప్రభుత్వసంస్థల్లో ధోబీ పనులు రజకులకే
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఉత్తర్వులు
- ఇప్పటికీ అమలుకు నోచుకోని దుస్థితి
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్.. కావాలనే తాత్సారం
- రాష్ట్రవ్యాప్తంగా 4,417కుపైగా సొసైటీలు



హైదరాబాద్, డిసెంబర్21 (నమస్తే తెలంగాణ) : రజకుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 102 జీవోనూ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అటకెక్కించింది. ప్రభుత్వ సంస్థల్లో బట్టలుతికే పని రజకులకే అప్పగిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. దానిని అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ తీవ్ర తాత్సారం చేస్తున్నది. అమలు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్నది లేదని రజకసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ గురుకులాలు, వైద్యశాలలు తదితర ప్రభుత్వసంస్థల్లో బట్టలు ఉతికే పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. అయితే ఆర్థిక స్థోమత లేని రజకులు ఆ పనులను పొందలేకపోతున్నారు. అదేసమయంలో స్థోమత కలిగిన ఇతర కులాలు, వర్గాలు కాంట్రాక్టు పనులను చేస్తుండగా, రజకులు వారివద్దే కూలీలుగా కాలం వెల్లదీస్తున్న దుస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వసంస్థల్లో బట్టలుతికే కాంట్రాక్టు పనులను రజక సొసైటీలకు అప్పగించాలని, రజక కులస్తులకు వృత్తి రక్షణ కల్పించాలని కులసంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఇదే విషయమై పలుమార్లు నేరుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలను కలిసి వినతపత్రాలు అందజేశారు. సంఘాల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వసంస్థల్లో బట్టలు ఉతికే పనులను ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదనే నిర్ణయించడంతో ఫెడరేషన్ పరిధిలోని 4,417 రజక సొసైటీలు హర్షం వ్యక్తం చేశాయి.

వారికే బాధ్యతలు


రజక సొసైటీల ద్వారా రజకులకు మాత్రమే ఆ పనులను అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జూన్30వ తేదీన జీవో 102 ను జారీ చేసింది. ప్రభుత్వ హాస్టళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లోని స్పోర్ట్స్ అకాడమీల హాస్టళ్లు, దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, రోడ్లు భవనాలశాఖ పరిధిలోని గెస్ట్‌హౌస్‌లు, పోలీస్ డిపార్ట్‌మెంట్ హెడ్ క్వార్టర్లు, బెటాలియన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డిస్ట్రిక్ట్ వైద్యశాలలు, తెలంగాణ వైద్యా విధాన పరిషత్‌లోని దవాఖానల్లో బట్టలు ఉతికే పనిని అప్పగించాలని నిర్ణయించింది. ఆ మేరకు 102 జీవోలో స్పష్టంగా పేర్కొంటూ వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఎండీకి ఆదేశాలను సైతం జారీ చేసింది.

పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 102 జీవో అమలును అటకెక్కించింది. జీవో అమలుకు అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఫిబ్రవరిలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనలు పంపి ఏడాది కావస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి స్పందన లేదు. జీవో అమలు చేయాలని ఇప్పటికీ రజకసంఘాల నేతలు, రాష్ట్రంలోని 4,417 సొసైటీలు అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి, మంత్రులను కూడా కలిశాయి. అయినా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంపై రజకసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా 102 జీవోను వెంటనే అమలు చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



తెలుగు రుబాయి రూపం.. సారం

ఇతర భాషా సాహిత్యాల నుంచి కొన్ని కవితా రూపాలు తెలుగులోకి వచ్చి చేరుతూ ఉండటం గత 50 ఏండ్ల నుంచి జరుగుతున్న పురోగతి. జపాన్ నుంచి హైకూ వచ్చింది. ఫారసీ నుంచి గజల్, రుబాయి వచ్చాయి. కొంతమంది ఇంగ్లిష్ సానెట్‌ను, హిందీ దోహాను కూడా తెలుగులోకి తేవడానికి కొంత ప్రయత్నం చేశారు. కానీ, అవేవీ తెలుగులో వేళ్లూనుకోలేదు. బయటి రూపాలైన హైకూ, గజల్, రుబాయి తెలుగులో కొంతమేరకు స్థిరపడ్డాయి. రుబాయి తెలుగు పద్యానికి దరిదాపుల్లో ఉండే ఒక కవితా రూపం.

తెలుగు పద్యం లాగే రుబాయి నాలుగు పాదాలు కలిగి ఉంటుంది. నిర్దిష్టమైన స్థానంలో కచ్చితంగా రదీఫ్, రదీఫ్‌కు ముందు కాఫీయా అనబడే అంత్యప్రాస లాంటిది ఉండటం కనీస ఛందస్సు. ఇంకా మాత్రల సమత, గతులతో కూడిన గమనం అభిలషణీయమైన ఛందస్సు. ఇట్లా చూసినప్పుడు తెలుగు పద్యం కన్నా కఠినమైన నిబంధనలు ఉన్న రుబాయి సహజంగానే తెలుగు వాళ్లకు కష్టమైన రూపంగా తొందర్లోనే అర్థమైంది. ఆ రూపానికి పూర్తిగా కట్టుబడి రచన చేయడం, పాఠకులకు చేరువయ్యేంతగా చమత్కారం సాధించడం చాలా కష్టమని చాలామంది భావించారు. డాక్టర్ సినారె రుబాయిని ఇంకా కొంచెం విస్తరించి సరళ ఛందస్సుతో ప్రపంచ పదులను సొంతంగా రూపొందించుకున్నారు తప్ప రుబాయిని కొనసాగించలేదు. అంతకుముందు రాసిన దాశరథి లాంటి కవులు రదీఫ్ కాఫీయాలను అంత్యప్రాసలుగానే భావిస్తూ రాశారు.

> 'కళ్లెం ఉన్నది మన చేతిలో
> అయినా గుర్రం పడె గోతిలో
> దప్పి తీరదని నేనంటాను
> నీళ్లే లేని మన నూతిలో'

అనే తన ప్రసిద్ధ రుబాయి ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది.

పూర్తిస్థాయి రదీఫ్, కాఫీయాలు పాటిస్తూ రాసిన రుబాయి కవి తెలుగులో తొలిగా తిరుమల శ్రీనివాసాచార్య. ఆయన కూడా విస్తృత సంఖ్యలో రుబాయిలు రాయాల్సిన లక్ష్యం పెట్టుకోవడం వల్ల చాలా చోట్ల రదీఫ్‌ను కాఫీయా స్థాయికి తీసుకువచ్చారు. ఇంకా చెప్పాలంటే అంత్యప్రాసనే రదీఫ్‌గా భావిస్తూ కూడా రాశారు. అందువల్ల తెలుగు రుబాయిలలో రదీఫ్ అంటే అంత్యప్రాస అనే ఒక దురభిప్రాయం ప్రబలింది.

రుబాయి అనే పేరు పెట్టుకొని రాస్తూ ఉన్నప్పుడు దాని కచ్చితమైన ఛందస్సు పాటించకుండా ఉండటం సరికాదని భావిస్తూ నేను 'తెలంగాణ రుబాయిలు' కావ్యం ద్వారా రూప స్థిరీకరణ చేయడానికి ప్రయత్నించాను. తెలంగాణ రుబాయిలు వచ్చాక కూడా నాతో చాలా సందర్భాల్లో రుబాయి చర్చ చేసినవాళ్లూ తాము రాస్తూ ఉన్న క్రమంలో ఛందస్సు పట్ల అంత శ్రద్ధ వహించకుండా రాస్తూ దానికి రుబాయి అని పేరు పెట్టడం నాకు ఆశ్చర్యం గొలుపుతూ ఉంటుంది.

హైకూలు, గజల్‌లు, రుబాయిలు, దోహాలు, సానెట్‌లు తెలుగులో వచ్చినప్పటికీ వాటికి మౌలిక భాషలో ఉన్న కీర్తిలో 10 శాతం కూడా తెలుగులో అందుకోలేకపోయాయి. అందుకు కారణం ఆ భాషకు, ఆ కవితా రూపానికి ఒక విడదీయరాని లంకె ఏదో భాష మారినప్పుడు విడిపోతూ ఉంటుందని అనిపిస్తుంటుంది. ఈ సందర్భంలోనే సామల సదాశివ చెప్పిన ఒక మాట గుర్తుకొస్తుంది. తెలుగులోని ఆటవెలదిని, తేటగీతిని ఇతర భాషలలో రాయడానికి ప్రయత్నం చేస్తే ఎలా ఉంటుందో ఊహించాలని అంటారాయన. నిజమే! ఎక్కువ మంది తెలుగులో ప్రయోగించలేక పోయిన సానెట్, దోహాలను పక్కకు పెట్టి గజల్‌లు, రుబాయిలు, హైకూలు తెలుగులో విజయవంతమైనవనే అనిపించినా వాటి విజయం కూడా పాక్షికమే. ఎందుకంటే హైకూలలో భౌతిక ఛందస్సేదీ ఉన్నట్టు అనిపించకపోయినా ఒక తెలియని మార్మిక ఛందస్సు అందులో ఉన్నదని, దాన్ని భాషాంతరీకరణ చేయడం వల్ల మనం దాని మౌలికతను పట్టుకోలేకపోతున్నామని తరచూ అనిపిస్తూ ఉంటుంది. ఇక గజల్‌లు, రుబాయిల విషయానికి వస్తే వాటికి కఠినమైన భౌతిక ఛందస్సు ఉంది. కానీ, చాలామంది తరచూ భౌతిక ఛందస్సును వయొలేట్ చేస్తూ రాస్తూ ఉన్నారు. ముఖ్యంగా రదీఫ్‌ను సమాన పద పునరుక్తి లాగా కాకుండా అంత్యప్రాసలాగా వాడుతూ ఉన్నారు.

> **అత్యంత సుప్రసిద్ధ కవులైన వాళ్లు కూడా తెలిసో, తెలియకో రదీఫ్ అంటే అంత్యప్రాస అనుకుంటున్నారు. ఇక కాఫీయా గురించిన చింత చాలామంది కవులకు ఉండటం లేదు. ఇక్కడ ఈ విషయాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసి ఎలాంటి ఛందోలోపం లేకుండా రాస్తున్న వాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారు.**

రుబాయిలో నాలుగే పాదాలుంటాయి. అందులో ఒక మూడో పాదంలోనే కొంత స్వేచ్ఛ ఉంటుంది. మిగిలిన మూడు పాదాల్లో రదీఫ్‌గా ఒకే పదం ఉండి తీరాలి. కాఫీయా అన్నది రదీఫ్‌కు ముందు ఉండే పదం. ఇది మిగిలిన మూడు కాఫీయాలతో మైత్రి కలిగి ఉండాలి. ఈ మాటను చాలామంది అంత్యప్రాసగా భావిస్తూ ఉంటారు. కానీ, కాఫియా శబ్ద ప్రాధాన్యంతో కాకుండా, ధ్వని ప్రాధాన్యంతో ఉంటుంది.

రుబాయి పారసీ ఛందో రూపం. అది మొదలు పారసీలో పుట్టిందా? అరబ్బీలో పుట్టిందా? అనే చర్చ ఉంది. అది ఉర్దూ నుంచి తెలుగులోకి ప్రవేశించింది. అర్బా అనే అరబ్బీ పదం నుంచి రుబాయి అనే పదం ఏర్పడింది. అర్బా అంటే నాలుగు అని అర్థం. ఇంచుమించు తెలుగులో పద్యం లాంటిది. రుబాయిలో 1వ, 2వ, 4వ పాదాలకు రదీఫ్ కాఫీయాల నియమం ఉన్నది. 3వ పాదంలో ఆ నియమాలు ఉండనవసరం లేదు. ఇక ఐచ్ఛికంగా మాత్రాఛందస్సును కూడా వాడుతూ ఉంటారు. అంటే అన్ని పాదాలలో మాత్రల సమత కూడా పాటిస్తారు. అయితే ఉర్దూ మహాకవులు కూడా రదీఫ్‌ను కాఫీయాను వదిలివేసిన సందర్భాలు అక్కడక్కడ కనిపిస్తాయి. దీన్ని ఆధారం చేసుకొని రదీఫ్ కాఫీయాలు ఐచ్ఛికం మాత్రమే అనే అభిప్రాయానికి రావడం సరికాదు. అలా చూసినప్పుడు రదీఫ్ కాఫీయా మాత్రల సమత అనేది రుబాయిల ఛందస్సుగా చెప్పుకోవచ్చు. నరేశ్ నదీమ్ అనే విమర్శకుడు తన 'ఉర్దూ కవితా ఔర్ ఛందశాస్త్'లో చెప్పిన 'రుబాయి చార్ మిస్రోంకి హోతీ హై, జిస్మే పహలే, దూస్రే, చౌతే మిస్రే మే రదీఫ్ ఔర్ కాఫియా హోతే హై' అన్న మాటలు సాధికారికమైనవి. అంటే ఒక రుబాయిలో ఉండవలసినవి రదీఫ్, కాఫియా అనే భౌతిక ఛందస్సు. ఇంకా మాత్రల సమత, నాలుగు పాదాలు కలిసి ఒకే అభిప్రాయాన్ని సమర్థిస్తూ నడవడం, భావ చమత్కారం అనేవి భావ ఛందస్సు అన్నమాట.

> **రదీఫ్..**
> 'శిల్పి చేతి ఉలి చతురిమ చాటుతాడు కవి
> చిత్రశిల్పి కుంచ మహిమ చెప్పుతాడు కవి
> గాయక కళ మృదు మధురిమ నాట్య విలాసం
> లలిత కళా జగతి సొగసు తెలుపుతాడు కవి'

కాఫియా..1, 2వ, 4వ పాదాలలో ఉన్న రదీఫ్‌కు ముందటి పదం కాఫియా. ఇందులో మూడు పాదాలలోని రదీఫ్‌కు మైత్రి ఉండాలి. అది స్వరమైత్రి మాత్రమే కానీ అంత్యప్రాస కాదు. తెలుగులో అంత్యప్రాస అనగానే హల్లులతో ముగిస్తే సరిపోతుందనే భావంలో ఉంటారు. కానీ, కాఫియాలో స్వరమైత్రి ముఖ్యం. అంటే ఒక కాఫియా అకారంతో ముగిస్తే మిగిలినవన్నీ అకారంతోనే ముగియవలసి ఉంటుంది. లేదా ఇకారంతో ముగిస్తే మిగిలినవి ఇకారంతోనే ముగియవలసి ఉంటుంది. లేదా ఉకారంతో ముగిస్తే మిగిలినవి ఉకారంతోనే ముగియవలసి ఉంటుంది. మధ్యయుగాల నాటి ఉర్దూ కవి సౌదా ఇలా చెప్తాడు.

> 'జబ్ నజర్ ఉస్కీ ఆన్ పడ్తీ హై
> జిందగీ తబ్ ధ్యాన్ పడ్తీ హై
> ఏక్ కే మూహ్ సే జిన్ ఘడీ నిక్లే

ఫిర్ తో సాకీ జబాన్ పడ్తీ హై' ఇందులో ఆన్ ధ్యాన్ జబాన్‌లు కాఫియాలు. వీటిలోనే నకారాంత స్వరం వీటికి బలాన్ని చేకూర్చింది. ఇలా తెలుగులో చక్కటి కాఫియాను నిర్వహిస్తూ రాసిన కవిత్వం ఏనుగు నరసింహారెడ్డి తెలంగాణ రుబాయిలలో గమనించవచ్చు.

> 'మూల చుక్కా పొడవ శుభమైతది
> అమావాస్య నిశి గూడ శుభమైతది
> బలమైన కాంక్షలే నడిపించితే
> దుర్ముహూర్తము కూడ శుభమైతది'

ఇవేకాకుండా మాత్రల సమత అనేవి కూడా రుబాయిని అలంకారమయం చేస్తాయి. ఈ విషయంలో మాత్రం తెలుగు కవులు ముందే ఉన్నారు. చాలా సందర్భాలలో రదీఫ్ కాఫియాలను పట్టించుకోకుండా రాసినప్పటికీ మాత్రల సమతను చాలా మేరకు అలవోకగా పాటించారు. ఇందుకు కారణం తెలుగువాళ్లకు గేయంతో ఉండే సాన్నిహిత్యం. కె.ప్రభాకర్ తన ప్రేరణలో ఇలా చెప్తాడు.

> 'నేను లోకము విడిచిన తరుణం
> నీకు మిగిలేది నా ప్రేమాభరణం
> నీ మనసు మంచి గంధపు చెక్క
> నీ వయసు వగరుపోని వక్క'

ఇందులో రదీఫ్, కాఫియాల సంగతి కాసేపు పక్కనపెడితే అన్ని పాదాలు సమాన మాత్రలతో నడుస్తాయి. ఇలా రాసినవాళ్లు చాలామంది తెలుగులో కనిపిస్తారు. తెలుగులో రుబాయి రాస్తూ భావ చమత్కారాన్ని రాసినవాళ్లు మాత్రం తక్కువ మందేనని చెప్పక తప్పదు. రుబాయిలను అనువాదం చేసినవాళ్లలో అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు, బూర్గుల రామకృష్ణారావు, దువ్వూరి రామిరెడ్డి, సామల సదాశివ లాంటి వారలు ఉద్ధండులైన పండిత ప్రకాండులైనప్పటికీ వారు రుబాయిల అనువాదాన్ని తెలుగు కవితా రూపాలైన పద్యాలలోనే చేయడానికి కారణం రుబాయిలు తెలుగులో ఒదగడం చాలా కష్టమనే భావంతోనే. దాశరథి తన కవితా సృజనలో ఒక భాగంగా రుబాయిల రచన చేసినప్పటికీ అది తన ప్రధాన కవితా రూపంగా ఆయన భావించలేదు. మరో అగ్ర కవి వరేణ్యులు డాక్టర్ సినారె ఈ రదీఫ్, కాఫియాలను పాటిస్తూ రుబాయి రాసి మెప్పించడం చాలా కష్టమైన పని అని ఒప్పుకొన్నారు. అందుకే, ఆ ఛందస్సును పరిమితంగా పాటిస్తూ 4 పాదాలకు ఇంకొక పాదాన్ని చేర్చి ప్రపంచపదులు అనే కొత్త కవితారూపాన్ని సృష్టించుకొని అందులో తన రచన కొనసాగించారు. ఆ రకంగా చూసినప్పుడు తెలుగులో రుబాయిల రచనకు ఆ రంగంలో నిబద్ధమైన కృషిచేసిన కవులు తప్ప మిగిలినవారు అంత సులభంగా పాఠకులకు గుర్తుండలేరు. చెప్పడం సులభమే కానీ, రాసి మెప్పించడం చాలా కఠినమైన కవితా రూపం రుబాయి.

అయితే ఇదంతా రూప చర్చ. నిజానికి రుబాయిల రూపం ఎంత జాగ్రత్తగా నిర్మించవలసి ఉంటుందో అంతకంటే ముఖ్యంగా భావచమత్కార సాధన కోసం ప్రయత్నించవలసి ఉంటుంది. ఒకరకంగా చెప్పాలంటే రూపం భౌతికం, సారం ఆత్మ. ఆత్మలేని శరీరం మనుగడలో ఉండలేనట్టే భావ చమత్కారం, మెరుపు లేకుండా రుబాయిలు లక్ష్యాన్ని సాధించలేవు. ఒక ఉర్దూ కవి అంటాడు: 'క్యా కమాతే హో జీవన్ భర్/ న కఫన్‌కు జేబ్ హై న ఖబర్ మే అల్మారాహ్' ఇది రుబాయిలో అంతర్భాగంగా వచ్చే ఒక పాదమే కావచ్చు. కానీ, అందులోని చమత్కారం భావగర్భమైంది. అలాగే అమ్జద్.. 'కహతీ హై హమేషా అఖిర్ ఏ క్యోం వో క్యోం/ ఇస్ క్యోం కా జవాబ్ క్యా హై మాలూమ్ నహీ'లోని దైవికపరమైన భావ చమత్కారం కూడా అత్యంత అరుదైన కవిత్వాభివ్యక్తి. తెలుగులో దాశరథి జ్వాలా లేఖినిలో రాసిన 'మంచివాణ్ని పిచ్చివాణ్ని చేసేదానా/ ఇష్టముండి లేనట్లుగ చూసేదానా/ ఉత్తరాలు రాయకుండా ఉడికిస్తావే/ బొటనవేలితో నేలన రాసేదానా' అన్న రుబాయిలో ఉన్న చమత్కారాన్ని చూసినప్పుడు చమత్కారం మాత్రమే, అదీ భావచమత్కారం మాత్రమే రుబాయిల ఆత్మ అని అవగతం అవుతుంది. ఇలా.. 'ఎన్ని జోలలు మదికి పాడను, తనువు ఒరిగే లోపుగా!/ కలతపెట్టే కళలు ఎన్నో, రేయి ముగిసే లోపుగా,/ ఏ క్షణానికి ఆ క్షణం, యమ యాతనే కద జీవనం/ కన్నీటి నెంతగ మింగవలెనో, కనులు తడిసే లోపుగా!' (పెన్నా శివరామకృష్ణ)




ఏనుగు నరసింహారెడ్డి
8978869183

ఆయన మధురమైన గేయాలతో కంటతడి పెట్టిస్తాడు. ప్రౌఢమైన పద్యాలతో మహా పండితులను కూడా హడలెత్తిస్తాడు. ఆయన మృదు మధురమైన ప్రసంగాలతో సభికులను కట్టిపడేస్తాడు. ఆశు కవిత్వంతో అందరినీ అలరిస్తాడు. అమోఘమైన కవితా ప్రవాహంతో ఆకర్షిస్తాడు. చిరునవ్వులు చిందిస్తూ, అలవోకగా చిత్రకవిత్వాన్ని వినిపించి అందరినీ ఆశ్చర్యపరుస్తాడు. ఆయనే అగ్రస్థాయి మహాకవుల వరుసలో నిలువదగిన ప్రౌఢకవి గణపతి రామచంద్రారావు.

చిత్ర కవిత్వంలో చిత్రాతి చిత్రాలు

తెలంగాణ సాహితీమూర్తులు



కవి గణపతిగా ప్రసిద్ధి పొందిన గణపతి రామచంద్రారావు తెలుగు, సంస్కృత భాషల్లో ఉద్దండ పండితుడు. ఆయన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో 1940, జూలై 25న యమునాబాయి-లక్ష్మీకాంతారావు దంపతులకు జన్మించారు. వీరి విద్యాభ్యాసం మెట్రిక్యులేషన్ మాత్రమే. అయినప్పటికీ శాస్త్ర జ్ఞానానికీ, పాండిత్యానికీ ఏ మాత్రం కొదవ లేదు. ఈయన సరస్వతీ పుత్రుడు. కావ్యాలు, ప్రబంధాలు, వ్యాకరణ, తర్క, ఛంద శాస్త్రాలన్నీ ఆయన నాలుకపై నాట్యమాడుతుంటాయి.

శ్రీనివాసార్థ శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం, వాసర జ్ఞాన సరస్వతీ శతకం, హృద్య పద్య కావ్య సంహిత, యమ నియమ యోగ దర్శనం, రస భూమిక, ఛందశాస్త్రం, షోడశ కర్తాకావ్య శాస్త్రం, రస సిద్ధాంతం, మధుపానం మొదలైన 25 కావ్యాలు రాశారు. వీరు భక్తి పూర్వకమైన శతక రచన ఎక్కువగా చేశారు. కేరళ, మహారాష్ట్ర ప్రాంతాల్లోని భక్తజనం వీరి పద్యాలను ఇప్పటికీ పాడుకుంటారు. 'తెలుగు నా సవిత, తెలుగు నా కవిత, తెలుగు నా మెతుకు, తెలుగు నా బతుకు' అని గర్వంగా చెప్పుకొన్న అచ్చమైన విద్వత్కవి గణపతి రామచంద్రారావు. చిత్ర కవిత్వంలో గొప్ప నైపుణ్యం కలవారు రామచంద్రారావు. వీరు నిరోష్ఠ్య పద్యాలను ఆశువుగా చెప్పడంలో ఆరితేరినవారు. నిరోష్ఠ్య పద్యం అంటే పెదవులు అంటకుండా పలికే పద్యం. ఇలాంటి చిత్ర విచిత్రమైన ప్రయోగాలతో కవిత్వం రాయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. సందర్భాన్ని బట్టి, అప్పటికప్పుడు, ఆశువుగా చిత్ర కవిత్వం చెప్పడం సామాన్యమైన విషయం కాదు. ఇంతవరకు ద్విపద ఛందస్సులో శతకాలు రాసిన కవి ఎవరూ లేరు. అలాంటి ద్విపద ఛందస్సులో 'సంతోషి మాత' శతకాన్ని వీరు రాశారు. వీరి కుమారుడు అనారోగ్యంతో నడువలేని స్థితిలో ఉన్నప్పుడు..

> 'కడలిలోని కల్లోలమునకు
> కనువిందగు ఒక గతి ఉన్నది
> కరచరణమ్ములు లేకున్నను
> గాలి మేతరికి గతి ఉన్నది
> పద్యమునకు కలిగిన ప్రతి యొక
> పాదమ్మునకు గతి ఉన్నది
> ఓ ముద్దుల కుమార! నడువగ
> నోపవు నీకే గతి ఉన్నది'

కరుణ రసార్ద్ర పూరితమైన ఈ గేయం రాసి వినిపిస్తే మహాకవి సినారె కంటతడి పెట్టుకున్నారంటే వీరి అత్యున్నత ప్రతిభా సంపత్తిని మనం అంచనా వేయవచ్చు.

ఈయన సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు. ఔరంగాబాద్‌లోని 'మరాఠవాడ ఇతిహాస పరిషత్తు'లో శాశ్వత సభ్యత్వం పొంది చరిత్ర పరిశోధన చేశారు. 1979లో శాతవాహనుల చరిత్రను అప్పటి కలెక్టర్ కోరిక మేరకు 'కరీంనగర్ మండల చరిత్ర'గా రాశారు. అనేక మంది కవి పండితులతో సాహిత్య చర్చలు చేశారు. ఎన్నో సాహిత్య సంస్థలలో అనేక కావ్య గానాలు, కావ్య సమీక్షలు చేశారు. అభినవ శ్రీకృష్ణ దేవరాయ, సర్వయుగ కవి సామ్రాట్, చతుర్విధ మహా కవితా పితామహ, బ్రహ్మర్షి, మహాకవి గణపతి, వ్యాకరణాలంకార చక్రవర్తి, వంటి బిరుదులు, విశిష్ట గౌరవ సత్కారాలు, పురస్కారాలు అందుకున్నారు.

> 'నా తెలంగాణ విజ్ఞాన
> నందనోద్యాన సూనమ్ము
> నా తెలంగాణ భూలోక
> నాకమ్ము నాదు ప్రాణమ్ము'

అని తెలంగాణ వైభవాన్ని ఎలుగెత్తి చాటిన కవి గణపతి రామచంద్రారావు 2005, అక్టోబర్ 12న పరమపదించారు.

- తిరునగరి శ్రీనివాస స్వామి
94403 69939



ప్రభంజనం

కనులు తెరువని లోకపు వాకిలిలో
వెలుతురు పరిచిన కర్మ జీవిని నేను
అంతా పిడికెడు మట్టయిన మనుషుల్ని
సారవంతం చేసిన చెమట చెలిమెను నేను
సకల ఉత్పత్తి చలనాల సవ్వడిలో..
ఊపిరిపాటై పోటెత్తుతున్నది నేనే
ఆకలిని అశాశ్వతం చేసే క్రతువులో
సమిధనై కాలుతున్న కష్టజీవినీ నేనే
నా దేహాన్ని కొలిమిని చేసి
లోహాలను పలు ఆకారాలుగా మార్చి
మానవ మనుగడకు మార్గం చూపిన
తొలి అడుగును నేను
కొండలను పిండి చేసి కొత్త దారులు వేసి
అడవులను చదును చేసి
అన్నపు రాసులుగా పేర్చి
నదుల నడకలు మార్చి నవ నాగరికతను నేర్పి
జగతి గతికి మూలమైన ప్రగతిరథ చక్రాన్ని నేను
నా జ్ఞాన చక్షువులతో
సమాజ సంక్షేమాన్ని రూపుదిద్దుతున్న
దార్శనికున్ని నేను
నీ ఆకృతి రూపశిల్పిని నేను
అణువణువు రుణపడిన ఆదిమ జంగమ నేను
చావు పుట్టుకల సయ్యాటలో
ఆది నుంచి అంతం దాకా
అడుగడుగునా అల్లుకున్న
సమస్త సేవల సారం నేనే
ఉత్పత్తికి ఊతమైన కులాల కూటమిలో
అర్ధభాగం నేనే అయినా...
అభివృద్ధి వాటాల నిష్పత్తిలో
నీ పంపకాల లెక్కలు ఎప్పుడూ
తప్పుతూనే ఉన్నాయి.
నా దింపుడు కళ్ళం ఆశ
అడుగంటుతూనే ఉన్నది.
అందుకే ఇప్పుడు
అడుక్కునే ఆపసోపాల ఆటలను ఆపి
నాది నేను లాక్కొనే వేటను ఆరంభిస్తాను
నా కంటి పాప విశాలమవుతున్నది
ఇంతకాలం ఇసిరెలు మోసిన చేతులే
ఇప్పుడు రాజదండాన్నందుకొనే
ఇకమతులతో ఏకమవుతున్నవి
ఇది ప్రభంజనం..
ఝంఝూ మారుత జన ప్రళయం




గాజోజు నాగభూషణం
9885462052

ఆమెకు వ్యక్తిత్వం పట్ల అభిరుచి. మానవత్వం పట్ల అభిరుచి. సమాజ హితవు పట్ల అభిరుచి. ఇవన్నీ ఒక పార్శ్వం అయితే భాష పట్ల, సాహిత్యం పట్ల, సాహిత్యంలోని వివిధ ప్రక్రియల పట్ల వల్లమాలిన అభిరుచి ఉండటం మరో పార్శ్వం. నిరంతర తపనతో జీవితంలో అధికభాగం సాహితీ సేవకు వినియోగిస్తూ ఇప్పటికే ఇరవై ఐదుకు పైగా పుస్తకాలను వెలువరించిన డాక్టర్ కొండపల్లి నీహారిణి 'అభిరుచి' సాహిత్య వ్యాస సంపుటితో మరో అడుగు ముందుకువేశారు. ఇందులో తీసుకున్న అంశాలన్నీ వైవిధ్య భరితంగా ఉండటం ఆమె సాహిత్యాభిరుచికి దర్పణం.

వివిధ ప్రక్రియా పత్ర సరసిజము

ఈ సాహిత్య వ్యాస వితతిలో కొండపల్లి నీహారిణి రాసిన 30 వ్యాసాలను కవిత్వం, వ్యాసావళి, పరిశోధన, కథలు, అనువాదాలు, ఆత్మకథ, నవల అనే భాగాలుగా వింగడించవచ్చు. ఈ రచయిత్రికి అన్ని ప్రక్రియల్లో ఉన్న అవగాహన, లోతైన పరిశీలన, దేనినైనా విశ్లేషించగలిగే సామర్థ్యం మనకు అడుగడుగునా కనిపిస్తాయి. దీనికి ముందుమాట రాసిన డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్ 'చలనశీల భౌతిక ప్రపంచంలో కాల పరిణామాలకు అనుగుణంగా మానవ అనుభవాలను ఏ విధంగా తనలోకి ఇంకింపజేసుకుంటూ వ్యక్తి తన స్వీయ అస్తిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నం చేస్తాడో ఆ దిశగా ప్రయాణిస్తూ సమాజంలోని వైవిధ్యాలను, భిన్నత్వాలను దర్శిస్తాడు సమీక్షకుడు' అంటూ సమీక్షకుల లక్షణాన్ని వివరిస్తారు.



ఒక పుస్తకాన్ని లోతుల్లో స్పృశించి, కవి లేదా రచయిత హృదయంలోకి పరకాయ ప్రవేశం చేసి, ఆ భావాన్ని అదే స్థాయిలో అర్థం చేసుకొని, అంత స్థాయిలో వివరించడం గొప్ప సమీక్ష అవుతుంది. 'అభిరుచి'లోని వ్యాసాలను చదివితే నీహారిణి ఎంత సునిశితంగా ఆ పుస్తకాలను అవగాహన చేసుకున్నారో, వాటిలోని మార్మికతను ఎంతగా గ్రహించారో అర్థమవుతుంది.

'ఒకనాటి బంధాలకు దూరంగా ఎంతో ప్రయాణం చేసిన మనకు స్వార్థం సహజమైపోయింది. నటించే మనుషుల మాటున అసలైన నైసర్గిక రూపం అణగారిపోయింది' అని ఆయన చెప్పినట్లుగా మళ్లీ మనం జన్మించాలంటే విత్తనంలోకి వెళ్లి రాక తప్పదంటారు నీహారిణి. ఎక్కడ ఆగిపోయిందో అక్కడే ఆరంభించాలన్న సామాజిక వాస్తవాన్ని తెలుపుతారు.

'ఎయిలు వారంగ లేచింది మొదలు/ నడిరాత్రి పడుకునే దాకా/ పొక్కిలైన నేలకు/ అలుకు పిడుచయ్యేది నాయనమ్మ' అన్న కందుకూరి శ్రీరాములు వాక్యాలను ఉటంకిస్తూ ఆనాటి పల్లె జీవితాన్ని ప్రత్యక్షం చేయిస్తారామె.

'అన్నిటికన్నా సులభం ఆశపడడం/ అన్నిటికన్నా కఠినం ఆశయ సాధనం/ అపజయానికి దారులు శతకోటి/ విజయ శిఖరానికి రాదారి ఒక్కటే' వి.ఎస్.పి.తెన్నేటి వాక్యాలను ఉదాహరిస్తూ.. 'తన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబించడమే కవి ఉద్దేశం అయినప్పుడు, కవి Abstract perceptionతో కవిత్వం రాస్తున్నప్పుడు ఔషధ ప్రాయమైన కవిత్వాన్ని రాస్తాడు' అని చెప్పడం కవిత్వం పట్ల ఆమెకున్న సుస్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడిస్తుంది.

'కాలాన్ని గెలుస్తూ' కవితా సంకలనంలో... 'వాళ్లు అందరిలా చూడలేరు/ అందరి అంతరంగాలను చదవగలరు... నా దేశం నిస్సందేహంగా/సభ్య ప్రపంచం మునివాకిట్లో వికలాంగ దేశమే' వంటి కవితా పంక్తులు దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు కృషి చేయాల్సిన బాధ్యత గురించిన హెచ్చరిక, వారి పట్ల ఆవేదనను తెలుపుతాయి.

'అయ్యయ్యో దమ్మక్కా!' అనేది జూపాక సుభద్ర రచించిన కవితా సంపుటి. ఈ పదం తెలంగాణలో ఒక ఆటకు సంబంధించినదని ఎవరికీ తెలియదు. వృత్తాకారంలో కూర్చున్న పిల్లల్లో ఒకరు ఒక కథ చెబుతూ గుండ్రంగా తిరుగుతారు. అయిపోయిన వెంటనే మిగతా పిల్లలు 'అయ్యయ్యో దమ్మక్కా!' అని ఛాతీ మీద చేతులతో కొట్టుకుంటారు. తర్వాత మరొకరు కథ చెబుతారు. ఆనాడు స్త్రీల కడగండ్లను తెలిపే ఆట ఇది. ఇటువంటి ప్రత్యేక విషయాలనెన్నిటినో 'అభిరుచి'లో వివరిస్తారు నీహారిణి. నీహారిణి దృష్టిలో కవిత్వమంటే చిక్కని దట్టమైన అడవిలా ఉండాలి. అంతులేని ఆకాశంలో పారుతున్న నదిలా జవ జీవాలందించాలి.

వాణీ దేవులపల్లి రచించిన 'అస్తిత్వ పరిమళాలు' వ్యాస సంపుటిలో స్త్రీల ఉనికిని తెలిపే 13 వ్యాసాలను విశ్లేషిస్తారు నీహారిణి. ప్రాస్తావికంగా ఇక్కడ మహిళామణి రూప్ ఖాన్ పేట రత్నమాంబ రాసిన 'తరుణీ కృత... జ్ఞానము గలదే' అనే పద్యాన్ని ఉటంకిస్తూ రత్నమాంబని ఆధునిక కాలానికి తొలి కవయిత్రిగా ఉద్ఘాటించవచ్చని చెప్పడం స్త్రీల రచనల పట్ల నీహారిణి లోతైన దృష్టికి తార్కాణం. స్త్రీలకు ఎంత జ్ఞానం ఉన్నా వారిని తక్కువగా చూసే సమాజంలో ఇంకా స్త్రీలు బతుకుతున్నందుకు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తారు. మార్పు వస్తుందన్న ఆశావహ దృక్పథాన్ని వెలిబుచ్చుతారు.

> **'సాహిత్య విమర్శను చదివితే ఏం తెలుస్తుంది?' అని ప్రశ్నిస్తూనే 'తరతరాల సాహిత్య చరిత్ర తెలుస్తుంది. ఆనాటి సమాజ పరిస్థితులు, వర్గ వైషమ్యాలు, సఖ్యతలు, వైశాల్యాలు తెలుస్తాయి' అంటూ సాహితీ విమర్శ ప్రయోజనాన్ని కూడా చెప్తారు నీహారిణి.**

'అభిరుచి' వ్యాస సంపుటి ఆసాంతం వదలకుండా చదివించగలిగే రీతిలో కొనసాగుతుంది. ప్రతీ ప్రక్రియను రచయిత్రి అంతర్గత నేత్రంతో దర్శించారు. భాష, భావ ప్రకటన, వాక్య నిర్మాణశైలి, నిశిత పరిశీలన, లోతైన విమర్శ ఆమె రచనకు వన్నె తెచ్చాయి. పైకి సున్నితంగా కనిపించినా సమాజంలోని దురన్యాయాలకు ఆమె హృదయం బడబానలమై ఎగసి, దాని నుంచి ఆమె కలం పదును దేరి కత్తిలా మారి అక్షరాలను ఝుళిపిస్తుంది.



ధూళిపాళ అరుణ
8712342323

సొంత రక్తంలో పరాయితనం

మర్రికి ఉన్న ఊడలు
మనిషికి ఉన్న బంధాలు
నేలరాలినప్పుడు
క్షణికాలు
అయినా ఎందుకో
మానవత్వం
మంట కలుస్తోంది
అనుబంధాలు
అడుగంటుతున్నాయి
ప్రేమ బంధాలు
పతనమవుతున్నాయి
సొంత రక్తంలో
పరాయితనం
ఏరులై ప్రవహిస్తుంటే
దగ్గరైతున్న బంధాలు
చెల్లాచెదురై పోతున్నాయి
సుడిగుండాల వలయంలో
చిక్కుకుని తల్లడిల్లుతున్నాయి
తనయులు తల్లిదండ్రులు
సోదర సోదరీమణులు
ఎవరికివారే వేరు వేరే!



జాదవ్ పుండలిక్ రావు పాటిల్

పుస్తకావిష్కరణ

2025, డిసెంబర్ 28వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు వీపీ చందన్ రావు, కందాళై రాఘవాచార్య జంట కవులు రాసిన 'రెండు ఒకట్లు' కవితా సంపుటిని నందిని సిధారెడ్డి ఆవిష్కరిస్తారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే ఈ సభకు ఏనుగు నరసింహారెడ్డి, తదితరులు హాజరవుతారు.

- కందుకూరి శ్రీరాములు

ఒక ఆకుపచ్చకల

హైదరాబాద్ బుక్ ఫెయిర్, తెలంగాణ కళాభారతి వేదికగా 2025 డిసెంబర్ 23న డాక్టర్ కాసుల లింగారెడ్డి రచించిన 'ఒక ఆకుపచ్చకల' ఆవిష్కరణ జరుగనున్నది. కాసుల ప్రతాప రెడ్డి అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి శ్రీధర్ గాజుల, కె.శ్రీనివాస్, విమల మోర్తల, వి.ఆర్.తుమలూరి తదితరులు హాజరవుతారు.

- కవి సంగమం



ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సమావేశంలో ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేస్తున్న కేసీఆర్, చిత్రంలో శాసనమండలి విపక్షనేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్‌నేతలు

కదనరంగంలోకి కేసీఆర్!

ఏపీ జలదోపిడీ, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల కుమ్మక్కుపై జంగ్‌సైరన్

- గ్రామాలు, మండలకేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టాలని పిలుపు
- పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో సభల ఏర్పాటుకు సూచన
- త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు
- 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన 'భూపాలుడు.. భేతాళుడు' ప్రత్యేక కథనంపై నేతల వద్ద ప్రస్తావన
- బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ వెల్లడి
- ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల అభిప్రాయాల విస్తృత సేకరణ



తెలంగాణ భవన్ వద్దకు అశేషంగా చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు ఆత్మీయంగా అభివాదం చేస్తున్న కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : ఏపీ సర్కారు చేస్తున్న నదీ జలాల దోపిడీని ఎదిరించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్వయంగా కదనరంగంలోకి దిగారు. ఏపీ జలదోపిడీ, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల సహకారంపై జంగ్ సైరన్ మోగించారు. ఉద్యమ కార్యాచరణ రూపకల్పనపై లోతుగా చర్చించేందుకు బీఆర్ఎస్ఎల్పీ, పార్లమెంటరీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులతో ఆదివారం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయం, వివిధ సందర్భాల్లో తాను అప్పటి ప్రభుత్వాలపై ఎదిరించిన తీరు, చివరికి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, తెలంగాణ సాధన, అనంతరం బీఆర్ఎస్ హయాంలో పదేండ్ల సమ్మిళిత అభివృద్ధిని పార్టీ శ్రేణులకు కేసీఆర్ గుర్తుచేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో తెలంగాణకు అన్ని అంశాల్లో అన్యాయం జరుగుతున్నది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వాపస్ పంపితే.. కాంగ్రెస్ సర్కార్ మౌనంగా ఉన్నది? నదీ జలాల కోసం ఢిల్లీకి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలి. కానీ, ఎవరూ పట్టించుకోకపోవడం, కాంగ్రెస్ ఎంపీలు, బీజేపీలు ఎంపీలు అడ్డుకోకపోవడంతో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం చూసి సహించలేక తాను బయటకు రావాల్సి వచ్చిందని కేసీఆర్ చెప్పినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వానికి రెండేండ్ల పాటు సమయం ఇచ్చి మౌనంగా ఉన్నానని, ఇప్పటివరకు ఒక లెక్క.. ఇకనుంచి ఒక లెక్క.. చుక్కనీటిని కూడా వదులుకోబోమని ఘాటుగా కేసీఆర్ హెచ్చరించినట్టు సమాచారం.

రెండేండ్లలో రూపాయి కేటాయించలేదు

రాష్ట్రాన్ని 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్, 20 ఏండ్ల పాలించిన తెలుగుదేశం పార్టీలు తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం చేశాయని, తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదు.. తెలంగాణ వెనక్కి నెట్టివేయబడ్డ ప్రాంతమని కేసీఆర్ గుర్తుచేసినట్టు తెలిసింది. 'పాలమూరు జిల్లాకు ఈ రెండు ప్రభుత్వాలు తీరని ద్రోహం చేశాయి. జిల్లా ప్రజలు ముంబైకి వలసలు వెళ్లేలా, గంజికేంద్రాలు నిర్వహించేలా చేశాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు తెలంగాణకు పెనుశాపంగా పరిణమించింది. ఉమ్మడి ఏపీలో అత్యంత వివక్షకు గురైన జిల్లా మహబూబ్‌నగర్. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 6.5 లక్షల ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకొచ్చాం. నాడు ఇప్పుడు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 170 టీఎంసీలు ప్రతిపాదిస్తే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు 45 టీఎంసీలు కాంగ్రెస్ చాలంటున్నది. 90శాతం పనులు పూర్తయిన ఈ ప్రాజెక్టుకు రెండేండ్లలో కాంగ్రెస్ సర్కారు రూపాయి కూడా కేటాయించలేదు. ఫలితంగా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు తీరని అన్యాయం చేసింది. కాంగ్రెస్ అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని కేసీఆర్ పిలుపునిచ్చినట్టు తెలిసింది.

మూడు జిల్లాల్లో సభలు పెడుదాం

కాంగ్రెస్ సర్కారు చర్యలతో అన్యాయానికి గురవుతున్న పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో సభలు పెట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించినట్టు తెలిసింది. 'మూడు జిల్లాల రైతాంగానికి, తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయన్ని గడపగడపకు తీసుకెళ్లాలి. గ్రామాల వారీగా నిరాహార దీక్షలు, నిరసన దీక్షలు చేపట్టాలి. మండలాలు, డివిజన్ కేంద్రాల్లోనూ నిరసనలు, ఆందోళనలు చేపట్టాలి. ఇందుకుగాను తొలుత కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ముద్రించండి. కొన్ని ప్రత్యేక పాటలు సిద్ధం చేయండి. ఆ పాటల సీడీలు అతి త్వరలోనే బయటకు రావాలి. సోషల్ మీడియాలో వైరల్ కావాలి. సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సోషల్ మీడియాలో చర్చ జరగాలి. నియోజకవర్గాలవారీగా రిటైర్డ్ అధికారులు డిబేట్లు పెట్టాలి. ఆ తర్వాత మూడు జిల్లాల్లో వేర్వేరుగా సభలు నిర్వహించాలి. జిల్లాలోని ప్రజలందరూ వచ్చేలా సెంటర్ పాయింట్‌ను గుర్తించండి. త్వరలోనే ఆయా జిల్లాల నేతలతో మరోసారి చర్చించి భారీ బహిరంగ సభలు త్వరలోనే పెట్టుకుందాం. నేనే స్వయంగా వచ్చి సభలో మాట్లాడుతా. ఏపీ జల దోపిడీకి రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు, కేంద్రంలోని మోదీ సర్కారు ఎలా సహకరిస్తున్నాయో ప్రజలకు వివరిద్దాం. తెలంగాణపై మనకు తప్ప ఇతరులు ఎవరికీ ఆర్తి, ఆరాటం లేదు' అని అధినేత కేసీఆర్ చెప్పినట్టు సమాచారం.

'నమస్తే తెలంగాణ' భూపాలుడి కథనంపై చర్చ

'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'భూపాలుడు.. భేతాళుడు' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని సమావేశంలో అధినేత కేసీఆర్ ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిసింది. ప్రత్యేక కథనం అద్భుతంగా ఉన్నదని కొనియాడినట్టు సమాచారం. 'మన ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని పాయింట్ల వారీగా చాలా బాగా రాశారు.. మీరు కథనం చదివారా?' అని కేసీఆర్ అడిగినట్టు తెలిసింది. కథనంలో పేర్కొన్నట్టుగా మనకు తెలంగాణ మట్టిపై ఆరాధన, రైతుపై అవ్యాజ్యమైన ప్రేమ ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూములు అమ్ముకోడమే లక్ష్యంగా పాలసీలను రూపొందిస్తుందని కేసీఆర్ చెప్పినట్టు తెలిసింది.

45 నిమిషాలపాటు అభిప్రాయ సేకరణ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, సర్పంచ్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ పార్లమెంటరీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గంతో సమావేశమైన కేసీఆర్.. వారి నుంచి వివిధ అంశాలపై సుదీర్ఘంగా అభిప్రాయ సేకరణ చేసినట్టు తెలిసింది. సుమారు మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో సుమారు గంట పాటు ప్రతి ఒక్కరి నుంచి సభ్యత్వ నమోదు క్యాంపెయిన్, నదీ జల్లాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం చేపట్టబోయే కార్యాచరణ ఎలా ఉండాలి? అనే అంశాలపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల అభిప్రాయాలు తెలుసుకున్నట్టు సమాచారం. సభలు, నిరసనలు, ఆందోళనలు, పాటలు, కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు ఏమనుకుంటున్నారనే అంశాలను అధినేత దృష్టికి నేతలు తీసుకొచ్చినట్టు తెలిసింది.

త్వరలోనే సభ్యత్వ నమోదు

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని సమావేశంలో అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు తెలిసింది. ఇది డిజిటల్ యుగం కాబట్టి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రెండు రకాలుగా సభ్యత్వాలు ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌పై అభిప్రాయాలు చెప్పాలని కేసీఆర్ కోరినట్టు తెలిసింది. సుమారు 45 నిమిషాలపాటు సభ్యత్వ నమోదుతోపాటు ఇతర అంశాలను కూడా నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. సాధారణ సభ్యత్వం, క్రియాశీలక, శాశ్వత సభ్యత్వం ఉండాలని కొందరు అభిప్రాయపడినట్టు సమాచారం. గతంలో మాదిరిగా సాధారణ సభ్యత్వానికి రూ.50, క్రియాశీలా సభ్యత్వానికి రూ.100 రుసుము విధించాలని సూచించినట్టు తెలిసింది. 'సభ్యులుగా చేరినవారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు పార్టీ నేతలతో లైవ్ కాంటాక్ట్‌లో ఉండేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఆలోచించాలి. ప్రస్తుతం ఎమ్మెల్యే కేంద్రంగా రాజకీయాలు నడుస్తున్నందున గ్రామ, మండల, కమిటీల మీటింగ్ పెడితే అందరూ యాక్టివ్ అవుతారు' అని పలువురు అభిప్రాయాలు చెప్పినట్టు తెలిసింది.

ఎవరి పేరెత్తకుండా కేసీఆర్ చెడుగుడు

- గంటన్నరపాటు గంభీరంగా మీడియా సమావేశం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనా వైఫల్యాలపై మాటల తూటాలు
- 'విఫల నేత' పేరే ప్రస్తావించని వైనం
- తేలిపోయిన కాంగ్రెస్ బూతు కూతలు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన పార్టీ అధినేత కేసీఆర్ ఎవరి పేరూ ఎత్తకుండానే చెడుగుడు ఆడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనా వైఫల్యాలను ఎండగట్టారు. కృష్ణాజలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాటను, రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను కేసీఆర్ చీల్చి చెండాడారు. ఈ సందర్భంగా ఆయన ఒక్క పొల్లు మాట లేకుండా ప్రతి పదాన్నీ తూటాగా మలిచి పాలక వర్గాలపైనే సంధించారు. తెలంగాణ ప్రజలకు ఏది అవసరమో అదే అంశంపై దృష్టి కేంద్రీకరించి స్పష్టంగా మాట్లాడారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఒక్క ఇంచు అటు, ఒక్క ఇంచు ఇటు కానీ పక్కకు జరుగకుండా పక్కాగా తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. ఝూటా మాటలకు ఓటు చేజార్చుకున్న ప్రజలను ఓదార్చేటట్టే ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రజలను ఏమార్చినంత సులువుగా పాలన చేయడం చేతిగాని విఫల నేత పేరు కూడా ప్రస్తావించడానికి కేసీఆర్ ఇష్టపడలేదు. ఇంతకాలం నోరు తెరిస్తే చావు శకునాలు, నెత్తుటి కూతలు కూసిన బేతాళ మాటలను కేసీఆర్ తన గంభీరమైన స్వభావంతోనే సమాధానం చెప్పారు. పరిణతితో కూడిన కేసీఆర్ ప్రసంగం ముందు రెండేండ్ల బూతు కూతలు తేలిపోయాయి. ఇరువురి మాట తీరును ప్రజలు, రాజకీయ పరిశీలకులు పోల్చి చూశారు. 'ఎంతైనా ఏనుగు ఏనుగే.. శుష్క అరుపులు శుష్క అరుపులే' అని ప్రజలు నిర్ధారణకు వచ్చారు.

బాస్ ఈజ్ బ్యాక్.... గులాబీ శ్రేణుల్లో జోష్

కేసీఆర్ అంటే తెలంగాణ ప్రజల సంపద

- ఒక్కనీటి బొట్టును కూడా కోల్పోనివ్వడు
- తెలంగాణ సింహం గర్జించింది కాచుకోండి
- కాంగ్రెస్ అరాచక పాలనకు చరమగీతమే
- ఉద్యమ పిలుపుతో గులాబీ శ్రేణుల్లో జోష్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు ఒక లెక్క.. రేపట్నుంచి ఇంకో లెక్క అంటూ.. ఐ యామ్ ఆన్ ది ఫీల్డ్ అంటూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుబావుటా ఎగురవేయడంతో గులాబీ శ్రేణుల్లో ఫుల్ జోష్ కనిపిస్తున్నది. తెలంగాణకు కేంద్రం చేస్తున్న అన్యాయం, చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మేము సైతం యుద్ధానికి సిద్ధమంటూ తేల్చిచెప్తున్నారు. కేసీఆర్ ప్రెస్‌మీట్‌కు విశేష స్పందన కనిపిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు సంఘీభావం తెలుపుతున్నారు. రాష్ట్రంలో రెండేండ్లుగా కాంగ్రెస్ ప్రజాకంటక, నయవంచక పాలన సాగిస్తున్నదని, ఇప్పుడు హక్కుల కోసం, హామీల అమలు కోసం పోరాటం ఉధృతం చేయాల్సిందేనని తేల్చిచెప్తున్నారు. తెలంగాణ నీటి వాటాలో ఒక్క చుక్కను కూడా కోల్పోకుండా కేసీఆర్ పోరాటానికి శ్రీకారం చుడుతారని తెలిపారు. ప్రజలు కేసీఆర్ ప్రెస్‌మీట్‌ను ఆద్యంతం వీక్షించారు. టీవీ న్యూస్ చానెల్స్, యూట్యూబ్ చానెల్స్‌కు అతుక్కుపోయారు. సాయంత్రం ఆరు గంటలకు కేసీఆర్ ప్రెస్‌మీట్ అని బీఆర్ఎస్ వర్గాలు ముందే చెప్పిన నేపథ్యంలో.. కేసీఆర్ ఏం చెప్తారా అనే ఉత్కంఠతో ప్రజలు ఆసక్తిగా ఎదురుచూశారు. మళ్లీ జలపోరాటానికి సిద్ధమంటూ కేసీఆర్ ఫుల్ జోష్‌తో ఇచ్చిన సందేశం శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది.

'సోషల్' వారియర్స్ సమరోత్సాహం

ప్రత్యర్థుల అసత్య ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టే బీఆర్ఎస్ సోషల్‌మీడియా వారియర్స్ కేసీఆర్ పోరు పిలుపు నేపథ్యంలో సమరోత్సాహం కనబర్చారు. కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్‌తో కలిసి పోరుబాటకు సిద్ధం కావాలనే సందేశాన్ని ప్రజలకు విస్తృతంగా వ్యాప్తి చేశారు. కాంగ్రెస్ నమ్మకద్రోహంతో రెండేండ్లుగా అరిగోస పడుతున్న తెలంగాణ ప్రజల కన్నీరు తుడిచేందుకు కేసీఆర్ కార్యాచరణ రూపొందించిన తీరును వివిధ వేదికలపై వివరించారు. పాలన విస్మరించి, కాలయాపన చేస్తున్న సీఎంకు నిద్రపట్టని రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. తెలంగాణ సింహం గర్జించింది.. ఇక కాచుకోండి అంటూ తేల్చిచెప్పారు. కేసీఆర్ స్పీచ్ మొత్తంలో ప్రజల కోసం ఆయన పడే తపన కనిపించిందని, ఇది కదా కేసీఆర్ అంటే, కేసీఆర్ ప్రజల సంపద అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. గంట వ్యవధిలోనే ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలపై గులాబీ దళం కదన కవాతు కనిపించింది. పెద్దసారు నవ్వు.. అవతల పార్టీ వాళ్లకు గుబులు.. సింహం అడుగు బయటపెట్టింది.. అన్నిటికి సిద్ధం అని గర్జించింది అంటూ బీఆర్ఎస్ అభిమాను, తెలంగాణవాదులు పేర్కొన్నారు.


బయటికి వచ్చిన బెబ్బులి

- తెలంగాణ హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోనని స్పష్టీకరణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సవాల్
- పాలమూరు-రంగారెడ్డిని పూర్తిచేయలేదని కేసీఆర్ ఫైర్

వరంగల్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారం పోయిందనే ఆత్రుత లేకుండా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని గౌరవించాలనే సమగ్ర వివేచన, సమున్నత వ్యక్తిత్వంతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటిదాకా వ్యవహరించారు. అవతలి పక్షం ఎన్ని పిల్లిమొగ్గలేసినా, ఎన్ని పిల్లచేష్టలు చేసినా తెలంగాణ ఇంటి పెద్ద పాత్రను పోషించారు. కాంగ్రెస్ సర్కార్‌కు కావలసినంత సమయం ఇచ్చారు. ఐదేండ్ల టర్మ్‌కు రెండేండ్లు తక్కువకాలమేమీ కాదు. ఈ రెండేండ్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ శాశ్వత ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకున్నది. ఫలితంగా పాలమూరుపై మళ్లీ వలస డేరా పడబోతున్నదనే సంకేతాలు, తెలంగాణ నీటివాటాను గద్దల్లా తన్నుకుపోవాలనే కుట్రలు జరుగుతున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నదనే గ్రహింపు కేసీఆర్ ధర్మాగ్రహానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే స్వరాష్ట్ర సాకార ఫలితం ఎండమావే అవుతుందని గ్రహించి మళ్లీ బెబ్బులిలా రంగంమీదికి వచ్చారు. ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ తిరిగి ఉద్యమయోధుడిగా తనదైన శైలిలో సింహమై గర్జించారు. 'ఇది నా రాష్ట్రం- వీళ్లు నా ప్రజలు, నా నేలకు అన్యాయం జరిగినా.. నా ప్రజలకు అపద వచ్చినా నేను చూస్తూ ఊరుకోను.. సహించను' అని కేసీఆర్ మరోసారి వార్నింగ్ ఇచ్చారు. కృష్ణమ్మ పరుగులకు నురుగుల హారం కట్టాలని ప్రతినబూనారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ మెడలు వంచి దేవాదులకు శంకుస్థాపన చేయించడం, కదనభేరీ మోగించి కర్ణాటక బకాయిని చెల్లించేలా చేయడం, జూరాల కాలువల నిర్మాణం చేపట్టేలా చేయడం తదితర అంశాలపై నాడు ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఏ పాత్ర పోషించారో.. ఇప్పుడు అదే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చేందుకు నడుం కట్టారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలకు పూనుకోకపోతే వెల్లువెత్తే ప్రజా ఉద్యమ ధాటికి తునాతునకలు కావలసిందేననే రీతిలో సమరనాదం చేశారు. 90% పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయకుండా, రెండేండ్లుగా తట్టెడు మట్టి తీయకుండా తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ అసలు నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

జననేత రాకకు పోటెత్తిన అభిమానం

- జనసంద్రమైన తెలంగాణ భవన్
- ప్రియతమ నేతను చూసేందుకు వేలాదిగా తరలిన గులాబీ సైన్యం
- జై కేసీఆర్.., సీఎం..సీఎం నినాదాలతో మార్మోగిన తెలంగాణ భవన్ ప్రాంగణం
- పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించిన పార్టీ ప్రముఖులు



తెలంగాణ భవన్ లోపలికి వెళ్తూ నేతలు, శ్రేణులకు అభివాదం చేస్తున్న కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తేతెలంగాణ) : జనాభిమానం పోటెత్తింది, తెలంగాణ భవన్ జనసంద్రమైంది. పెద్దసంఖ్యలో కదలివచ్చిన గులాబీదండుతో హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం కళకళలాడింది. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నారని తెలుసుకుని వేలాదిగా తరలిరావడం, అభిమాన నేతను చూసిన సబ్బండ జనం సంబురంతో కార్యాలయ ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొన్నది. తరలివచ్చిన యువత ఉత్సాహం, మహిళా లోకం హారతుల స్వాగతంతో కారణజన్ముడైన కేసీఆర్‌పై అభిమానం ఏ మాత్రం చెక్కుచెదరలేదని మరోమారు నిరూపితమైంది.

దారివెంట దండుగా కదిలిన శ్రేణులు

ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు కేసీఆర్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం నుంచి తెలంగాణ భవన్‌కు బయల్దేరారు. వందలాది మంది నాయకులు, అభిమానులు వాహనాల్లో ఆయనను అనుసరించగా, జనహృదయనేతను చూసేందుకు దారిపొడవునా పెద్దసంఖ్యలో ప్రజలు బారులు తీరారు. పెద్దసంఖ్యలో అభిమానులు చేతులూపుతూ వెంట నడువగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కారు దిగిన అభిమాన నాయకుడిని చూసేందుకు, చేయి కలిపేందుకు, పలుకరించాలని జనం పోటీపడ్డారు. కేసీఆర్ తెలంగాణభవన్‌లోకి వెళ్తండగా ముందుకు ఉరికారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకొని మురిసిపోతూ 'జై కేసీఆర్.. సీఎం..సీఎం..' అంటూ నినాదాలు చేయడంతో కార్యాలయ పరిసరాలన్నీ హోరెత్తాయి. కాగా, పార్టీ ప్రముఖులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేసీఆర్‌కు ఎదురేగి స్వాగతం పలుకగా, మహిళా నేతలు హారతులు ఇచ్చారు.

గులాబీమయమైన తెలంగాణభవన్

కేసీఆర్ రాకను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత తోరణాలతో తెలంగాణభవన్ గులాబీమయమైంది. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి సుమారు 10వేల మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు తరలిరావడంతో సందడి కనిపించింది. కేసీఆర్ తెలంగాణభవన్‌కు చేరుకోగానే జై తెలంగాణ నినాదాలతో హోరెత్తింది. కార్యాలయ ప్రాంగణం, రోడ్లపై పెద్దసంఖ్యలో కార్లు, ద్విచక్రవాహనాలు నిలిపి ఉండటం కనిపించింది. కాగా, పలువురు అభిమానులు కేసీఆర్ ముఖచిత్రంతో ఉన్న మాస్కులు ధరించి సందడి చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెక్కులు అందజేశారు. ఆదివారం నందినగర్‌లోని నివాసంలో ఉప్పల్ పరిధిలో ఎంబీబీఎస్ చదివే పేద విద్యార్థుల చదువుకు అయ్యే ఫీజుల కోసం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ చేతుల మీదుగా సాయం అందజేశారు. 15 మంది విద్యార్థులకు చెక్కులు ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అజ్మీర్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఏటా పార్టీ తరఫున చాదర్ సమర్పించినట్టుగానే ఆదివారం తెలంగాణ భవన్‌లో మైనారిటీ నేతలకు కేసీఆర్ చాదర్ అందజేశారు.

ఎంవోయూలు ఉత్త బోగస్

హైప్ క్రియేషన్‌కు చంద్రబాబు ఆద్యుడు ● మోసాలతో ప్రజలను ఎంతకాలం వంచిస్తరు?

పెట్టుబడులన్నీ నిజమే అయితే ఆంధ్రప్రదేశ్‌కి రూ.20 లక్షల కోట్లు వచ్చే ఉండాలె

మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎంవోయూలన్నీ ఒట్టి గ్యాస్ అని ఆ రాష్ట్ర మంత్రే నాతో చెప్పారు

- బెస్ట్ పాలసీ ఉంటే పెట్టుబడులు అవే వస్తయ్
- మా హయాంలో భూముల ధరలు పెరిగితే నేడు కుప్పకూలిపోయినయ్
- బిడ్డ పెండ్లికి ఎకరం కూడా అమ్ముకోలేక రైతులు కండ్ల నీరు పెట్టుకుంటున్నరు
- మీడియా సమావేశంలో కేసీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్న ఎంవోయూలు, పెట్టుబడులన్నీ ఉత్త బోగస్ అని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఇందుకు చంద్రబాబు కథే నిదర్శనమని ఉదహరించారు. స్టార్ హోటళ్లలో ఉండే వంట మనుషులు, సప్లయ్ చేసేటోళ్లతో సంతకాలు పెట్టించి, ఎంవోయూలు కుదిరి టనట్టు గప్పాలు కొట్టారని తూర్పారబట్టారు. గతంలో చంద్రబాబు చెప్పుకున్న ఎంవోయూలన్నీ సక్సెస్ అయ్యి ఉంటే ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి ఉండేవని చెప్పారు. ఇప్పుడు కూడా రాష్ట్రంలో అదే కథ నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. ఆదివారం కేసీఆర్ తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఆటోమెటిక్‌గా పెట్టుబడులు వస్తయ్

రాష్ట్రంలో మొన్న రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినయట. నేను పేపర్‌లో చూసిన. ఈ మోసాలు చేసి ప్రజలను ఎంతకాలం వంచిస్తరు? రియల్‌గా కాంక్రీట్ టర్మ్స్‌లో రావాలె. కృషి చేస్తే నిజంగనే తన్లాడాల. మా గవర్నమెంటు వచ్చిన్నాడు హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ.57 వేల కోట్లు ఉండె. దాన్ని రూ.2.47 లక్షల కోట్ల వరకు తీసుకుపోయినం. స్టెప్ బై స్టెప్ చేసుకుంటు పోయినం. గాల్లో మాటలు చెప్తే వస్తయా? బెస్ట్ పాలసీ తెస్తే ఆటోమెటిక్‌గనే అట్రాక్ట్ అయి వస్తరు. అప్పుడు ఒకాయన ఉండే.. ఆయన చీఫ్ సెక్రటరీ అయి రిటైర్ అయిండు. మాధవరావు అల్లుడు ప్రదీప్‌చంద్ర. ఆయనకు పాలసీ చేయాలని చెప్తే.. చాలా దేశాల నుంచి తెప్పిచ్చిండు. 50సార్లు చెక్ చేసిన. ఇట్లకాదు.. నాకు కాంక్రీట్‌గ కావాలి. ఇంకా మంచిగ కావాలి అన్న. చాలా కష్టపడి చేసిండు. ఐ మస్ట్ అప్రిషియేట్ హిమ్. ది బెస్ట్ పాలసీ వాజ్ బ్రాట్ హిమ్. తరువాత ఎట్లా ఉంటదంటే.. ఒక కంపెనీవాడు వచ్చిండు. ఫాక్స్‌కాన్ అని చాలా పెద్ద కంపెనీ వచ్చింది. దాన్ని మహారాష్ట్రవాడు కొట్టకపోయిండు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు తయారుచేసే కంపెనీ. చాలామంది మహిళలకు ఎంప్లాయ్‌మెంటు దొరుకుతది దాంట్లో. మస్తు తన్లాడినం. ఆల్‌మోస్ట్ 90% వచ్చిండు. మీ పాలసీ బాగుంది అని అప్రిషియేట్ చేసిండు.. యాళ్లకొస్తే.. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.3,000 కోట్ల నగదు ఇన్సెంటివ్ ఇస్తమని కొట్టకపోయిన్రు. రూ.3,000 కోట్లు ఎదురిస్తమని తీసుకుపోయారు. అప్పుడు మనకంత కెపాసిటీ లేకుండె.. సరే. కాంపిటీషన్‌లో రియల్‌గా ట్రై చేస్తే కొన్ని జరుగుతయ్.. కొన్ని జరగవు. రియల్ ఎఫర్ట్ చేస్తే కొంత జరిగే ఆస్కారం ఉంటది. వెల్‌స్పన్ గానీ, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో కైటెక్స్ గానీ.. చాలా కంపెనీలను తన్లాడి.. తిప్పలబడి తెచ్చినం. వట్టిగ హైప్ క్రియేట్ చేసి, మందిని మోసం చేసి, ఇది ఆత్మవంచన. ప్రజావంచన. ఏమన్న వస్తాదా.. ఏమీ రాదు. గ్యాస్‌లో ప్రజలనుబెట్టడం తప్ప.

> పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడం. ఈ ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా నిద్రపోనివ్వం. మా హక్కుల పరిరక్షణలో ఒక్క డ్రాప్ తక్కువైనా.. ఎట్ ఎనీ కాస్ట్.. ఎట్ వాట్ ఎవర్ కాస్ట్.. టీఆర్ఎస్, బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం. తెలంగాణ ప్రజలకు ఒక నొక్కు పడుతుంటే మౌనం పాటించలేం. -కేసీఆర్

కేసీఆర్ చచ్చిపోవాలట.. ఇది కరెక్టయితదా..?

ఇక నన్ను తిట్టడానికైతే వాళ్ల నోటికి మొక్కాల. ఎప్పుడో ఒక సందర్భంలో.. కోపమొచ్చి ఒక మాట తిట్టినమంటే అది వేరు. పొద్దాక అదే కథనా? కేసీఆర్ చచ్చిపోవాల. మాట్లాడినప్పుడల్ల ఇదేనా? ఎక్కడ మాట్లాడినా.. ఏ సందర్భంలో మాట్లాడినా.. కాలేజీలో మాట్లాడినా, స్కూలు పిల్లలకాడ మాట్లాడినా.. ఇంత అక్కసు ఉంటాదా మనుషులకి? అది కరెక్టయితదా? ఇష్టమొచ్చిన పద్ధతిలో మాటలు. ఇష్టమొచ్చిన దుర్మార్గపు ప్రచారాలు. అన్నీ పచ్చి అబద్ధాలు నోరు తెరిస్తే. రియాలిటీ వేరుంది.. జరుగుతున్నది వేరుంది. అన్నీ రికార్డ్ అవుతున్నయి ప్రజల్లో. అన్నీ గమనిస్తున్నరు.

రిజిస్ట్రేషన్ చార్జీలు రూపాయి పెంచలే...

మహిళలకు ఇస్తామన్న రూ.2,500లే దిక్కులేదు. కోటిమందిని కోటీశ్వరులను చేస్తరట. మంత్రులంత ఒక్కటే పాటపాడుడు. ఎట్ల చేస్తవయ్యా.. కోటిమంది మహిళలను కోటీశ్వరులను? నీ దగ్గర ఉంటెనా? ఉన్న రెవెన్యూయే పీకింది రాష్ట్రానిది. లోపటికైపోయింది. మేమున్నప్పటి గ్రోత్‌లో 50% లేదు. మీకు గ్రోత్ గురించి అవగాహన ఉన్నదా? ఎట్ల ఒక్కొక్క రూపాయి కూడబెట్టాల.. ఎట్టెట్ల తీసుకుపోవాలె. నేను సీఎంని అయ్యాక ఎంత మంది నన్ను టెమ్ట్ చేసినా ఐఏఎస్ అఫీసర్లు.. వాళ్లు, వీళ్లు. రూపాయి రిజిస్ట్రేషన్ చార్జీ పెంచలే నాలుగేండ్ల దాక. ఉల్టా నేను వాళ్లను పిలిచి మీకు ఏమి కావాలె. రియల్‌ఎస్టేట్ బాగ కావాలె. హైక్లాస్ కావాలె అని. హైదరాబాద్‌లో కూడా స్కైలైన్‌లు రావాలని చెప్పి మూడేండ్లు తిప్పలపడ్డ. అది తేవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. రాజ్‌భవన్ గేట్ పక్కన ఒక టవర్ ఉంటది. నేను పోతుంటే అప్పుడే ఆయన పునాది తీసిండు. ముందే వాటర్‌ఫ్రంట్ బాగుంటది. ఆగు.. 50 అంతస్తులకి ఇద్దాము అంటే.. ఆ రాజు ఆగలే. ఆయన అంతకే కట్టుకున్నడు పాపం. ఇట్ టుక్ మీ త్రీ ఇయర్స్ టు బ్రింగ్ స్కైలైన్ టు హైదరాబాద్. ఒక సిస్టం చేసినం. ఓపికతో.. వాళ్లతో డిస్కస్ చేసుకుంటూ, మాట్లాడుకుంటూ ఒక క్రమపద్ధతిలో పోయినం. అట్ల ఉంటది పద్ధతి.

> మహిళలకు ఇస్తామన్న రూ.2,500లే దిక్కులేదు. కోటిమందిని కోటీశ్వరులను చేస్తరట. ఎట్ల చేస్తవయ్యా.. నీ దగ్గర ఉంటెనా? ఉన్న రెవెన్యూయే పీకింది. మేమున్నప్పటి గ్రోత్‌లో 50% లేదు. -కేసీఆర్

రియల్‌ఎస్టేట్ పతనం

నాలా ఫీజులు తొలగించినం. దానికోసం ఆర్డీవో ఆఫీసుకు వెళ్లే అవసరం కూడా లేకుండా చేసినం. భూముల ధరలు పెంచినం. ప్రజా ఆస్తుల విలువ పెంచినం. నాలుగు ఎకరాలు ఉన్నోడు ధీమాతో రెండుకోట్ల శ్రీమంతుడినని కాలర్ ఎగిరేసి చెప్పుకునెటోడు. ఇయాల ఏమైనై భూముల ధరలు? కుప్పకూలిపోయినై. ఎకరా కూడా అమ్ముడు పోతలేదు. ఎకరం అమ్మి అమ్మాయి పెండ్లి చేద్దామంటే కొనే దిక్కులేదు. కండ్లకు నీళ్లు పెట్టుకుంటున్నరు ప్రజలు. కొనే దిక్కులేదు. అమ్ముకుందామంటే.. ఇష్టమొచ్చిన ధరలకు.. అడ్డమైన ధరలకు అమ్ముకోవాలె. హరాకిరి మాటలు చెప్పి, అడ్డమైన హామీలిచ్చి, చేయచేతగాక, కేవలం రాయకీయ అధికారమే లక్ష్యం అనే పద్ధతిలో ప్రజలను వంచించి, రైతాంగాన్ని ఏడిపిస్తున్నరు. పేద ప్రజలను ఏడిపిస్తున్నరు. విద్యార్థులను ఏడిపిస్తున్నరు. రిటైర్డ్ ఉద్యోగులను ఏడిపిస్తున్నరు, పచ్చి అబద్ధాలు చెప్తున్నరు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నం అంటున్నరు. కాగ్ ఉతికింది కద.. ఈ చెంప ఆ చెంప వాయించింది కద. తీసుకున్న అప్పులెన్ని అంటే రూ.2 లక్షల 90 వేల కోట్లు మొత్తం కలిపి. ఇవన్నీ వాస్తవాలు ఒక పక్కకుంటే, అన్ని అబద్ధాలు చెప్పుకుంటూ.. ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నరు.

> మా గవర్నమెంటు వచ్చిన్నాడు హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ.57 వేల కోట్లు ఉండె. దాన్ని రూ.2.47 లక్షల కోట్ల వరకు తీసుకుపోయినం. స్టెప్ బై స్టెప్ చేసుకుంటు పోయినం. గాల్లో మాటలు చెప్తే వస్తయా? మేము బిజినెస్ మీట్‌లు పెట్టలే.. కాంక్లేవ్‌లు పెట్టలే.. పరదాలు కట్టలే. బెస్ట్ పాలసీ తెస్తే ఆటోమేటిక్‌గనే అట్రాక్ట్ అయి వస్తరు. -కేసీఆర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిద్రపోనివ్వం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడం. ఈ ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం. కేంద్రాన్ని కూడా నిద్రపోనివ్వం. హక్కుల పరిరక్షణలో డ్రాప్ తక్కువైనా ఎట్ ఎనీ కాస్ట్.. ఎట్ వాట్ ఎవర్ కాస్ట్ టీఆర్ఎస్, బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం. తెలంగాణ ప్రజలకు ఒక నొక్కు పడుతుంటే మౌనం పాటించలేం. మీటింగ్ జరుగుతుంటే నాకు ఇన్ఫర్మేషన్ వచ్చింది. మనది 4 గంటలకు అయిపోవాల్సింది. ఇట్ వజ్ ఎక్స్‌టెండెడ్. 5 గంటలకు ఉత్తమ్ ప్రెస్‌మీట్ పెట్టిండు. మీకు కూడా ఇన్ఫర్మేషన్ వచ్చి ఉంటది. కేసీఆర్‌ది కాంగనే మనం కూడా మొరగాల. చిట్‌చాట్. ఈ రోజు నేను పాలమూరు ఎత్తిపోతల పథకానికే పరిమితమవుతున్న. సబ్జెక్ట్ డైల్యూట్ అవుద్ది కాబట్టి వేరే విషయాలు ఇప్పుడు చెప్పను. ఐయామ్ ఆన్ ద ఫీల్డ్ నౌ. ఎనీ కొశ్చెన్, 100 కొశ్చెన్స్ యు పుట్ మీ.. ఐ విల్ గివ్‌ఆన్సర్ టుమారో.. ఆర్ డే ఆఫ్టర్ ఎనీటైమ్. థ్యాంక్యూ' అని ప్రసంగం ముగించారు.

ఇదీ బాబు కథ

'బిజినెస్ మీట్ పెడతం. ఎంవోయూలు చేసుకుంటం. ఏ ప్రభుత్వమైనా చేయాల్సిందే. అడ్డగోలు జమాబందీ.. దానికి లెక్కలేని కథ అంటే ఏందన్నట్టు? ఒక హైప్ క్రియేట్ చేసుడు. దీనికి ఆద్యుడు, గురువు చంద్రబాబు నాయుడు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన లెక్కలు బిజినెస్ వచ్చేదుంటే, ఎంవోయూలు సక్సెస్ అయ్యేదుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో ఈపాటికి రూ.20 లక్షల కోట్లు వచ్చి ఉండాలి. ఆయన ఫస్ట్ టైమ్ అక్కడ సీఎంగా ఉన్నప్పుడు వైజాగ్‌లో పెట్టిండు. వైజాగ్‌లో ఎవర్రా ఎంవోయూలు చేసిందంటే వంట మనుషులని చెప్పిన్రు. స్టార్ హోటళ్లల్లో ఉండే వంట మనుషులు, సప్లై చేసేటోళ్లు.. వచ్చి కూసోని.. సంతకం పెట్టు అంటే.. పెట్టిన్రు పాపం. ఇది నిజం. పెద్ద పాపులర్ అయింది అది. అవి నిజమైతే, ఆఖరికి ఒక రూ.పది వేల కోట్లన్న రావాలె. రూ.15 లక్షల కోట్లు, రూ.ఆరు లక్షల కోట్లు, రూ.ఎనిమిది లక్షల కోట్లు.. ఇప్పుడా పెట్టుబడులన్నీ ఎక్కడ బాయె..' అని కేసీఆర్ ప్రశ్నించారు.

మధ్యప్రదేశ్‌లో ఇలా..

'అప్పుడు నేను ముఖ్యమంత్రిగా ఉంటి. భోపాల్‌లో అక్కడి ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్. తరువాత నీతి ఆయోగ్ సబ్ కమిటీకి చైర్మన్ అయిండు. 'నేను భోపాల్‌లో పెడత.. వచ్చిపో' అని బతిమిలాడితె.. ఫోన్ల మీద ఫోన్లు చేస్తే.. సరే అని పోయిన. అప్పుడు వసుంధరరాజే చెల్లెలు యశోధరారాజే ఇండస్ట్రీ మినిస్టర్‌గా ఉండె మధ్యప్రదేశ్‌కు. ఆమె వచ్చి.. 'నీ కొడుకొచ్చి.. ఆగమాగం చేస్తుండు' అన్నది. 'అదొకటి.. ఇదొకటి మాట్లాడి చేసుకుంటుండు' అన్నది. నువ్వు కూడా తన్లాడు.. గట్టిగ చెయ్.. అన్న. అంతకుముందు నేను భోపాల్ పోవడానికి రెండు, మూడు నెలల ముందు అక్కడొక కార్యక్రమం జరిగింది. ప్రధాని మోదీ వచ్చిండు అక్కడకి. అప్పుడు రూ.14 లక్షల కోట్లకు ఎంవోయూ చేసిపడేసిన్రు. 'మొన్ననే రూ.14 లక్షల కోట్లకి ఎంవోయూలు చేశారు కదా. మరి మీరు రాలేదంటరేంటి?' అని ఆమెను అడిగిన... 'ఓ సబ్ బోగస్ హై సాబ్' అన్నది ఆమె. ఆమె నాతోని అన్నది ప్రామీస్ చెప్తున్న. ఐ వాజ్ షాక్డ్. 'అది వచ్చేదా, పోయేదా సార్.. వట్టి గ్యాస్' అన్నది. ఈ గ్యాస్‌లు ఎవరిని మోసం చేయడానికి? ఇంత వంచిస్తరా ప్రజలను? నికరంగా వస్తే పెట్టుబడులు రావాలి కదా. కనబడతయ్ కదా. ఆ పెట్టుబడులొస్తే లాభాలు జరుగుతయ్, ఉద్యోగాలొస్తయ్. ఫ్యాక్టరీలు వస్తయ్. అడిషనల్ ఇన్‌కమ్ జనరేట్ అయితది. స్టేట్ గవర్నమెంట్లకు జీఎస్టీ పెరుగుతది. ఏమీలేదు.. ఒట్టిదే గ్యాస్.

కేసీఆర్ ప్రెస్‌మీట్‌తో ఉలిక్కిపడ్డ సర్కారు

తొలుత ఉత్తమ్.. తర్వాత సీఎం వరుస ప్రెస్‌మీట్లు


- సమాధానం చెప్పలేక సంజాయిషీలు ఇచ్చుకున్న పరిస్థితి
- కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మళ్లీ తిట్ల దండకం
- నేడు హుటాహుటిన మంత్రులతో భేటీకి సీఎం నిర్ణయం
- కేసీఆర్ బహిరంగ సభ ప్రకటనలపై రేవంత్ వెన్నులో వణుకు
- బహిరంగ సభలొద్దు.. అసెంబ్లీలో చర్చిద్దామంటూ విన్నపాలు



హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అలా బయటకు వచ్చి ఒక్క ప్రెస్‌మీట్‌తో కాంగ్రెస్ సర్కారు ఉక్కిరిబిక్కిరైంది. సీఎం రేవంత్ సహా మంత్రివర్గంలో వణుకు మొదలైంది. ఉదయం నుంచి కేసీఆర్ సమావేశంలో ఏం మాట్లాడాతారనే దానిపైనే సీఎం ఫోకస్ పెట్టారు. ఆయన పేరుకే రాష్ట్రపతి ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్నా, ధ్యాసంతా కేసీఆర్ సమావేశం, ప్రెస్‌మీట్ చుట్టే తిరిగింది. క్షణక్షణం తన అనుకూల మీడియా, ఇంటెలిజెన్స్ వర్గాలతో సమాచారం తెప్పించుకొని.. కేసీఆర్ లేవనెత్తిన అంశాలు, సంధించిన ప్రశ్నలపై చర్చించేందుకు సీఎం రేవంత్ సోమవారం హుటాహుటిన మంత్రులతో భేటీ కావాలని నిర్ణయించారు. అంటే కేసీఆర్ వ్యాఖ్యలతో ఇటు సర్కారులో అటు రేవంత్‌లో ఎంత అలజడి, ఆందోళన మొదలైందో అర్థమవుతున్నది. ఆదివారం సాయంత్రం కేసీఆర్ ప్రెస్‌మీట్ పెడతారనే సమాచారం అందగానే సంజాయిషీ ఇచ్చుకొనే ప్రయత్నాలు మొదలుపెట్టారు. సీఎం తొలుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌ను పురామాయించారు. కేసీఆర్‌కు కౌంటర్ ఇవ్వాలంటూ ఆదేశించారు. ఉత్తమ్ ప్రెస్‌మీట్ పెడితే ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఆయన చెప్పదలుచుకుంది చెప్పరు.. చెప్పినా ఎవరికీ అర్థం కాదు. ఈ విధంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాలపై కేసీఆర్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏవేవో అర్థం పర్థంలేని వ్యాఖ్యలు చేసి వెళ్లిపోయారు. దీంతో ఉత్తమ్ ప్రెస్‌మీట్ కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ కాలేదని భావించిన సీఎం రాత్రిపూట ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. తన అనుకూల మీడియా ప్రతినిధులను ఇంటికి పిలిపించుకొని చిట్‌చాట్ పేరుతో సంబంధం లేని అంశాలపై మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై రేవంత్‌కు గల అవగాహనపై అనేక అనుమానాలున్నాయి. అందుకే సీఎం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై, కృష్ణా జలాలపై కేసీఆర్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తనకు అలవాటైన తీరులో కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగారు. కేసీఆర్ ఆర్థిక ఉగ్రవాది అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వివిధ రూపాల్లో రూ.8లక్షల కోట్ల అప్పులు చేశారంటూ ఆరోపించారు. అంతకుముందు కేసీఆర్ తన ప్రెస్‌మీట్‌లో అప్పులపై స్పష్టతనిచ్చారు. తమ ప్రభుత్వం రూ.2.5లక్షల కోట్లు మాత్రమే అప్పులు చేసినట్టు 'కాగ్' చెప్పిన లెక్కల్ని ఉద్ఘాటించారు. మరోసారి కేసీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టేలా వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను ఇంట్లో వాళ్లు బంధించారని, అందుకు ఆయన బయటకు రావడం లేదంటూ ప్రేలాపనలు చేశారు. ఒకవేళ సీఎం చెప్పిందే నిజమైతే.. కేసీఆర్ ఈ రోజు బయటకు ఎలా వచ్చారు? ప్రెస్‌మీట్ ఎలా పెట్టారో సీఎం సమాధానం చెప్పాలి. ఇక కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. 'ఆయన తమలపాకుతో కొడితే నేను తలుపు కర్రతో కొడతా.' నంటూ తనకు అచ్చొచ్చిన భాషతో విపరీత వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్‌కు మోదీ ఎరువు అందుతుంది.' అంటూ వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ, అరవింద్‌కుమార్‌పై విచారణ డీఓపీటీ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. సాగునీటి విషయంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న ధోకాపై ప్రజల్లోనే తేల్చుకునేందుకు బహిరంగ సభలు నిర్వహిస్తానని కేసీఆర్ ప్రకటించారు. అంతే రేవంత్ వెన్నులో వణుకు మొదలైనట్టున్నది. ఆయన బయటకు వచ్చి గంటపాటు ప్రెస్‌మీట్ పెడితేనే ఇలా ఉందంటే.. ఇక ఆయన బహిరంగ సభలు పెడితే కాంగ్రెస్ సర్కారును ఉతికి ఆరేయడం ఖాయమనే అభిప్రాయానికి వచ్చిన రేవంత్.. బహిరంగ సభలు పెట్టకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. బహిరంగ సభలు పెట్టొద్దు.. అసెంబ్లీకి రండి చర్చిద్దాం అంటూ విన్నపాలు చేశారు. ఇందుకోసం జనవరి 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తానని కూడా చెప్పారు.

నీళ్లు నమిలిన ఉత్తమ్!

- కేసీఆర్ ప్రశ్నలకు మంత్రి పసలేని సమాధానాలు
- డీపీఆర్ గతంలోనే తిప్పిపంపారంటూ అబద్ధాలు
- కాళేశ్వరం.. అవినీతి అవే ఆరోపణలు ఏకరువు
- మరోసారి సమావేశం పెడతానంటూ దాటవేత
- కేసీఆర్ సమావేశం ముగిసిన తర్వాతే ప్రెస్‌మీట్
- బాగా కవర్ చేయండంటూ మీడియాకు విజ్ఞప్తి



హైదరాబాద్, డిసెంబర్21 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు, కృష్ణా జలాల్లో జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంధించిన ప్రశ్నలకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉలిక్కిపడ్డారు. హడావుడిగా ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. పసలేని సమాధానాలతో, పొంతనలేని అంశాలతో, గతంలో లాగానే అవినీతి, అప్పులు అంటూ ఏకరువు పెట్టారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కృష్ణా జలాల్లో తెలంగాణకు వాటిల్లుతున్న నష్టం, కాంగ్రెస్ సర్కారు అసమర్థతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ గర్జనతో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి ఉత్తమ్ హడలిపోయారు. సెక్రటేరియట్‌లో మంత్రి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను గత ప్రభుత్వ హయాంలోనే కేంద్రం తిప్పి పంపిందని పచ్చి అబద్ధాలు వెల్లడించారు. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీకి రాసిచ్చిందని అసత్యాలు వల్లెవేశారు. పాలమూరు-రంగారెడ్డికి మొత్తం 90 టీఎంసీలకు అనుమతులు కోరామంటూ కప్పిపుచ్చుకునేందుకు యత్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే ప్రాజెక్టులు కట్టలేకపోతున్నామంటూ ఎదురుదాడికి దిగారు. మరోసారి పూర్తిస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తానంటూ సమావేశాన్ని ముగించారు.

మీడియాకు మంత్రి వేడుకోలు

కేసీఆర్ సమావేశం ముందు రోజు నుంచే ఉత్తమ్ హడలెత్తిపోయారు. సాగునీటిశాఖ ఉన్నతాధికారులతో శనివారమే ప్రత్యేకంగా చర్చించారు. అందరూ అందుబాటులో ఉండాలంటూ హుకుం జారీ చేశారు. ఆదివారం రోజున కేసీఆర్ సమావేశాన్ని అణువణువు ఫాలో అయ్యారు. రాత్రి 8 గంటలకు సెక్రటేరియట్‌లో మంత్రి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కేసీఆర్ ప్రస్తావించిన అంశాలకు సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. తుదకు కేసీఆర్ సమావేశానికే ప్రాధాన్యం ఇవ్వకుండా.. తన సమావేశాన్ని బాగా కవర్ చేయాలంటూ మీడియా ప్రతినిధులకు మంత్రి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం కేసీఆర్ సమావేశంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు అంటే ప్రభుత్వం ఎంతగా హడలిపోయిందో ఆయా అంశాలను బట్టి తెలిసిపోతున్నది.

ఫ్యూచర్ సిటీ కాదు.. రియల్ ఎస్టేట్ లూటీ

- ఉజ్వల భవిష్యత్ కోసం ఫార్మాసిటీ తెచ్చినం
- ఇందుకోసం 14వేల ఎకరాలు సేకరించినం
- వాటిని అమ్మేకునేందుకు కాంగ్రెస్ కుట్రలు
- గురుకుల విద్యార్థులను సాదే తెలివి లేదు
- ఫ్యూచర్‌సిటీ తెస్తవా? నీతోటి అయితదా?
- దిక్కుమాలిన దందాలు తప్ప చేసిందేం లేదు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ కోసం ఐదారేండ్లు ఎంతో శ్రమకోర్చి తమ హయాంలో ఫార్మాసిటీ తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను అమ్ముకునేందుకు కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అది ఫ్యూచర్ సిటీ కాదని.. రియల్ ఎస్టేట్ పేరుతో లూటీ అని నిప్పులుచెరిగారు. దిక్కుమాలిన పాలసీలు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందాలు తప్ప ఈ దద్దమ్మ ప్రభుత్వం చేసేదేమీలేదంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే 'ఎందుకొచ్చిందండి ఫార్మాసిటీ.. అనుకోకుండా కొన్ని ప్రాంతాలకు, రాష్ట్రాలకు కొన్ని సందర్భాలు కలిసి వస్తయ్.. అప్పటి భారత ప్రభుత్వం ఈ కిల కోయవ్యాధి, కలరా వ్యాధులతో ప్రజలు ఇబ్బడిముబ్బడిగా సచ్చిపోయేది. ఎందుకంటే దీనికి ప్రాపర్‌గా మెడికేర్ లేదు. ఎక్కడికక్కడ లోకలైజ్డ్ ప్రొడక్షన్స్ ఉండాలని చెప్పి ఐడీపీఎల్స్ అని పెట్టిన్రు. ఆ టైంల మనకు రాజధానిగా హైదరాబాద్ ఉన్నందున మన రాష్ట్రానికి ఐడీపీఎల్ వచ్చింది. ఐడీపీఎల్ పుణ్యమా అని అనేకమంది నేర్చుకొని బయటకు వచ్చిన్రు. అంజిరెడ్డి కూడా ఐడీపీఎల్ ఎంప్లాయే. వాళ్లు పరిశ్రమలు పెట్టి ఫార్మాను విస్తరించిన్రు. దీని వల్ల హైదరాబాద్ మెడికల్, ఫార్మాహబ్‌గా రూపుదిద్దుకున్నది. ప్రపంచంలో మూడో వంతుకు మన జీనోమ్‌వ్యాలీ నుంచే వ్యాక్సిన్ సరఫరా అవుతది. రసాయన వ్యర్థాలతో హుస్సేన్‌సాగర్ కలుషితమై గబ్బుగబ్బు అయిపోయింది. దీని నుంచి బయటపడేందుకు నలుగురు ఐఏఎస్ అధికారుల బృందాలను అప్పటి హెల్త్ సెక్రటరీ శాంతి కుమారి నేతృత్వంలో అనేక దేశాలకు పంపినం. తెలంగాణ భవిష్యత్ దృష్ట్యా ఫార్మాను కాపాడుకోవాలె. కాలుష్యం బారి నుంచి ప్రజలను రక్షించుకోవాలె.. ఇందుకోసమే జీరో లిక్విడ్ బేస్ టెక్నాలజీని తెచ్చినం. ఈ పద్ధతి ఇంటర్నేషనల్ లెవల్‌లో సక్సెస్ అయింది. మనం ఆ సిస్టం పెట్టుకోవచ్చు కదా అని ఓ ఫార్మా యూనివర్సిటీని పెట్టుకోవాలని భావించి రెండు హెలికాప్టర్లలో ఫార్మా బిజినెస్‌మెన్స్‌ను వెంట తీసుకొని ముచ్చర్ల కాడ ప్లేస్ ఫైనల్ చేసి శంకుస్థాపన చేసినం. ఐదారేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించినం.. ఎంఈవోయూలు కూడా జరిగినయ్. జీడిమెట్ల, చర్లపల్లిలోని పరిశ్రమల నిర్వాహకులు కూడా ప్రత్యామ్నాయ స్థలాలు చూపితే తరలిపోతం.. అంటూ ముందుకు వచ్చిన్రు. కామన్ అఫ్లూయెంట్స్ ప్లాంట్స్ పెట్టి, రసాయన వ్యర్థాలు ఎటుపడితే అటుపోవద్దని, కాలుష్య నియంత్రణ జరగాలని ఏర్పాటు చేసిందే ఫార్మాసిటీ. కేంద్రం నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కూడా వచ్చింది. హైదరాబాద్ ఫార్మాను ఒక్క దగ్గరికి తీసుకుపోవాలె. పద్ధతిగా అభివృద్ధి చేయాలని సంకల్పించినం.'

> కిచెన్‌ను క్లీన్‌గా పెట్టుకొన్నట్టే ఫార్మా కంపెనీలను క్లీన్‌గా పెట్టుకోవాలె. మనదేశంలోనైతే ఫార్మా కంపెనీల ముందునుంచి గబ్బు వాసన వస్తది. కానీ యూఎస్ఏ, జపాన్, యూరప్, చైనాలో ఈ పరిస్థితి లేదు. అక్కడ పరిశ్రమల గొట్టాల నుంచి పొగ కూడా రాదు. మనం గా మాత్రం పెట్టుకోవడానికి తెలివిలేదా? టెక్నాలజీ లేదా? అని భావించి ఐఏఎస్ బృందాలను వివిధ దేశాలకు పంపించిన. ఫార్మాసిటీకి ప్లాన్ చేసిన. - కేసీఆర్

భూములు అమ్ముకొనేందుకే ఫ్యూచర్‌సిటీ

ఏం జరుగుతుంది రాష్ట్రంలో? ఫ్యూచర్ సిటా, తొక్కసిటీయా?, ఎవనికి కావాలె నీ ఫ్యూచర్‌సిటీ నువ్వు పెంచినవా హైదరాబాద్‌ను.. ఇంత వైబ్రెంట్ సిటీ ఎక్కడినుంచి వచ్చింది. ఓ 400 సంవత్సరాల నుంచి ఒకటీఒకటి తెచ్చుకొని అభివృద్ధి చేసుకొంటే ఆటోమెటిక్‌గా పెద్దసిటీ అయింది. ఎన్ని రాష్టాలకు ఉన్నాయండి ఇట్లాంటి సిటీలు.. మహారాష్ట్రకు ముంబై, పశ్చిమబెంగాల్‌కు కోల్‌కత్తా, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై.. మనకు హైదరాబాద్ ఉన్నయ్.. ఇంత మహానగరం భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పెట్టిందే ఫార్మాసిటీ. కానీ ఇవన్నీ తీసుకపోయి ఫ్యూచర్‌సిటీ, తొక్కసిటీ అంటున్నరు. దిక్కుమాలిన పాలసీలు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా తప్ప ఈ ప్రభుత్వం చేసేదేమీలేదు.

సాదే తెలివిలేదు.. ఫ్యూచర్‌సిటీ కడ్తవా?

గురుకుల విద్యార్థులను సాదే తెలివిలేదు గానీ ఫ్యూచర్‌సిటీ కడతవా? నీతోటి అయితదా? జూపార్కును కొంచబోయి ఆడ పెడ్తరట. ఎందుకు జూపార్కు అమ్ముకొనేందుకా? ఏం జరుగుతుంది ఈ రాష్ట్రంలో.. మేం ఉన్నప్పుడు గిసొంటి చిల్లర పనులు చేయలే. ఇదెక్కడి దిక్కుమాలిన దందా.. అసలు. ఏం జేయదలుచుకున్నరు ఈ రాష్ట్రాన్ని.. నేను ఒక్కటే మాట అడుగుతున్న. ఏ ప్రభుత్వమైనా బిజినెస్ మీట్ పెట్టి ఎంవోయూలు చేసుకుంటది. కానీ అడ్డగోలు జమాబందీ లెక్కలేని కథేంది నాకు అర్థంకాదు. ఓ హైప్ క్రియేట్ జేసుడు. దీనికి ఆద్యుడు, గురువు చంద్రబాబునాయుడు.. ఆయన చెప్పిన లెక్కన బిజినెస్ అయ్యేదుంటే, ఎంవోయూలు సక్సెస్ అయ్యేదుంటే ఆంధ్రప్రదేశ్‌కు ఈపాటికి రూ.20 లక్షల కోట్లు వచ్చేదుండె. ఆయన ఫస్ట్‌టైం సీఎం అయినప్పుడు వైజాగ్‌లో పరిశ్రమలు పెట్టేందుకు అక్కడ స్టార్ హోటళ్లలోని వంట మనుషులు, సప్లయర్స్‌తో ఒప్పందాలు చేసుకున్నరని కేసీఆర్ మండిపడ్డారు.

> గురుకుల విద్యార్థులు చనిపోవుడేంది. ఇప్పటికి 120మంది పిల్లలు సచ్చిపోయిన్రు. వాళ్లను సాదే తెలివిలేదు గానీ.. ఏందో ఫ్యూచర్‌సిటీ కడ్తవా? నీతోటి అయితదా? ఫార్మాసిటీకి ఉపయోగిస్తమనే షరతుతోనే అప్పుడు భూములు తీసుకున్నం. హైకోర్టుకేమో ఫార్మాసిటీ ఉంటది అని ప్రభుత్వం అంటది. మళ్లా అక్కడ 3వేల ఎకరాలల్ల అంబానా.. సల్మాన్‌ఖానా.. వంతారానో బొంతారానో పెడ్తరట. జూపార్కును కొంచబోయి ఆడ పెడ్తరట. ఎందుకు జూపార్కు అమ్ముకొనేందుకా? ఏం జరుగుతుంది ఈ రాష్ట్రంలో..? - కేసీఆర్

ఈ ప్రభుత్వం.. సర్వభ్రష్టం

తెలివితక్కువ.. దద్దమ్మ ప్రభుత్వం తోలుతీస్తం
ఇప్పటిదాకా ఒక లెక్క.. రేపటి నుంచి మరో లెక్క
ఇదొక రాష్ట్ర ప్రభుత్వమా? అసలు ప్రభుత్వం ఉన్నదా?
ధ్వజమెత్తిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : 'రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నిలదీసేందుకు ఇప్పుడు తెలంగాణకు వాయిస్ ఎవరు? తెలంగాణలో ఉన్న ప్రభుత్వం మాట్లాడకుంటే ఇంకెవరు మాట్లాడాలె? ప్రతి పక్షమే కదా? మాకు రెండు బాధ్యతలున్నయ్. ఒకటి తెలంగాణ తెచ్చిన పార్టీగా, రెండోది ప్రధాన ప్రతిపక్షంగా కంపల్సరీ మా డ్యూటీ మేము చెయ్యాలె. వీళ్లేదో తమాషాకు అదోటి దోటి అడ్డం పొడుగు మాట్లాడి, కిరికిరి మాటలు మాట్లాడి, ఈ కారు కూతలు కూసి ఏదో చేస్తామనుకుంటే నడవదిక..ఇయ్యాల్టి దాకా వేరే కథ.. రేపటి నుంచి వేరే కథ. ఎక్కడికక్కడ తోలు తీస్తాం' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రజలతో కలిసి ఎక్కడికక్కడ నిలబెట్టే ప్రయత్నం చేస్తం.. అడుగడుగునా చెక్ చేస్తం. ప్రతి విషయంలో చెక్ చేస్తం. మేము తొందరపడి మీ మీద కన్నెర్ర జేయడం లేదు. మీకు చాలా పెద్ద సమయమే ఇచ్చినం. మా ప్రభుత్వం పోయింది.. వీళ్లు వచ్చింద్రని పిచ్చి పిచ్చిగా చేయడం లేదు. అలాంటి వాటి జోలికిపోలే. ఇష్యూల మీద మాత్రమే పోరాడుతున్నం.. వక్ఫ్ ఇష్యూస్ మీద పోరాడుతున్నం. రకరకాల భూదందాల మీద.. దోపిడీ మీద.. లగచర్ల మీద పోరాడుతున్నం. పార్టీ కొట్లాడుతున్నది. బరాబర్ కొట్లాడుతం.

నీళ్ల వాటా కోసం కొట్లాడుతం

ఇప్పుడు మొదటికే ముప్పు వచ్చే పరిస్థితి ఉన్నది. అటు గోదావరి మీద అరాచకం చేసి చంద్రబాబు నాయుడు, ఏపీ ప్రభుత్వం నల్లమల సాగర్, ఈ సాగర్, ఆ సాగర్ అంటూ నీళ్ల దోపిడీ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సప్పుడు లేదు. ఇటు కృష్ణలో పాలమూరు ఎత్తిపోతలకు అన్యాయం జరుగుతున్నా సప్పుడు లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నట్టీ రాష్ట్ర ప్రభుత్వం? ఏం చేయడానికి ఉన్నట్టు? ఈ రాష్ట్రంలో ఏం జరుగుతున్నట్టు ? ఎట్టి పరిస్థితుల్లో నేనే స్వయంగా రంగంలోకి దిగాలనుకున్న. దిగిన. ఈరోజు డెసిషన్ అయిపోయింది. నాలుగు రోజుల్లో ఆయా జిల్లాల నాయకులతో సమావేశమై గ్రామ గ్రామాన డప్పు కొడుతం. మొత్తం సభలు పెడుతం. కవులు, గాయకులు, కళాకారులందరినీ తట్టి లేపుతం. ఈ మీడియా సోదరులను కూడా రిక్వెస్ట్ చేస్తం. అక్కడ జరిగే అన్యాయాన్ని, ప్రజలకు జరిగే అన్యాయాన్ని, జల దోపిడీని ప్రజలకు చూపెట్టాలని కోరుతం. ఈ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని కూడా తప్పకుండా ప్రజలకు చెప్తం. ఇన్ని రోజులు ఒక రకంగా పోయినం. కానీ ఇక తప్పేటట్టు లేదు. ఎవరితోనైనా సరే కొట్లాడుతం. తెలంగాణ కోసం భయపడం. ఏందాకైనా పోతం. కొండ మీద కోతితోనైనా సరే కొట్లాడుతం తప్ప విడిచి పెట్టం. ఇక్కడ ఎవరి ముఖాలు చూసేది లేదు. డెఫినెట్‌గా ఫైట్ చేస్తం. ఎందుకంటే రాష్ట్ర హక్కులను రక్షించుకోవాలె.. నీళ్ల హక్కులను రక్షించుకోవాలె. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను రక్షించుకోవాలె.

> మా హయాంలో ఈ రాష్ట్రం ఒక పద్ధతి ప్రకారం ముందుకు నడిచింది. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికం, ఐటీ రంగం, క్రైమ్ తగ్గింపు, లాండ్ అండ్ ఆర్డర్ నిర్వహణలో మంచి పద్ధతిలో ముందుకు పోయింది. ఇప్పుడు మానభంగాలు, నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదు. అప్పుడు పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఇప్పుడవన్నీ మాయమైనయ్.
> –కేసీఆర్

సర్వభ్రష్ట ప్రభుత్వం.. మౌనమెందుకు?

మా కండ్ల ముందే జరిగిన ఈ దుర్మార్గంలో కేసీఆర్ ఎట్లా మౌనం పాటిస్తడు? ఎందుకు మౌనంగా ఉంటడు? ఎవరి కోసం ఉంటడు? ఎందుకోసం ఉండాలె? కాబట్టి ఈ అరాచక ముచ్చట్లు ఇక చెల్లవు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడి, అల్తుఫాల్తు కూతలు కూసి ఏదో చేస్తామంటే అది జరిగేది కాదు. అలా జరగనియ్యం. ఈ ప్రభుత్వం కూడా సర్వభ్రష్ట ప్రభుత్వం. నువ్ మా ఇంటికొచ్చి మావి దోచుకుపోతా అంటే ఊరుకుంటామా? జేబులో చేయిపెట్టి పైసలు తీసుకుంటా అంటే ఊరుకుంటామా? చేతనైన కాడికి కొట్లాడుతం కదా.

ప్రశాంత రాష్ట్రంలో అశాంతి

మా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి విషయంలో, పారిశ్రామికీకరణలో, ఐటీ రంగంలో, క్రైమ్‌ను తగ్గించడంలో, లా అండ్ ఆర్డర్ మెయింటెయిన్ చేయడంలో.. ఒక మంచి పద్ధతిలో పోయినం. ఇయ్యాల ఏందండి? జంట నగరాల్లో పట్టపగలు నడిరోడ్డుపై హత్యలు జరుగుతున్నయి. అడిగే దిక్కు లేదు. మానభంగాలు జరుగుతున్నయి. ఎన్సీఆర్బీ రిపోర్టు ప్రకారం తెలంగాణలో 20% క్రైమ్ రేట్ పెరిగింది. మా హయాంలో పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండె. ఇవాళ తెలంగాణలో అవన్నీ మృగ్యమైపోతున్నయి. దారుణాలన్నీ పెరిగిపోయినయి. ఇక ఉపేక్షించేది లేదు.

ఇస్తామన్న రూ.15వేలు ఎక్కడ?

వీళ్ల వాగ్దానాలు ఏందండి.. వీళ్లు చేసినవి? మంచిగున్న ప్రజలకు మాకు ఓటేసే ఉద్దేశంలో ఉన్న ప్రజలకు పచ్చి అబద్ధాలు చెప్పి.. టెంప్ట్ చేసి, మోసం చేసి, ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసింద్రు. దొంగ మాటలు చెప్పి, మాయ మాటలు చెప్పి, అర్రాస్ పాటలు పాడింద్రు. వేలం పాట పాడినట్టు పాడింద్రు. కేసీఆర్ 10 వేలు ఇస్తున్నడు..రైతుబంధుకు మేము 15 వేలు ఇస్తమన్నరు? ఎక్కడవి? మహిళలకు రూ.2,500 ఇస్తామన్నరు అవెక్కడ? కేసీఆర్ కల్యాణలక్ష్మి లక్ష రూపాయిలిస్తున్నడు.. మేం తులం బంగారం కలిపి ఇస్తమన్నరు. పెండిండ్లు చేసుకోవద్దన్నరు. ఇదే ప్రభుత్వం చెప్పే మాటలకు కొందరు పెండ్లి చేసుకోలేదు. ఆ తులం బంగారం ఎక్కడ? పెద్ద క్యాసెట్లు వేసింద్రు. ఆ క్యాసెట్లు మా దగ్గర ఉన్నయి. పెన్షన్ తీసుకునే ముసలోళ్లు నవంబర్లో తీసుకోవద్దు.. డిసెంబర్‌లో 4 వేలు ఇస్తమన్నరు. ఆ రూ.4 వేలు ఎక్కడ? రూ.2 లక్షల రుణమాఫీ అని నరికింద్రు. ఉరుకుంద్రి ఉరుకుంద్రి బ్యాంకుల దగ్గరకు వెళ్లి జల్ది తెచ్చుకొండ్రి అని అర్రాస్ పాట పాడింద్రు.. ఏంజేసింద్రు? ఆఖరికి పేద విద్యార్థులను కూడా మోసం చేసింద్రు. మొత్తం 420 హామీలున్నయి. కొన్నింటినే మేం ప్రస్తావించినం.

ఓవర్సీస్.. దళితబంధు ఎక్కడ?

మేము మొత్తం 100 శాతం సమ్మిళితమైన అభివృద్ధి మీద ముందుకు పోయినం. మీలా ఏకాకిగా, ఏకపక్షంగా, ఏకోన్ముఖంగా పోలేదు. ఆల్ ఫ్రంట్స్ కవర్ చేయాలని చూసినం. పేద పిల్లలకు విదేశీ విద్య కోసం లేకలేక సీటు వస్తది. చదువుకోవాలని ఆశ పడుతరు.. కానీ పోలేరు. వ్యక్తిగతంగా మమ్మల్ని అడిగితే మేము పార్టీ పరంగానో వ్యక్తిగతంగానో చేసేది కొంత మేరకే. పాలసీగానే ఎందుకు చేయకూడదు? అని చెప్పి ఆలోచించి 20 లక్షల రూపాయలిచ్చినం. ఎస్సీ, ఎస్టీ పిల్లలు పోతే వాళ్లకు అంబేద్కర్ ఓవర్సీస్ అని, బీసీలకు జ్యోతిబా పూలే ఓవర్సీస్ అని.. రకరకాలుగా మొత్తం మీద అన్ని వర్గాల వాళ్లకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలిచ్చినం. అవి కూడా పెంచుతామని చెప్పింద్రు. ఇష్టమొచ్చినట్టు బరితెగింపుగా మాట్లాడింద్రు. ఆవేవి? కేసీఆర్ దళిత బంధుకు రూ.10 లక్షలిస్తే మేము రూ.12 లక్షలిస్తమన్నరు. ఇష్టం వచ్చిన మాటమాట్లాడింద్రు. మీ నోటికి మొక్కాలె. అది కూడా 100 రోజుల్లోపలనే ఇస్తమన్నరు. కార్డులు పంచింద్రు. సంతకాలు పెట్టి బాండ్ రాసిచ్చింద్రు. ఇంటింటికీ కార్డులు పంచి మోసంచేసింద్రు. చివరికి శఠగోపం పెట్టింద్రు. దిక్కుమాలిన దరిద్రమంతా నెత్తిన పెట్టి కంప్లీట్ ప్రజలను టెంప్ట్ చేసింద్రు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మండలి విపక్షనేత సిరికొండ , మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజా ఉద్యమానికి శ్రీకారం

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై రెండేండ్ల నుంచి నేను మౌనం పాటించి చూసుకుంటూ వస్తున్న. తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు నేను బయలుదేరిన. ఇక తప్పదు. ప్రజల మధ్యలో అటు కేంద్రాన్ని ఎక్స్‌పోజ్ చేస్తం. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా ఎండగడుతం. ఇవ్వాళ మొత్తం విస్తారంగా మాట్లాడినం. చర్చించినం. చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతం. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెడుతం. ప్రజా ఉద్యమాలు చేస్తం. పెద్ద బహిరంగ సభలు పెడుతం. బహిరంగ సభలకు నేను స్వయంగా అటెండ్ అవుతున్నా. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని ఎండగడుతం. -కేసీఆర్

గిట్టుబాటు ధర, రూ.500 బోనస్ ఏది?

ఈ దద్దమ్మ పాలనలో రాష్ట్రంలో ఇవ్వాళ వడ్లు కొంటలేరు. రైతులకు గిట్టుబాటు ధర ఏది? ప్రతి ధాన్యానికి లిస్ట్ పెద్ద లిస్ట్.. శాంతాడంత లిస్ట్ చెప్పింద్రు. కందులకు ఇంత, మినుములకు ఇంత, పసుపునకు ఇంత, పప్పునకు ఇంత, మొక్కజొన్నకు ఇంత అని అన్నిటికీ రూ.500 బోనస్ అన్నరు. అన్నిటికీ చెప్పి దేనికీ దిక్కులేదు. పత్తి కొనే దిక్కులేదు. వడ్లు కొనే దిక్కులేదు. పాపం రైతులు ప్రైవేట్‌కు అమ్ముకొని దోపిడీకి గురవుతున్నరు.

రైతుల కోసం 7,100 కొనుగోలు కేంద్రాలు

7,100 కొనుగోలు కేంద్రాలు పెట్టినం. ఊర్లోకి పోయి కొన్నం. ధాన్యం నెత్తిన పెట్టుకొని వాళ్లు అంగడికి వచ్చి మార్కెట్లలో తిరుగుడు బంద్ చేసినం. అరాచక పాలనలో రెండు సార్లు రైతు బంధు ఎగ్గొట్టింద్రు. పెన్షన్ 4000 ఇస్తామని ఎగ్గొట్టింద్రు. రాష్ట్రంలో చాలా భయంకరమైన పరిస్థితి తెచ్చింద్రు. వాళ్ల నోటికి మొక్కాలె.. నిరుద్యోగ భృతి ఇస్తం, తోక ఇస్తం, నోటిఫికేషన్లు ఇస్తం, జాబ్ క్యాలెండర్లు ఇస్తం, విద్యా భరోసా కార్డులిస్తమని మోసపూరిత మాటలు అడ్డం వేస్తే.. ప్రజలు ఓటేసింద్రు. తీరా వీళ్లు అందర్నీ ముంచింద్రు.

ఇదీ పింఛన్ల అసలు కథ..

ఒక సందర్భంలో నేను అడిగిన. అసలు మనం పెన్షన్ ఎందుకిస్తం? దానికో పరమార్థమో, పర్పసో ఉన్నదా? లేకపోతే ఉత్తగనే అట్లా పంచి పెట్టడమా? ఏందసలు? అంటే 'మీ ఉద్దేశం ఏంటి సార్' అన్నరు. యాక్సిడెంట్ అయితే తెల్లారి వికలాంగులమైతం. వృద్ధాప్యం వస్తే పట్టించుకునే వాళ్లు లేకపోతే ఎట్ల? అట్లాంటి వాళ్లకు, అనాథలకు, విధివంచితులకు, ఇచ్చేది పెన్షన్. దానికో పరమార్థం ఉండాలె. వాళ్లు బిర్యానీ తినకపోయినా కనీసం రెండు పూటలా పప్పో, పచ్చిపులుసో తిని పండుకునేటట్టు ఉండాలయ్యా' అని చెప్పిన. అప్పుడు గోయల్ సాబ్ అని ఐఏఎస్ ఆఫీసర్.. ఆయన 'ఉప్పు కింత, పప్పు కింత అని అన్ని రేట్లు లెక్కపెట్టి రూ.670 ఇస్తే సరిపోతది సార్' అన్నడు. నేను ఒప్పుకోనయ్యా రూ.1000 పెట్టు అన్నా. సెకండ్ టర్మ్‌లో మమ్మల్ని గెలిపించుకోండి, రూ.2,000 చేస్తమని చెప్పిన. మొదట రూ.1000 ఎవరూ అడగలే. మేమే సుమోటోగా డే వన్ గవర్నమెంట్ వచ్చిన ఫస్ట్ క్యాబినెట్‌లోనే డిసైడ్ చేసి.. రూ.1000 పెట్టినం. రూ.200 నుంచి 1000కి పెరిగింది. రూ.1000 నుంచి రూ.2000 కూడా ఫస్ట్ మంత్‌లోనే సెకండ్ టర్మ్‌లో ఇచ్చినం. వీళ్ల ఫాల్తు మాటలకు జనం కూడా ఏమనుకున్నారో ఏమో.. కేసీఆర్ రూ.2000 అన్నప్పుడు వీళ్లు రూ.4000 ఇస్తామన్నరు అని టెంప్ట్ అయి మాకు ఓటు వేసే ఉద్దేశం ఉన్నా ఆ మాయాజాలంలో పడి గోల్‌మాలై వాళ్లకు ఓట్లేసింద్రు. ఇవ్వాళ తలలు బాదుకుంటున్నరు. తిడుతున్నరు.

> కనీసం వడ్లు కొంటలేరు. రైతులకు యూరియా సప్లయ్ చేసే తెలివి లేదు. ఎరువుల బస్తాలకు యాప్ ఎందుకు? ఇదో రాష్ట్ర ప్రభుత్వమా? అసలు ప్రభుత్వం ఉన్నదా? ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందా తప్ప పాలమూరుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలేదు. తట్టెడు మట్టి తీయలేదు. వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? ఎవరి ప్రయోజనాలు కోరుతున్నట్టు?
> –కేసీఆర్

వచ్చేది మనమే అని ప్రజలంటున్నరు

నిన్న నేను ఫామ్ హౌస్ నుంచి బయలుదేరి హైదరాబాద్ వస్తుంటే.. ప్రామిస్ చెప్తున్నా ప్రజలే అంటున్నరు.. సార్ వచ్చేది మనమే, మన ప్రభుత్వమే అని. ఒక పది ప్లేసెస్‌లో పక్కపొంటివచ్చి.. ఒకాయన కార్లో కూర్చొని స్టీరింగ్ మీద రెండు చేతులు మీదికి పెట్టిండు. బాస్ మళ్లా మనం జల్ది రావాలి. మనమే వస్తున్నం నెక్స్ట్ మనమే అని దుంకుతున్నడు. ఆ మోటార్ బైక్స్‌పై వచ్చేటోళ్లు కూడా పక్కపొంటి రుయ్‌రుయ్‌మని నా పక్కన వచ్చి.. నెక్స్ట్ మనమే సార్. వచ్చేస్తున్నం సార్ అంటూ పోతున్నరు. హైదరాబాద్ సిటీలో అనేక ప్లేసెస్‌లో కనీసం ఒక 10, 12 ప్లేసెస్‌లో అట్లా చెప్తున్నరు జనం. ఇది దేనికి సంకేతం? మీ మీద ప్రజలు విశ్వాసం కోల్పోతున్నరు. రోజురోజుకూ మీ చర్యల వల్ల, మీ పిచ్చి పనుల వల్ల ప్రజలు మార్పు కోరుతున్నరు. మీరు చేసే చర్యలు ఎట్లున్నయి? మొత్తం రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందానా? అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

యూరియా కోసం మళ్లీ లైన్లలోకి చెప్పలొచ్చినయ్!

యూరియా సప్లయ్ చేసే తెలివి లేదా వీళ్లకు? మా గవర్నమెంట్ ఉన్నప్పుడు రైతులు ఆటోకు డబ్బులిచ్చి పది బస్తాలు తెచ్చియ్యి బాబూ అంటే.. తెచ్చి ఎక్కడో పొలంకాడ పడేస్తుండె. ఇవ్వాల రైతులు రోజుల తరబడి లైన్లలో చెప్పులు పెడుతున్నరు. రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పుల లైన్లు ఉండె. బీఆర్ఎస్ ఉన్నన్ని రోజులు చెప్పుల లైన్లు మాయమైనయ్. కాంగ్రెస్ రాగానే మళ్లీ చెప్పుల లైన్లు స్టార్ట్ అయినయ్. మళ్లీ ఇప్పుడు ఏదో యాప్ అట. ఓపెన్ చేస్తే అది నడుస్తలేదు. ఈ ఎరువుల బస్తాకు యాప్ ఎందుకయ్యా? మూడెకరాల పొలం ఉంటే.. రెండు బస్తాల చొప్పున మూడు సార్లు ఇస్తరట. ఏడికి పోవాలో ఎవరికీ తెల్వదు. అసలు దుకాణాల్లోనే దొరకదు.. ఇక యాప్‌ల ఏడ దొరుకుతది? ఇవ్వాళ గజ్వేల్‌లో చెప్తరు.. రేపు సిద్దిపేటలో చెప్తరు.. ఎల్లుండి సిరిసిల్లలో చెప్తరు. ఏ గోదాముకు పోవాలో తెల్వదు. ఇంతకన్నా జోక్ ఉంటదా? రైతులకు మండల కేంద్రంలో ఎరువుల దుకాణం ఉంటది. తాలూకా కేంద్రంలో ఉంటది. అక్కడ సావుకారు ఉంటడు.. ఇచ్చేటోడు ఉంటడు.. అప్పిచ్చేటోడు ఉంటడు. వీళ్లకు ఆ మాత్రం సోయిలేదా?

డీపీఆర్ పంపితే.. దద్దమ్మలా చూస్తారా?

90 టీఎంసీలకు మా గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ పంపింది. ఇప్పుడేమో ఆ డీపీఆర్ తిప్పి పంపించింద్రు.. దానిమీద సడీసప్పుడు లేదు.. లొల్లీ లేదు.. లొల్లాకాండం లేదు. వాళ్లేది చెప్తే దానికి తల ఊపుతున్నరు. ఎందుకు తల ఊపుతున్నరు? రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, రాష్ట్రానికి వస్తున్న నీళ్లను కూడా కాపాడే పరిస్థితి లేకపోతే.. ఇదేం దద్దమ్మ ప్రభు త్వం? ఇంత చేతగాని ప్రభుత్వం ఉంటే ఎట్ల? నోరు లేని ప్రభుత్వం ఉంటే ఎట్ల? డీపీఆర్ వెనక్కి పంపినప్పుడైనా పెద్దనోరు వేసుకొని పెద్దపెద్దగా గడబిడ చెయ్యాలె కదా?. ఒక 10 టీఎంసీలు పోతుంటే ఒక్కో రాష్ట్రం ఎక్కడిదాకనో పోయి కొట్లాడుతది. కేంద్రం మొత్తం డీపీఆర్ పంపిస్తే ప్రాజెక్టుని ఆగం చేసే పరిస్థితి వస్తే.. వీళ్ల నుంచి సప్పుడులేదు.

-కేసీఆర్

45 టీఎంసీల కోసం లేఖలు రాస్తరా?

ఇరిగేషన్ మంత్రి కేంద్రానికి లెటర్ రాసిండు. మాకు 45 టీఎంసీలకు అనుమతి ఇయ్యండని ఎట్లా రాస్తవు? నీకు అర్థం కాదా? ఏం ముఖం పెట్టుకొని రాస్తవు? ఇదొక ప్రభుత్వమా? ఉన్న వస్త్రానికి పోతే అన్నవస్త్రం పోయినట్టు ఉన్నది. ఉన్నది వదులుకుంటరా ఎవరన్న? ఎవరివి ఈ నీళ్లు? ఆర్లెడీ బచావత్ ట్రిబ్యునల్ తీర్మానంలోనే ఇచ్చింది. దాన్ని కర్ణాటక వాడుతున్నది. అటు మహారాష్ట్ర వాడుతున్నది. వాళ్ల లెక్కల్లో కూడా చూపెడుతున్నరు. ఆల్మట్టి డ్యామ్‌లో వినియోగంలో చూపెడుతున్నరు. మాకు వచ్చిన 21 టీఎంసీలు మేము వాడుతున్నామని చెప్తున్నరు. ఆ రెండు ఎగువ రాష్ట్రాలు వాడుతుంటే.. ఆ బచావత్ ట్రిబ్యునల్ ద్వారా వచ్చిన 45 టీఎంసీలను మీరెందుకు ఆపుతున్నరు?

-కేసీఆర్

నిద్రపోతున్నదా? దందాలు చేస్తున్నదా?

రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వం చూస్తూ కూర్చుంటుందా? ఇదొక రాష్ట్ర ప్రభుత్వమా? ఇక్కడ ప్రభుత్వం ఉన్నదా? నిద్రపోతున్నదా? ఎంతసేపూ రియల్ ఎస్టేట్ దందా తప్ప ఇంకోటి లేదా? హిల్ట్ భూములు ఎట్ల మ్ముదాం? ఆ భూములను ఎట్ల దెబ్బ కొడుదాం? ఇండ్ల ఎంత కమీషన్ కొడుదాం? ఇది తప్ప రాష్ట్ర ప్రయోజనాలు, నీళ్లు, రైతుల ప్రయోజనాలు పట్టవా? మనుషులు లేరా? ప్రాజెక్టులకు ఎందుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలే? ఎందుకు తట్టెడు మట్టి తీయలే? ఎవరు నిరోధించింద్రు మిమ్మలను? ఎవరు అడ్డుపడ్డరు మీకు? ఎవరు కట్టేసింద్రు మీ కాళ్లను? అటు పైసా పని చేయరు. నిష్క్రియాపరత్వంగా ఉంటరు. డీపీఆర్ పంపిస్తే చప్పుడు చేయరు. ఇవాళ చివరికి 45 టీఎంసీలు కావాలని రాస్తరు. అంటే ఏం కాబోతున్నది? ఎవల ఒత్తిడి ఉన్నది దీని వెనుక? ఏం కుట్ర దాగి ఉన్నది?

-కేసీఆర్

రాజన్న ఆలయ విస్తరణపై నీలినీడలు?

- ఆగిపోయిన ఫైల్ ఫౌండేషన్ పనులు
- చెన్నై నుంచి వచ్చిన యంత్రాలు వెనక్కి
- ఫౌండేషన్ కోసం మళ్లీ ప్రతిపాదనలు
- నివేదికల రూపకల్పనలో అధికారులు
- ఎప్పుడు పూర్తవుతదో తెలియని పరిస్థితి
- ఈసారి సమ్మక్క భక్తులకు దర్శనం లేనట్టే
- శివరాత్రి కూడా భీమన్న సన్నిధిలోనే..

కరీంనగర్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): యాదగిరిగుట్టకు దీటుగా వేములవాడ రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామంటూ పనులు మొదలుపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఫైల్ ఫౌండేషన్ ద్వారా నిర్మాణాలు చేపట్టేందుకు ఆరంభించిన పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. అందుకోసం తెప్పించిన భారీ యంత్రాలు తిరిగి వెనక్కి వెళ్లాయి. గత ప్రతిపాదనల ప్రకారం పనులు సాధ్యంకాదని గుర్తించిన నిపుణులు, అధికారులు మళ్లీ కొత్త ప్రతిపాదనలు, అంచనాలకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తున్నది. కోట్లాది మంది భక్తుల విశ్వాసంతో కూడిన ఈ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పలేని అస్పష్టత నెలకొన్నది. వేములవాడ రాజన్న ఆలయ నిర్మాణ పనులు నాలుగు దశల్లో పూర్తిచేయాలని నిర్దేశించిన ప్రభుత్వం.. అందుకు రూ.696.25 కోట్లు అవసరమని తొలుత అంచనా వేసింది.



ఫైల్ ఫౌండేషన్ వేయడం సాధ్యం కాకపోవడంతో వెనక్కి వెళ్లిన భారీ యంత్రం ఇదే

ఫేజ్-1 కింద రూ.111 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. అయితే, ఇప్పటివరకు రూ.56 కోట్ల విలవైన పనులకు మాత్రమే టెండర్లు పిలిచింది. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు 2024 నవంబర్ 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సంబంధిత కన్సల్టెన్సీ ప్రాథమిక పనుల నిమిత్తం రూ.10 లక్షలు సర్దుబాటు ప్రాతిపదికన వీటీడీఏ ద్వారా 2025 మార్చి 10న చెల్లించారు. 2025 మార్చి 20న జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసినట్టు ప్రకటించిన అధికారులు పూర్తి వివరాలు మాత్రం బహిర్గతం చేయలేదు. కానీ, ఆదరాబాదరగా కూల్చివేతలు ప్రారంభించారు. అక్టోబర్ నుంచి నేటివరకు ఆలయంలో పాత కట్టడాల కూల్చివేతలు జరుగుతున్నాయి తప్ప, నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదు. ఫైల్ ఫౌండేషన్ ద్వారా నిర్మాణాలు చేసేందుకు సాయిల్ టెస్ట్ పూర్తిచేశామని చెప్పిన అధికారులకు ఆదిలోనే చేదు అనుభవం ఎదురైంది.

ఆగమేఘాల మీద కూల్చివేతలు

ఏ ప్రభుత్వమైనా పాత కట్టడాలు కూల్చివేసి, కొత్త నిర్మాణం చేపట్టాలని భావించినప్పుడు పకడ్బందీ ప్రణాళికలు తయారు చేసి ముందుకెళ్తుంది. అందులోనూ దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయ నిర్మాణ పనులు చేపట్టే సమయంలో ఒకటికి నాలుగుసార్లు ఆలోచనలు చేయాలని ముందుగానే నిపుణులు సూచించారు. కానీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా, ఆగమేఘాల మీద కూల్చివేత పనులకు ప్రభుత్వం పూనుకున్నది. కళాభవన్, రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయం, ధర్మగుండం, రాజన్న ఆలయ గోదాం, ఉత్తర రాజగోపురం, కల్యాణకట్ట, ఓపెన్ స్లాబ్, లడ్డూ తయారీ భవనం, కోడెల క్యూ కాంప్లెక్స్ తదితర కట్టడాలను ఇప్పటికే కూల్చివేశారు. ఆయా కార్యాలయాలను భీమేశ్వర సదన్‌కు తరలించారు. కానీ, అభివృద్ధి పనులు మాత్రం ఆరంభ శూరత్వంగానే కనిపిస్తున్నాయి. ఏ నిర్మాణ పని ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. అభివృద్ధి పనుల వివరాలు ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేయాల్సిన స్థానిక అధికారులు విముఖత వ్యక్తంచేస్తున్నారు. లోపల ఏం జరుగుతున్నది? ఎన్ని పనులు ప్రారంభించారు? ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అనే ప్రశ్నలకు ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. పనులు వేగవంతంగా పూర్తిచేసి, సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు రాజన్న దర్శనం కల్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మాట దాటవేస్తున్నారు. రెండేండ్లకోసారి జరిగే తెలంగాణ కుంభమేళాకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీ ఉన్నది. వచ్చే జనవరిలోనే మేడారం జాతర ఉండగా ఇప్పటివరకు అధికారులు దర్శనం విషయంలో ఎటువంటి ప్రకటనలూ చేయడంలేదు. ఇదిలాఉంటే.. రాజన్న క్షేత్రంలో అంగరంగ వైభవంగా జరిగే మహాశివరాత్రి వేడుకలు కూడా ఈసారి భీమేశ్వర ఆలయంలోనే నిర్వహించే విధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పర్వదినం ఉండగా, అప్పటివరకు ఏ మేరకు పనులవుతాయో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది.

మొరాయించిన యంత్రాలు

ఆలయ ప్రాంగణంలో ఒకవైపు చెరువు, మరోవైపు చెరువు కట్టపై దేవాలయం ఉన్నది. ఇక్కడ సిమెంట్ కాంక్రీట్‌తో పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపట్టేందుకు నవంబర్ 17న భారీ యంత్రాలను వేములవాడకు తెప్పించారు. అంతకంటే ముందు నవంబర్ 12న రాజన్న ఆలయాన్ని మూసివేశారు. నిర్మాణ పనులు జరుగుతున్నందున దేవాలయాన్ని మూసివేస్తున్నట్టు ప్రకటించి, ఫైల్ ఫౌండేషన్ పనులు నవంబర్ 22న ప్రారంభించారు. కానీ, వారం తిరగకుండానే పనులు నిలిచిపోయాయి. ఫైల్ ఫౌండేషన్ పనులు చేయలేమని తేల్చిచెప్పింది. నిజానికి 50 ఏండ్ల కింద దేవాలయ పునర్నిర్మాణం జరిగిన సమయంలో చెరువు కట్టపై భారీ రాళ్లను అమర్చి, తద్వారా నిర్మాణం జరిగిందని స్థానికులు చెప్తున్నారు. ముందుగానే ఈ విషయాన్ని స్థానికులు చెప్పినా అధికారులు కొట్టిపారేశారు. ఫైల్ ఫౌండేషన్ ద్వారా సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. కానీ, తీరా పని మొదలుపెట్టగానే యంత్రాలు మొరాయించాయి. ఫైల్ ఫౌండేషన్ వేసే సమయంలో గతంలో నిర్మాణానికి వినియోగించిన పెద్ద రాళ్లు అడ్డు పడుతుండటంతో యంత్రాలు పనిచేయకుండా పోతున్నాయని చెప్పిన సంబంధిత అధికారులు, నిర్వాహకులు పనులు ఆపివేశారు. సదరు భారీ యంత్రం ద్వారా రోజుకు 10 నుంచి 20 ఫైల్స్ వేయాల్సి ఉండగా, మూడు రోజులకు కేవలం మూడు ఫైల్స్ ఫౌండేషన్ చేయడానికే నానా తంటాలు పడాల్సి వచ్చింది. అవి కూడా మధ్యలోనే ఆగిపోయినట్టు తెలుస్తున్నది. దీంతో కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక బృందం.. ఫైల్ ఫౌండేషన్ పనులను పరిశీలించి ఇకపై ఫైల్ ఫౌండేషన్ ద్వారా పనులు చేయడం సాధ్యంకాదని తేల్చిచెప్పినట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను సదరు సాంకేతిక బృందం సమర్పించినట్టు తెలుస్తున్నది. దీంతో ఇప్పుడు మళ్లీ యంత్రాంగం కొత్త ప్రతిపాదనలను సిద్ధంచేసినట్టు అధికారవర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడుతున్నారు. ఇదే సమయంలో మళ్లీ సాయిల్ పరీక్షలు నిర్వహించి ఎలా ముందుకెళ్లాలో సమాలోచనలు చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. అంటే ప్రణాళికాలోపం ఉన్నదన్న విమర్శలు వస్తున్నాయి.



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబిత, నిరంజన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

పాలమూరుకు ద్రోహం చేసింది కాంగ్రెస్, టీడీపీలే..

ఆ రెండు పార్టీలు ఒక్క ప్రాజెక్టు కట్టలే.. చుక్క నీరివ్వలే.. • 308 కి.మీ కృష్ణానది పారే జిల్లాలో నాడు గంజి కేంద్రాల దుస్థితి

ఈ రెండు పార్టీల కంటే బచావత్ ఎంతో నయం

పాలమూరు గోస చూడలేక 17 టీఎంసీలు కేటాయించిండ్రు

- ఎస్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టుల రద్దు
- మహబూబ్‌నగర్‌కు ఈ ప్రాజెక్టులు కొత్తవేం కావు
- గతంలోనే 174 టీఎంసీలతో ప్రాజెక్టులకు రూపకల్పన
- గులాబీ జెండా ఎగిరేవరకు.. జూరాలను పట్టించుకోలే
- నాడు చంద్రబాబు శంకుస్థాపనలే తప్ప.. పూర్తిచేయలే
- తెలంగాణ ప్రాజెక్టుకు కేవలం 13 కోట్లు కూడా ఇవ్వలేదు
- నేను గర్జిస్తే కర్ణాటకకు చంద్రబాబు పరిహారం కట్టిండు
- పాలమూరు నీళ్ల గోస తీర్చినం.. 8 లక్షల ఎకరాలకు నీళ్లు
- మీడియాతో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయడమే తెలంగాణకు పెనుశాపమైందని, మరీ ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్రాతి తీవ్రమైన అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టంచేశారు. పాలమూరుకు తీరని ద్రోహం చేసింది ఆ రెండు పార్టీలేనని మండిపడ్డారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత 20 ఏండ్లు పాలించిన తెలుగుదేశం పార్టీ పాలమూరును తిరిగి కోలుకోలేని దెబ్బకొట్టాయని ధ్వజమెత్తారు. జిల్లా మొత్తం కృష్ణా నది పారుతున్నా ఆ జిల్లాకు నీళ్లివ్వకుండా ఎండబెట్టారని, కరువు జిల్లాగా మార్చారని నిప్పులు చెరిగారు. కృష్ణా నది పారే జిల్లాను గంజి కేంద్రాలు పెట్టే జిల్లాగా మార్చారని నిప్పులు చెరిగారు. అప్పటికే మంజూరైన ప్రాజెక్టులను ఎస్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వాలు రద్దు చేశాయని తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ విలేకరులతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో తెలంగాణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న ద్రోహం, తలపెట్టిన దుర్మార్గం.. అన్యాయం గురించి చాలా మందికి తెలియదు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత దారుణ వివక్షకు గురైన జిల్లా పాత మహబూబ్‌నగర్. వనరులు లేక కాదు.. వసతులు లేక కాదు. కృష్ణా నది ప్రవేశించేదే మహబూబ్‌నగర్ జిల్లాలో. ఈ జిల్లాలో అత్యధికంగా 308 కిలో మీటర్ల దూరం కృష్ణానది పారుతుంది. అయినా 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, ఆ తర్వాత 20 ఏండ్లు పాలించిన తెలుగుదేశం పార్టీ పాలమూరుకు తీరని అన్యాయం చేసినయ్. అప్పర్ కృష్ణా, భీమా, తుంగభద్ర ఎడమకాలువ ప్రాజెక్టు ద్వారా 174 టీఎంసీల నీళ్లు పాలమూరు జిల్లాకు రావాల్సి ఉండె.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే శాపం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయడమే తెలంగాణ పాలిట పెనుశాపమైంది. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్రాతి తీవ్రమైన అన్యాయం జరిగింది. స్టేట్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ (ఎస్‌ఆర్‌సీ)లో ప్రతిపాదించి, ఇప్పటికే పనులు జరుగుతున్న ప్రాజెక్టులను మార్చకూడదని, వాటిని తప్పనిసరిగా కొనసాగించాలని చట్టం ఉన్నా వాటన్నింటిని పక్కన పెట్టిండ్రు. దేవునూరు, ఇచ్చంపల్లి ఇట్ల అనేక ప్రాజెక్టులను రద్దు చేసిండ్రు. మహబూబ్‌నగర్‌కు ఇచ్చే పాలమూరు ఎత్తిపోతల పథకం కొత్త స్కీం కాదు. గతంలోనే 174 టీఎంసీల నీళ్లతో ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ వస్తే కూడా ఆ ట్రిబ్యునల్‌ను కలిసి చాలా ప్రయత్నాలు చేసినం. ఉద్యమ సమయంలో ఉపన్యాసాలు, జల సాధన ఉద్యమ సందర్భంలో క్యాసెట్లు, కరపత్రాలు, పోస్టర్ల రూపంలో చాలా రకాలుగా మా గొంతు వినిపించినం. అయితే ట్రిబ్యునల్ అనేది రాష్ట్రాల మధ్య పంచాయితీలు తీరుస్తది. కానీ ఒక రాష్ట్రంలోపల ప్రాంతాల మధ్య వివాదాలను పట్టించుకోదు.

17 టీఎంసీలిచ్చిన బచావత్

బచావత్ ట్రిబ్యునల్ ఏర్పాటైనప్పుడు నీటి పంపకాలు చేసిండ్రు. అందులో పలు కీలక అంశాలు పొందుపరిచిండ్రు. బచావత్ సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి .. ఆయనే స్వయంగా ఈ ప్రాంతంపై ఆందోళన వ్యక్తంచేసిండ్రు. ఈ ప్రాంతం నిజంగానే తీవ్ర నిరాదరణకు గురైంది. ఇప్పటికీ అవుతూనే ఉన్నది అన్నరు. ఇక్కడ మరో విపత్కర, దుర్భర పరిస్థితేందంటే.. అప్పుడు పాలమూరు గురించి గంటెడు నీళ్లు అడిగేవాడే లేడు. కరువు జిల్లాకు నీళ్లు కేటాయించాలని అడిగేవాళ్లే లేరు. ఇది ఆనాటి సమైక్య ప్రభుత్వం చేసిన ద్రోహం. పాలమూరు గోసను చూసిన బచావత్.. సమైక్య ప్రభుత్వం ప్రతిపాదించకపోయినా సుమోటోగా స్వీకరించి 17 టీఎంసీల నీళ్లను జూరాల ప్రాజెక్టుకు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించిండ్రు. ఈ జూరాల ప్రాజెక్టును ఇక్కడి నుంచి (మహబూబ్‌నగర్) తరలించకుండా చేయాలి, ఇక్కడే కట్టి తీరాలి. అందుకే 17 టీఎంసీలు కేటాయిస్తున్నట్టు కండీషన్ పెట్టిండ్రు. ఈ విషయాల్ని ట్రిబ్యునల్‌లోనూ రికార్డు చేసిండ్రు.



తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన తొలినాళ్లలో పాలమూరుకు జలసాధన లక్ష్యంగా 2003 మే 20-25 వరకు కేసీఆర్ అలంపూర్ నుంచి గద్వాల వరకు పాదయాత్ర చేపట్టారు. అలంపూర్‌లో పాదయాత్ర ప్రారంభం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న కేసీఆర్, సభకు అశేషంగా తరలివచ్చిన పాలమూరు ప్రజానీకం

నేను గర్జిస్తే.. చంద్రబాబు పరుగెత్తి పైసలు కట్టిండు

సమైక్య రాష్ట్రంలోనే సమగ్రాభివృద్ధి అంటూ చంద్రబాబు నాయుడు అప్పట్లో స్లోగన్ ఇచ్చిండ్రు. మహబూబ్‌నగర్ టౌన్‌లో భారీ స్థాయిలో ప్రథమ మహాసభ పెట్టినం. దాదాపు 70-80 వేల మంది ఆ సభకు వచ్చిండ్రు. జూరాల ప్రాజెక్టులో కొంత ముంపు ప్రాంతం కర్ణాటక రాష్ట్రంలో ఉంటుంది. రూ.13 కోట్లు ఆ రాష్ట్రానికి పరిహారం కింద ఇవ్వాల్సి ఉండె. కానీ చంద్రబాబు ఆ డబ్బులు కట్టడం లేదు. ఒక్క రూపాయి కట్టడం లేదు. దీంతో ఆ సభలో నాకు బాగా కోపం వచ్చి ఏమయ్యా చంద్రబాబు నాయుడూ? పాలమూరును దత్తత తీసుకున్నవు. డైలాగులు చెప్తున్నవు. ఇక్కడ జనాలు సచ్చిపోతున్నరు. ముంబయికి వలస పోతున్నరు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కర్ణాటకకు కట్టేందుకు నీ దగ్గర డబ్బుల్లేవా? ఇదేనా సమైక్య రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి అంటే? గోడలెక్క బరాజ్ కట్టి వదిలేస్తే చూసుకుంటూ ఉండాల్నా అని ప్రశ్నించిన. నా విమర్శలకు, ప్రశ్నలకు, నా దాడికి తట్టుకోలేక నాడు చంద్రబాబు నాయుడు మోకాళ్లమీద పరుగెత్తి మరీ కర్ణాటకకు పరిహారం డబ్బులు చెల్లించిండు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేనే ఆర్‌డీఎస్ వద్ద బాంబులు పెట్టి పేల్చేసిండు. రెండు, మూడు సార్లు బాంబులు పెట్టి పేల్చిన విషయం అందరికీ తెలుసు.

గులాబీ జెండా ఎగిరేదాకా పట్టించుకోలే

1974లో బచావత్ ట్రిబ్యునల్ నీళ్లు కేటాయిస్తే ఆ తర్వాత జూరాల ప్రాజెక్టును ముట్టినోడు లేడు.. పట్టినోడు లేడు. సీఎంగా అంజయ్య వచ్చి శంకుస్థాపన చేసిండ్రు. అది తెలంగాణ ప్రాజెక్టు కాబట్టి దాని గురించి మాట్లాడినోడు లేడు.. దానికి అయ్యలేడు.. అవ్వలేడు కాబట్టి అనాథలా బరాజ్ వరకు కట్టి వదిలేసిండ్రు. దానికి కాల్వలు తవ్వలే.. నీళ్లు రావు.. పొలాలు పారేదిలేదు. కృష్ణా నది నీళ్లు వచ్చినై వచ్చినట్టే పోతుంటయ్. ఈ తతంగం 2001లో గులాబీ జెండా ఎగిరే వరకు కొనసాగింది. ఇక్కడ ఇంకా గమ్మతైన విషయం ఏందంటే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు మహబూబ్‌నగర్ జిల్లాను దత్తత తీసుకున్నరు. అది చేస్తా, ఇది చేస్తా, పొడిచేస్తా అని మాటలు చెప్పి ఇష్టమొచ్చినన్ని పునాది రాళ్లు వేసిండ్రు. ఉద్యమంలో నేను ఈ పునాది రాళ్లపై ప్రశ్నించేది. ఈ పునాది రాళ్లన్నీ ఎందుకు? చూసుక మురుసుడు, పట్టుక ఏడ్చేందుకా? అని నిలదీసే వాడిని. వీటితో ఏం లాభం? కనీసం ఈ శంకుస్థాపన రాళ్లన్నీ తీసుకెళ్లి కృష్ణా నదిలో అడ్డమేస్తే ఓ చెక్ డ్యామ్ అయితదని చెప్తే ప్రజలు నవ్వేవాళ్లు. చుక్క నీళ్లు కూడా పొలాలకు రాలేదు. దీని ఫలితంగా పాలమూరు జిల్లాలో ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి ఇలా అన్ని తాలూకాల నుంచి బొంబాయికి డైరెక్ట్ బస్సులు నడిపేవాళ్లు. ప్రజలు పొట్ట చేతపట్టుకొని వలస పోవడం తప్ప గతిలేదు. ఆ జిల్లా నుంచి అనేక మంది కవులు అనేక పాటలు రాసిండ్రు. గోరటి వెంకన్న 'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే పాలమూరులోనా' అనే పాట రాసిండ్రు. తెలంగాణ ఉద్యమంలో మోగిన పాట అది.

మొదటిది జోగులాంబ-గద్వాల యాత్ర

తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత ఉద్యమంలో నేను ఎంచుకున్న ఎజెండాలో మొదటిది జోగులాంబ-గద్వాల పాదయాత్ర. ఈ అన్యాయం సంగతిని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అసలు తెలంగాణ ఉద్యమం ఎందుకు చేస్తున్నామో లోకానికి తెలువాలని జోగులాంబ నుంచి గద్వాలకు పాదయాత్ర చేసిన. 85 వేల ఎకరాలకు నీళ్లు పారాల్సిన ఆర్‌డీఎస్ కెనాల్ 10 వేలు, 20 వేల ఎకరాలకు తగ్గిపోయింది. అయినా అడిగే నాథుల్లేడు. అయితే ఆర్‌డీఎస్ హెడ్ వర్క్స్ కర్ణాటకలో రాయచూర్ దగ్గర ఉంటయి. ఉమ్మడి పాలమూరు నాయకులతో కలిసి మేమంతా అక్కడికి వెళ్లి ఆ కాలువ మొత్తం తిరిగి అర్థం చేసుకొని ఆ తర్వాత పాదయాత్ర ప్రారంభించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినం. ఆ తర్వాత మళ్లీ గొడవ చేస్తే జూరాల టు ఆర్‌డీఎస్‌కు లింక్ కెనాల్ మొదలు పెట్టారు. ఇట్ల చంద్రబాబు నాయుడు ప్రతిసారీ తెలంగాణ ప్రజలను ఏమార్చడం, డ్రామా చేయడం తప్ప ప్రాజెక్టులు పూర్తి చేసింది లేదు.. చుక్క నీళ్లు వచ్చింది లేదు.

> గమ్మతైన విషయం ఏందంటే అప్పటి సీఎం చంద్రబాబు పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నరు. అది చేస్తా.. ఇది చేస్తా.. పొడిచేస్తా.. అని మాటలు చెప్పి ఇష్టమొచ్చినన్ని పునాది రాళ్లు వేసిండ్రు. ఉద్యమంలో నేను ఆ పునాది రాళ్లపై ప్రశ్నించేది. ఈ పునాది రాళ్లన్నీ ఎందుకు? చూసుక మురుసుడు, పట్టుక ఏడ్చేందుకా? అని నిలదీసే వాడిని. వీటితో ఏం లాభం? కనీసం ఈ శంకుస్థాపన చేసిన రాళ్లన్నీ తీస్కపోయి కృష్ణానదికి అడ్డమేస్తే ఓ చెక్ డ్యాం అయితదని చెప్పిన.
>
> -కేసీఆర్



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో నీటిని తొలుత అంజనాగిరి (నార్లాపూర్) రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు, తర్వాత వట్టెం, కరివెనకు తరలించాల్సి ఉంటుంది. రిజర్వాయర్లు, కాలువలు పూర్తయ్యాయి. నార్లాపూర్- ఏదుల మార్గంలో 800 మీటర్ల మేర రాయి తొలగింపు పనులు రెండేండ్లుగా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్నాయి.

గంజి కేంద్రాలు.. ప్రాజెక్టుల 'పెండింగ్'

అలా కొట్లాడుతూ పోయినం.. ప్రజలు కలిసి వచ్చిండ్రు.. సందర్భం కలిసి వచ్చింది.. తెలంగాణ అదృష్టం బాగుండి రాష్ట్రం ఏర్పడింది. పాలమూరు జిల్లా దరిద్రం, ఆ దరిద్రంలోకి పాలమూరు నెట్టివేయబడ్డ పరిస్థితి. అందుకే నేను ఎప్పుడూ మొత్తుకునేటోడిని.. తెలంగాణ వెనుకబడిన ప్రాంతంకాదు. వెనుక పడేయబడ్డ ప్రాంతం. వెనుకకు నెట్టివేయబడ్డ ప్రాంతంమని చాలాసార్లు చెప్పిన. ఈ కరువు పరిస్థితి ఎక్కడి వరకు వెళ్లిందంటే.. ఎండ కాలం వచ్చిందంటే పాలమూరు కేంద్రాల్లో గంజి కేంద్రాలు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. దీన్ని చూసి మేమంతా ఓ రోజు ఏడ్చినం. తిండి దొరక్క ముసలోళ్లు చచ్చిపోయేటోళ్లు. కమ్యూనిస్టులు, ఇతరులు కొందరు గంజి కేంద్రాలు పెట్టి కడుపు నింపేటోళ్లు. 308 కిలో మీటర్ల కృష్ణా నది పారే ఈ జిల్లాలో ఇంత దారుణ పరిస్థితులు ఏర్పడ్డయి. సీఎం దత్తత ప్రాంతమైనా ఏమీ ఇవ్వలే. ఇక అందంగా ఈ ప్రాజెక్టులకు 'పెండింగ్ ప్రాజెక్టులు' అనే టైటిల్ పెట్టిండ్రు. ఇదేదో గొప్పతనంలెక్క! పెండింగ్ ప్రాజెక్టుల జాబితాలో వాటిని తోచేసే పాలమూరు పరిస్థితిని దిగజార్చిండ్రు.

స్వరాష్ట్రంలో పాలమూరు గోస తీర్చినం

రాష్ట్రం వచ్చిన తర్వాత నదులు, ప్రాజెక్టులపై మొత్తం సమీక్ష చేసినం. గోదావరి ఏంది? కృష్ణా ఏంది?, మనకు రావాల్సిన వాటా ఎంత? దగా జరిగింది ఎక్కడ? ఎలా ముందు కెళ్లాలి? ఏం చేయాలనే దానిపై తీవ్రంగా మథనపడ్డం. ఇక్కడ అత్యంత భయంకరమైన కరువు ఉన్నది కాబట్టి పాలమూరు జిల్లాను టాప్ ప్రయారిటీలో ఆదుకోవాలని నిర్ణయించినం. మొదట యుద్ధ ప్రాతిపదికన చంద్రబాబు పేరు పెట్టిన పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్‌లో పెట్టినం. నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఇలా అన్ని ప్రాజెక్టులను లైన్లోకి తీసుకొచ్చి పనులు మొదలుపెట్టినం. మా ప్రభుత్వంలోనే వీటి ద్వారా జిల్లాలో నికరంగా 6.5 లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందించినం. అంతకు ముందు కనీసం 30 వేల ఎకరాలకు కూడా పారకం లేదు. పాలమూరుకు వలసల జిల్లా అని పేరెందుకు వచ్చింది? ప్రజలు ఎందుకు వలస పోతరు? ఎంత బాధ, ఎంత దుఃఖం ఉంటే పోతరు? మిషన్ కాకతీయ పథకంలోనూ టాప్ ప్రయార్టీ ఇచ్చి మైనర్ ఇరిగేషన్‌లో వాటి సామర్థ్యం పెంచి 1.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు ఉపయోగపడింది. చాలా వాగులపై వందల సంఖ్యలో చెక్ డ్యాంలు నిర్మించినం. ఇక ఆర్‌డీఎస్ కెనాల్‌ది మోసం జరిగింది కాబట్టి మధ్యలో తుంగభద్రపై పెట్టి తుమ్మిళ్ల లిఫ్ట్ పెట్టించి పూర్తి చేసినం. నీళ్లు పారిచ్చినం' అని ఈ సందర్భంగా కేసీఆర్ వివరించారు.

కాంగ్రెస్ వచ్చి తట్టెడు మట్టి తీయలే

'పాలమూరు-రంగారెడ్డి'ని ఎందుకు ఆపిండ్రు? • ఏ కారణంతో పక్కన పెట్టిండ్రు? ఇంత నిష్క్రియాపరత్వమా?

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌వి పూర్తిచేస్తూనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినం

170 టీఎంసీలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నం • ఏపీ వ్యతిరేకత, ఆంక్షలున్నా నికర లెక్కలు తెప్పించినం

ఇబ్బందులున్నా 27 వేల ఎకరాలు సమీకరించినం • అడ్డంకులన్నీ అధిగమించి 90శాతం పూర్తిచేసినం

ఇప్పుడు డీపీఆర్‌ను కేంద్రం వాపస్ పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుయ్యిలేదు.. కుటుక్కులేదు: కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక తొలి ప్రాధాన్యతగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తూనే, ఉమ్మడి మహబూబ్‌నగర్‌ను పచ్చగా మార్చేందుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని బీఆర్ ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించారు. తాము 90 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టి పాలమూరు రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు ప్రాజెక్ట్‌పై అధికారులు, పార్టీ నాయకులతో మాట్లాడినం. క్యాబినెట్‌లో చర్చించినం. 170 టీఎంసీలు తీసుకోవాలన్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్ట్రాటజీ. ఏపీ నుంచి వచ్చే వ్యతిరేకత, ఆంక్షలను దృష్టిలో పెట్టుకొని నికరంగా లెక్కలు తెప్పించినం. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం మహబూబ్‌నగర్‌లో మైనర్ ఇరిగేషన్ పాత చెరువులెన్ని? ఉన్నవెన్ని? మాయమైనవెన్ని? వాటి సామర్థ్యమెంత? అని లెక్కలు తీసి.. కేంద్రానికి సమర్పించినం. ఇవి 45 టీఎంసీలుగా తేలినయ్. ఆ తర్వాత పాలమూరు - రంగారెడ్డికి 90.81 టీఎంసీలు కేటాయించినం. ట్రిబ్యునల్ వచ్చాక మనకొచ్చే వాటాతో 170 టీఎంసీలు తీసుకుందామన్న ఆలోచనతో ఆరోజు 90.81 టీఎంసీలు కేటాయించినం. బచావత్ ట్రిబ్యునల్‌లో ఈ విషయం స్పష్టంగా ఉన్నది.

భూమి, ఆకాశాన్ని ఏకం చెయ్యాలె

మేమున్నన్ని రోజులు పాలమూరు డీపీఆర్ వాపసు రాలే. డీపీఆర్ వాపస్ వస్తే రాష్ట్ర ప్రభుత్వం భూమి. ఆకాశాన్ని ఏకం చెయ్యాలె. లొల్లి, హడావుడి చెయ్యాలె. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీస్కపోవాలె. వడ్లు కొనకపోతేనే మేం ఢిల్లీలో ధర్నాచేసినం. మంత్రులు, ఎమ్మెల్యేలం ఢిల్లీకి పోయి కేంద్రం మెడలు వంచినం. 20 లక్షల టన్నులు కొంటామన్న ఒప్పందం మీద సంతకం చేయించుకొని వచ్చినం. ఎఫ్‌సీఐతో వడ్లు కొనిపిచ్చినం. మూడు జిల్లాలకు సంబంధించిన డీపీఆర్ వాపస్ పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుయ్యిలేదు.. కుటుక్కులేదు. ఎవరికీ చెప్పలే.. బయటపెట్టలే. కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి పంపించినా కిమ్మనలే.

145 మెగావాట్ల పంప్‌లు పెట్టినం

'ఆంధ్రావాళ్లు గోదావరి నుంచి కృష్ణా డెల్టాలకు నీళ్లు తెచ్చుకుంటున్నరు. దీంట్లో భాగంగానే 80 టీఎంసీలు తీసుకున్నరు. కాబట్టి పై రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం నీళ్లిస్తామని డీపీఆర్‌లో స్పష్టంగా చెప్పిండ్రు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఈ నీళ్లు ఇస్తారు. అందులో తెలంగాణకు 45, కర్ణాటకకు 21, మహారాష్ట్రకు 14 టీఎంసీలివ్వాలి. కర్ణాటక, మహారాష్ట్ర ఈ మేరకు నీళ్లు వాడుకుంటున్నయ్. ట్రిబ్యునల్ కేటాయించిన 45 టీఎంసీలు, మైనర్ ఇరిగేషన్‌లో నష్టపోయిన 45 టీఎంసీలు కలిసి 90.81 టీఎంసీలతో పాలమూరు-రంగారెడ్డిని ప్రతిపాదించినం. భవిష్యత్తు అవసరాల మేరకు ప్రాజెక్టు చేపట్టినం. రూ.35 వేల కోట్లు కేటాయించినం. 27 వేల కోట్లు ఖర్చుచేసి, 88-90% పనులు పూర్తిచేసినం. ఆంధ్రాతో పంచాయితీ ఉంటదని వీలైనంత తొందరగా నీళ్లు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 145 మెగావాట్ల పంప్‌లు పెట్టినం. ఇలాంటి పంప్‌లు దేశంలో ఎక్కడా లేవు. ఈ పంప్‌లను బీహెచ్‌ఈఎల్ ప్రత్యేకంగా తయారుచేసిచ్చింది. స్వయంగా నేను ఒక పంప్ స్టార్ట్ చేయగానే కాల్వల్లో నీళ్లు పారినయి. మిగిలిన పంప్‌లన్నీ ఇన్‌స్టాల్ చేసిం డ్రు. ఆ తర్వాత అనుమతులపై అనేక మెలికలు పెట్టిండ్రు. భూ సేకరణలో ఇబ్బందులు తెచ్చిండ్రు. అయినా 27 వేల ఎకరాలు సమీకరించినం. గ్రీన్ ట్రిబ్యునల్‌కు పోతే స్టేను రద్దుచేయించినం. అడ్డంకులు తెస్తే అధిగమించినం' అని కేసీఆర్ గుర్తుచేశారు.



ఇంత నిష్క్రియాపరత్వమేందో?

రాజకీయాల్లో గెలుపోటములు.. ప్రభుత్వాలు మారుడు సహజం. ఎంత తెలివి తక్కువ, దద్దమ్మ ప్రభుత్వం వచ్చినా పాత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కొనసాగించాలె. ప్రాజెక్టులంటే రాష్ట్ర ప్రయోజనాలు. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం తట్టెడు మట్టి తీయలే. రెండేండ్లు గడిచినయ్. ఈ ప్రాజెక్టును ఎందుకు ఆపిండ్రో? ఏ కారణంతో పక్కనపెట్టిండ్రో? ఇంత నిష్క్రియాపర్వమేందో? ఇంత దారుణమేందో? తెలియడం లేదు.

మొదట్నుంచీ తెలంగాణకు బీజేపీ శని

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదో తమాషా. మొదటి నుంచీ తెలంగాణకు బీజేపీ శని. ప్రతిదాన్ని వ్యతిరేకించడమే దాని పని. చంద్రబాబు ఎన్డీఏలో చేరాక ఆయన మాటలు పట్టుకుని అడ్డంగా వ్యతిరేకించడమే బీజేపీ వ్యవహారంగా మారింది. మేమున్నన్ని రోజులు కేంద్రంపై కొట్లాడినం. అనేక పోరాటాలు చేసినం. పాలమూరుకు మొత్తం తొమ్మిది, పది అనుమతులు అవసరమైతే ఆరు అనుమతులు సాధించినం. అతి ముఖ్యమైన పర్యావరణ అనుమతులు పొందినం. మిగిలిన అనుమతులన్నీ లాంఛనమే. అతి ముఖ్యమైన అనుమతులొచ్చాక కేంద్రం మొన్న కొత్త మెలికపెట్టింది. బీజేపీకి చంద్రబాబు, నితీశ్ అవసరమున్నది. ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ ఎంతకైనా దిగజారుతది. చంద్రబాబు మాటలు పట్టుకుని పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వాపస్ పంపింది.

మేం కోర్టుకెళ్తే ట్రిబ్యునల్ వేసిండ్రు

దేశంలో ఒక కొత్త రాష్ట్రం ఏర్పడితే కొన్ని సంక్రమణలుంటయ్. నీళ్లు, వాటాలు సంక్రమిస్తయ్. ఇది ఎస్సార్సీ యాక్ట్. దేశంలో మొదట్లో 14 రాష్ట్రాలుంటే, కొత్తగా 15 రాష్ట్రాలు ఏర్పాటైనయ్. ఓ పద్ధతి ప్రకారం హైకోర్టు వనరుల పంపిణీ విషయంలో లెక్కున్నది. ఏడాది లోపు అయితే రెండు రాష్ట్రాలు పరిష్కరించుకోవాలి. ఏడాది దాటితే కేంద్ర ప్రభుత్వం ఆర్బిట్రేషన్ చేయాలి. లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. ఏడాది వరకు చూసి మేం సెక్షన్-3 అమలు చేయాలని, కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని కేంద్రానికి అప్పీల్ చేసినా, ఖాతరు చేయలేదు. మేం సుప్రీంకోర్టుకు వెళ్తే కేంద్రాన్ని చీవాట్లు పెట్టింది. ఆ తర్వాత గజేంద్రసింగ్ షెకావత్ స్పందించి సెక్షన్-3 వేస్తాం.. కేసు విత్‌డ్రా చేసుకోవాలని కోరితే విత్‌డ్రా చేసుకున్నం. విత్‌డ్రా చేసుకున్నట్టు లేఖరాస్తే సెక్షన్ -3 వేసిండ్రు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వేసిండ్రు. నీళ్ల పంపిణీపై వాదనలు నడుస్తున్నయ్.

నియోజకవర్గానికి లక్ష ఎకరాలు

కృషించి, కునారిల్లి ఆరవై ఏండ్లు ఏడ్చి గోసపడ్డ పాలమూరుకు ఎత్తిపోతల పథకంతో ఉపశమనం కల్పించాలనుకున్నం. పాలమూరు జిల్లాలో నియోజకవర్గానికి లక్ష ఎకరాలు పారాలన్నది మా సంకల్పం. గ్రావిటీ ద్వారా కొంత.. లిఫ్టుల ద్వారా మరి కొంత నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున పారాలన్నది మా లక్ష్యం. తెలంగాణ వచ్చాక నాలుగైదేండ్లకు పాలమూరు అద్భుతంగా తయారైంది. చెక్‌డ్యామ్‌లతో భూగర్భజలాలు పెరుగుతయ్. ఉచిత విద్యుత్తుతో సాగు బాగుపడ్డది. నేనోసారి పోయినప్పుడు చూసి అబ్బురపడ్డ. అంతకు ముందు పాడుపడ్డ ఇండ్లు ఉండేవి. తర్వాత కల్లాలు, వరికోత మిషన్లు, గ్రామాల్లో వచ్చిన మార్పును నా కండ్లతో స్వయంగా చూసిన. అనుకున్నట్టు 15 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయనుకొని సంతోషపడ్డ' అని కేసీఆర్ వివరించారు.

811 నుంచి 1,005 టీఎంసీలకు పెరిగింది

గతంలో చట్ట ప్రకారం 75% డిపెండబిలిటీని బట్టి నీళ్లను కేటాయించేవారు. కానీ 65% డిపెండబిలిటీ బట్టి నీళ్లు కేటాయిద్దామని బ్రిజేష్‌కుమార్ నిబంధనలు పెట్టారు. దీని ద్వారా కృష్ణాలో బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం మనకు వచ్చిన ఒరిజినల్ అలాట్‌మెంట్ 811 టీఎంసీలే. బ్రిజేష్ ట్రిబ్యునల్ తర్వాత ఇది 1,005 టీఎంసీలకు పెరిగింది. 10% కలపడంతో 195 టీఎంసీలు పెరిగినయ్. పెరిగిన వాటా మనకు వస్తది. ఒరిజినల్‌గా పెట్టిన 90 టీఎంసీలు, అదనంగా వచ్చేవి కలిపితే 160-170 టీఎంసీలు తీసుకోవచ్చు. పాలమూరును సుభిక్షం చేద్దామనుకున్నం. గతంలోని ఆరున్నర లక్షల ఎకరాల ఆయకట్టు, పాలమూరు ఎత్తిపోతలతో 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు మొత్తం కలిపితే 13.5 లక్షల ఆయకట్టుకు నీళ్లందించాలనుకున్నం.

> రాజకీయాల్లో గెలుపోటములు.. ప్రభుత్వాలు మారుడు సహజం. ఎంత తెలివి తక్కువ దద్దమ్మ ప్రభుత్వం వచ్చినా పాత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కొనసాగించాలె. ప్రాజెక్టులంటే రాష్ట్ర ప్రయోజనాలు. ప్రజలను బతికించేవి. ప్రజలకు నీళ్లిచ్చేవి. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పట్టించుకోలే. రెండేండ్లు గడిచిపోయినయ్. ఈ ప్రాజెక్టును ఎందుకు ఆపిండ్రో? ఏ కారణంతో పక్కనపెట్టిండ్రో? ఇంత నిష్క్రియాపరత్వమేందో? ఇంత దారుణమేందో తెలుస్తలేదు.
>
> -బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

> కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదో తమాషా. మొదటి నుంచీ తెలంగాణకు బీజేపీ శని. మేమున్నన్ని రోజులు కేంద్రంపై కొట్లాడినం. ప్రాజెక్టుకు మొత్తం తొమ్మిది, పది అనుమతులు అవసరమైతే. ఆరు సాధించినం. అతి ముఖ్యమైన పర్యావరణ అనుమతులు పొందినం. అతి ముఖ్యమైన అనుమతులొచ్చాక కేంద్రం మొన్న కొత్త మెలికపెట్టింది. కేంద్రానికి చంద్రబాబు అవసరం ఉన్నది కాబట్టి ఆయన మాటలు పట్టుకుని పాలమూరు డీపీఆర్‌ను వాపస్ పంపింది.
>
> -బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్